ఆదివారం
గత వారం రోజులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-4-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 72 పేజీలు: 10+4 వెల: 6.50


ఎన్నికల ర్యాలీలు రద్దు చేసుకుంటున్న విజయ్

5లో

ఇరాక్ అధ్యక్షుడిగా నిజార్ అమెడీ

బిల్లుకు మద్దతివ్వండి: అన్ని పార్టీల నేతలకు ప్రధాని మోడీ లేఖ

**2029లోపే మహిళా రిజర్వేషన్లు**



5

29 తర్వాత అఖిలపక్షం నిర్వహించి బిల్లు పెట్టాలి

ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ

**మహిళా బిల్లుపై అంత తొందర ఎందుకు?**






## దిగ్గజ గాయని ఆశాభోస్లే ఇకలేరు

**తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో కన్నుమూత**

20పైగా భాషల్లో వేలాది పాటలు పాడిన 'పద్మవిభూషణు'రాలు

**తెలుగులోనూ మధురిమలు ఒలికించిన గళం**

సోదరి లతామంగేష్కర్‌కు దీటుగా శిఖరాలు చేరిన గాయని

నేడు ముంబయిలో అంత్యక్రియలు

**ప్రధాని సహా ప్రముఖుల ప్రగాఢ సంతాపం**

**ముంబయి, ఏప్రిల్ 12:** భారతీయ సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసింది. సుప్రసిద్ధ గాయని ఆశా భోస్లే ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో శనివారం ముంబైలోని బ్రీచ్‌కాండీ ఆసు పత్రిలో చేరిన ఆశా భోస్లే చికిత్స పొందుతూ ఆదివారం మధ్యా హ్నం తుదిశ్వాస విడిచారు. శనివారం తీవ్రమైన నీరసం, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెనుకు టుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి >>2

**పది రోజులు ప్రమాదకరస్థాయిలో ఎండలు**

పగటి ఉష్ణోగ్రత 44° దాటే అవకాశం

**తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, సంగారెడ్డి తదితర జిల్లాల్లో 41° దాటిన వేడి**


**ఎపిలోని కడప జిల్లా పొట్టిపాడు, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43° దాటిన ఉష్ణోగ్రతలు**



# రోహిణికి ముందే పగులుతున్న రోళ్లు


## తెలుగు రాష్ట్రాల్లో వడగాడ్పుల సెగలు





**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** సాధారణంగా మే నెల చివరి వారం రోహిణి కార్తెలో రోకళ్లు పలిగేస్థాయిలో కొట్టాల్సిన ఎండలు ఎప్రిల్ ప్రారం భంలోనే దంచికొడుతుండడంతో ప్రజలుబెంబేళెత్తిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఏప్రిల్ నెల ప్రారంభంలోనే భానుడు సుర్రుమనిపిస్తున్నాడు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి పొయ్యిమీద కాలుతున్న పెనంలాగా మారింది. ఒకపక్క అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ రికార్డుస్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు వాతావరణశాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. రానున్న పది రోజుల పాటు ఎండలు దంచికొట్టనున్నాయని జాగ్ర త్తగా ఉండాలని హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడం మంచిదని సూచించింది. రానున్న పది రోజులపాటు విపరీతమైన ఎండ తీవ్రత ఉంటుందని, ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోద వుతాయని తెలిపింది. గరిష్టంగా 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని, ఎండలకు తోడు వడగాల్పులు బలంగా వీస్తాయని స్పష్టం చేసింది. ఈ నెల 22 వరకు భానుడి ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంటుందని, రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని హెచ్చ రించింది. అయితే వారం క్రితం వరకు అక్కడక్కడా వర్షాలు కురవడంతో కాస్త చల్లని వాతావరణం నెలకొంది. ఉత్తర మధ్యప్రదేశ్ నుండి దక్షి ణ తమిళనాడు వరకు వ్యాపించి ఉన్న ద్రోణి ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కాని శనివారం వరకు మరాత్వాడ ప్రాంతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తనం బలహీనపడటంతో రాష్ట్రంలో ఆకాశం నిర్మలంగా ఉండి ఎండ తీవ్రత అసాధరణస్థాయిలో పెరగనుందని వాతావరణశాఖ హెచ్చ రించింది. రానున్న 10 రోజులపాటు పరిస్థితి ఇంకా దారుణంగా ఉండబోతోందని పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరో పది రోజులపాటు తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం నిప్పుల కొలిమిలా మారబోతోందని వాతావ రణశాఖ హెచ్చరించింది. ఇప్పటికే తెలంగాణలోని 31 జిల్లాల్లో >>2

# అందరికి సంక్షేమ ఫలాలు



కులాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్నాం

ప్రజాప్రతినిధుల కుటుంబసభ్యులు ప్రజలపై పెత్తనం చేయరాదు

**ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తులో విజయాలు: సిఎం చంద్రబాబు**

**విజయవాడ ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలులోకి తీసుకుని వస్తున్న ప్రతి పథకం అర్హులైన లబ్దిదారులకు అందాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు,మంత్రులు కీలకంగా వ్యవహరించాలన్నారు.అర్హులైన లబ్దిదా రులకు ఫలానా పథకం అందలేదు,ఈ విషయంలో ఎవ్వరో ఏదో చేసారనే విమ ర్శలు ఉండకూడదన్నారు.ఏపీ అత్యధికంగా ఓటర్లు మనంతో ఉన్నారు.వారి విష యంలో మనం న్యాయసమ్మతంగా వ్యవహరించాలన్నారు సీఎం చంద్రబాబు ఆయా జిల్లాల,నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో తరచు సమావేశం అవు తున్నారు. ఈ క్రమంలో ఆయా సమావేశాలపై సీఎంవో విడుదల చేసిన సమా చార పత్రంలో ప్రభుత్వ సేవల్లో చిన్నపాటిలోపాలు కూడా ఉండకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నెల్లూరు మోడల్ అవలంచించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సం క్షేమ కార్యక్రమాల్ని సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృతంగా ప్రచా రం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల శ్రేణులు కలిసి >>2



# హార్ముజ్ ముట్టడి!

**ఆదేశించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

**టోల్‌ఫీజు చెల్లించే నౌకలు కూడా కట్టడి**

**మంచి ఆఫర్ ఇచ్చినా చర్చలు విఫలం: యుఎస్ ఉపాధ్యక్షుడు జెడివాన్స్**

**వాషింగ్టన్, ఏప్రిల్ 12:** ఇరాన్ యుద్ధ పరిష్కార చర్చలు పాకిస్థాన్‌లో విఫలమవడంతో హార్మజ్ జలసంధిని దిగ్బంధం చేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నావికా దళాలను ఆదేశించారు. మేరీల్యాండ్‌లోని జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కేముందు విలేకరు లతో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఇదే విషయాన్ని తన ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ దీన్ని వెల్లడించారు. ఇరాన్ అక్రమ బలవంతపు దోపిడీని ఆపేందుకు ఈ దిగ్బంధనం తక్షణమే అమల్లోకివస్తుంది. ప్రపంచంలోనే అత్యుత్తమమైన అమెరికా నావికాదళం, హార్మజ్ జలసంధిలోకి వచ్చే.. వెళ్లే నౌకలన్నిం టినీ అడ్డుకుంటుందని పేర్కొన్నారు. ఈ దిగ్బంధనంలో ఇతర దేశాలు కూడా పాల్గొంటాయని ఆయన స్పష్టం చేశారు. ఇస్లామా బాద్ శాంతి చర్చలు యుద్ధానికి ముగింపు పలుకుతాయని >>2



## 16 నుంచి 3 రోజులు ప్రత్యేక పార్లమెంటు

మహిళా బిల్లు సభలోకి

ఎంపిలకు బిజెపి విప్ జారీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ కోసం ఈ నెల 16 నుంచి 18 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగనున్నాయి. ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుపై దృష్టి పెట్టడం, రిజర్వేషన్ అమలు కాలపరిమితికి సంబంధించి కీలక సవరణలు చేసే అవకాశం ఉంది. జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని "నారీశక్తి వందన్ అధినయం 2023" చెబుతోంది. అయితే జనగణనలో జాప్యం జరుగుతున్నందున 2011 జనాభా లెక్కల ఆధారంగానే ముం దుకు వెళ్లాలని కేంద్రం ఆలోచనగా ఉన్నట్టు తెలు స్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకోసం 2023లో ప్రవేశపెట్టిన నారీశక్తి విధాన్‌యాక్ట్‌ను తాజా సమావేశా >>2

# అమరావతి 'క్వాంటం'తో రాష్ట్రం ముందడుగు

**ఐబిఎం రాకతో మారనున్న విశాఖ రూపురేఖలు: మంత్రి లోకేష్**



**విజయవాడ,ఏప్రిల్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో క్వాంటం ఏర్పాటు మహత్తర ముందడుగని మంత్రి లోకేశ్ అభిప్రాయ పడ్డారు. సీఎం దూరదృష్టి ప్రతిరోజూ మమ్మల్ని ఆశ్చర్యపరు స్తోందని లోకేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ ఐబీఎం విశాఖపట్నంలో తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ మేరకు వైజాగ్‌లో ఐబీఎం సంస్థ బోర్డు తాలూకు ఫొటోను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఐబీఎంకు వైజాగ్ తరఫున స్వాగతం అంటూ పోస్టు చేశారు. ఐబీఎం రాకతో విశాఖ ఐటీ స్వరూపం మరింత బలోపేతం అవుతుందని ఆయన గతంలో పేర్కొన్నారు. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఐబీఎం తిరిగి విశాఖకు వస్తోంది. ఇందుకోసం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియాలో ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తన కార్యకలాపాల కోసం ఇప్పటికే నమోదు చేసుకుంది. ఈ కేంద్రం ద్వారా తొలుత 500 మందికి పైగా ఉద్యోగులకు ఉపాధి లభించనుంది. రాబోయే మూడేళ్లలో సుమారు రూ. 321 కోట్ల విలువైన ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమా చారం.రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. గత జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి చం ద్రబాబు, మంత్రి లోకేశ్, ఐబీఎం సీఈవో అరవింద్ కృష్ణతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివ రించారు. ఆ చర్చల ఫలితంగానే ఇప్పుడు ఐబీఎం విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది. గతంలో మధురవాడ ఐటీసెజ్‌లో ఐబీఎంకు కార్యాలయం ఉండేది. ఇప్పుడు మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా విశాఖను కీలక ఐటీ గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ప్రయ త్నాలకు మరింత బలం చేకూరింది. ఐటీహబ్‌గా విశాఖ >>2

## ఉగ్రవాద సూచిలో పాక్ నం.1

5లో



ఆదివారం బండ్లపల్లిలో పాదయాత్ర ముగింపు సభలో పాల్గొన్న డి.రాజా, రామకృష్ణ తదితరులు

## ప్రధాని మోడీని భారత్ క్షమించదు..

నేను వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టాను.. అందుకే ఆపథకం విలువ తెలుసు

పాదయాత్ర ముగింపు సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

# ఉపాధి హామీపై జాతీయ ఉద్యమం

**అనంతపురం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త బ్యూరో:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిన ప్రధాని నరేంద్ర మోడీని దేశ ప్రజలు క్షమించరని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు వామపక్ష పార్టీలతో కలిసి జాతీయస్థాయిలో ఉద్యమాన్ని తీసుకెళ్తామని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరు కార్చిన విధానాన్ని ఎండగడుతూ గత మూడు రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలం సమతా గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర నార్పల మండలం బండ్లపల్లి వరకు సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో సాగిన పాదయాత్ర ముగింపుసభ ఆదివారం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, బి కే ఎం యు జాతీయస్థాయి నాయకుడు గుల్జార్ సింగ్, అనంతపురం సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ ఇతర ముఖ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బండ్లపల్లిలో జరిగిన ముగింపు సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రజల నుద్దేశించి ప్రసంగించారు.ఈ పథకాన్ని ఎక్కడైతే కాం గ్రెస్, వామ పక్షాలు కలిసి అప్పట్లో ప్రారంభం చేసారో అక్కడే బహిరంగ సభ జరగడం చాలా అనందంగా ఉందన్నారు... ఇది ముగింపు సభ కాదు, ఇది ఆరంభ సభ అన్నారు.గ్రామీణ పేద కూలీలకు, సన్న కారు రైతులకు అండగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసి, విబి జి రామ్ జి అనే పథకాన్ని తెచ్చి పేదలకు చాలా అన్యాయం చేసిందన్నారు. నేను వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించాను. అందుకే నాకు వారి ఆర్థిక బాధలు తెలుసు అన్నారు. వలసలు ఆపడం కోసం తెచ్చిన చట్టాన్ని నిర్వీర్యం చేసి కుట్ర పన్నుతున్న మోడీని దేశం క్షమించదు అని రాజా అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పునరుద్దరణ చేసే వరకు మేము పోరాటం చేస్తాం అన్నారు.దేశాన్ని అప్పుల పాలు చేసిన ఘనత మోడీదే అని ఆయన ఆరోపించారు.

**కష్టజీవులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుంది: సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ వెల్లడి:** సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిం చారు. దేశంలో కష్టజీవులు, కార్మికులు, రైతులు ఉన్నం తకాలం ఎర్రజెండా పోరాటం కొనసాగుతూనే ఉంటుం దని ఆయన చెప్పారు. పేద కూలీల కోసం కోసం చేపట్టిన పాదయాత్రను ఎవరు అడ్డుకున్నా వెనక్కి తగ్గేది లేదని, ఎదురొచ్చిన అడ్డంకులను తొక్కుకుంటూ ముందుకు సాగుతామని ఘాటుగా వ్యాఖ్యానిం >>2

# అందరికి సంక్షేమ ఫలాలు

>> పనిచేస్తే తిరుగుండదని పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి ఉంది. ప్రజలతో మమేకమైతే భవిష్యత్తులో మంచి విజయాలు దక్కించుకోవచ్చు. కులాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. అన్ని కులాల్లోనూ మనకు ఆదరణ పెరగాలి. చెడు వెళ్లినంత వేగంగా మంచి వెళ్లదు. ఎమ్మెల్యేలు దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతి నిధులు తన దృష్టికి తెచ్చిన పలు అభివృద్ధి పనులన్నింటి ఆమోదిస్తున్నామని, ఆ దిశలో కార్యచరణ ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు.ప్రజాప్రతినిధులుగా మీరే పాలనా వ్యవహారాల్లో ముందుండాలి కదా..కుటుంబ సభ్యులు, అనుచరుల ప్రమేయం ఎక్కువగా ఎందుకుంటోంది? వారి వ్యవహారాలు శ్రుతిమించితే ప్రభుత్వానికి పార్టీకి నష్టం కలిగిస్తాయి. ఈ పద్దతిని మార్చుకోవాలి అని ముఖ్యమంత్రి కాకినాడ జిల్లా నేతలకు హితవు పలికారు. రామచంద్రాపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం జోరు ఎక్కువగా కనిపిస్తుందని ఆయనను కొంత వెనిక్క తగ్గేలా చూడాలని మంత్రికి సూచించినట్లు సమాచారం. ప్రత్తిపాడు, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అనుచరుల పేర్లు చదివి వారు హద్దు మీరి వ్యవహరిస్తున్నారని , వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పినట్లు తెలిసింది. పెద్దాపురం, జగ్గంపేటలలో వారసుల పనితీరుపైనా పరోక్షంగా నేతలకు సూచించినట్లు సమాచారం. అనపర్తి నియోజకవర్గంలో వైకాపా నుంచి పార్టీలోకి వచ్చిన వ్యక్తికి ఎక్కువత ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని, వాటిని సరిచేసుకోవాలని సీఎం చెప్పారు. కాకినాడ నగరంలో పార్టీ నేతల మధ్య సమన్వయలోపం కనిపిస్తుంది. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ స్థానికంగా అందుబాటులో తక్కువగా ఉంటున్నారు. తుని నియోజకవర్గంలో ఎమ్మెల్యే కంటే వారి కుటుంబ సభ్యులే కార్యక్రమాలను నడిపిస్తున్నట్లు ఉంది. ఇందులో మార్పు రావాలి. ప్రజాప్రతినిధులే ముందుండి నడిపించాలి అని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. జిల్లాకు రేషన్ బియ్యం వ్యవహారం చెడ్డపేరు తెస్తోందని, గంజాయి మూలాలు లేకుండా చూడాలని, ఎమ్మెల్యేలందరితో సమన్వయం చేసుకోవాలని ఎస్పీకి సూచించినట్లు సమాచారం.

ఇక ఇతర నియోజ కవర్గాల ప్రజా ప్రతినిధులతో సీఎం మాట్లాడిన సందర్భంలో గత ప్రభుత్వంలో నాయకులు ప్రజల భూమిపై కన్నేశారని మండి పడ్డారు. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని, పట్టా పుస్తకంపైన జగన్ ఫొటో వేసుకున్నారని గుర్తు చేశారు. ఆస్తి మీదైతే ఫొటో ఆయనది ఉండేదని అన్నారు. గత పాలకులు చేసిన అక్రమాలు, పాపాలు ఇప్పటికీ ఇంకా వెంటాడు తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. గత పాలకులు చేసిన పనులు చూస్తే మతిపోయిందని, నూటికి 90 శాతం రెవెన్యూ సమస్యలపైనే ఆర్జీలు వచ్చేవని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మీకు భూ హక్కు ఇచ్చే బాధ్యత తీసుకోవాలని అప్పుడే సంకల్పించినట్లు చంద్రబాబు తెలిపారు. 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. 16,816 గ్రామాలు రీ సర్వే చేయాలన్నారు. ఇప్పటికే 21.23 లక్షల కొత్త పాస్ పుస్తకాలు ప్రజలకు ఇచ్చామని తెలిపారు. జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంకా 80 లక్షల పాస్ పుస్తకాలు ఇవ్వాలని చంద్రబాబు వివరించారు. ప్రజలకు ఇచ్చే పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరు. కరెన్సీకి వాడే సాంకేతికతే పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడాం. మీ ముందు సర్వే చేయించి రికార్డు చేస్తాం. ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తాం. భూ యజమాని సమక్షంలో మొత్తం ప్రక్రియ నిర్వహిస్తున్నాం.రూపాయి కూడా అవినీతి లేకుండా పాస్ పుస్తకాలు ఇవ్వాలనేది నా ఆలోచన. రికార్డులు ట్యాంపర్ కాకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీ తెచ్చాం. పుస్తకాలపై క్యూఆర్ కోడ్ ఇచ్చాం. మీ భూమి వేరే ఎవరూ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా రికార్డులకు డిజిటల్ లాక్ చేసుకునే అవకాశం కల్పించాం. భూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తున్నామని ఈ సమాచారం ప్రజలకు అవగతమయ్యేటట్లుగా ప్రజాప్రతినిధులు వివరించాలని తెలిపారు.



2008లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ నుంచి పద్మవిభూషణ్ అవార్డు అందుకుంటున్న ఆశాభోంస్లే (ఫైల్)

# దిగ్గజ గాయని ఆశా భోస్లే ఇకలేరు

>> విషమించడంతో వైద్యులు ఐసీయూకి తరలించి చికిత్స అందించిన ప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె మరణ వార్తను కుమారుడు ఆనంద్ భోస్లే, మనవరాలు జానై భోస్లే ధృవీకరించారు. ఆమె పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం ఆమె నివాసంలో ఉంచనున్నారు. అనంతరం, సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ కు ఆశా భోంస్లే స్వయానా సోదరి. బ్రిటీష్ ఇండియాలోని సాంగ్లీ స్టేట్‌లో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. 1943లో ఆమె తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో 20కి పైగా భాషల్లో 12వేలకు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (2011)లో స్థానం సంపాదించారు. తెలుగులో కూడా ఆమె పాడిన ఎన్నో పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఆమె మరణం భారత సంగీత ప్రపంచానికి తీరని లోటు. భారత సంగీత ప్రపంచంలో తీవ్ర విషాదం నెలకొంది. తన గానంతో దశాబ్దాల పాటు శ్రోతలను ఉర్రూతలూగించిన దిగ్గజ గాయని, గానకోకిల ఆశా భోంస్లే (92) ముంబైలో తుదిశ్వాస విడిచారు. తీవ్ర అస్వస్థతతో నిన్న ఆమెను బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఇవాళ కన్నుమూశారు. ఆమె మరణంతో భారతీయ సినీ సంగీతంలో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది. ఆశాభోంస్లే పలుఆరోగ్య సమస్య లతో బాధపడుతున్నారని, బహుళ అవయవాలు విఫలం కావడం వల్లే ఆమె మరణించారని డాక్టర్ ప్రతీత్ సందానీ వెల్లడించారు. కడసారి నివాళులర్పించాలనుకునే వారు సోమవారం ఉదయం 11 గంటలకు లోయర్ పరేల్‌లోని ఆమె నివాసానికి రావచ్చని కుమారుడు ఆనంద్ భోంస్లే కోరారు. "మాఅమ్మ ఆశా భోంస్లే ఈరోజు మరణించారు. రేపు ఉదయం 11 గంటలకు ప్రజలు ఆమె నివాసంలో నివాళులర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు. 1943లో మాఝూ బల్ అనే మరాఠీ చిత్రంతో తన గాన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆశా భోంస్లే, ఆ తర్వాత హిందీ చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. చురా లియా హై తుమ్నే జోదిల్ కో, దోలఫ్జోం కీ హై దిల్‌కీ కహానీ, ఓ హసీనా జుల్ఫోం వాలే, యే లడ్కాహాయ్ అల్లా వంటి ఎన్నో అజరామరమైన గీతాలతో సంగీత ప్రియుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆమె మృతి పట్ల యావత్ సినీ, సంగీత ప్రపంచం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. **సుదీర్ఘ కెరీర్‌లో అనేక అవార్డులు:** సంగీతసామ్రాజ్ఞిగా కొనసాగిన ఆశాజీ ఏడుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు గెలుచుకున్నారు. రెండుసార్లు జాతీయ ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు. ఇక 2000లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, 2001లో ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, 2002లో బీబీసీ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం అందుకున్నారు. ఇక 2008లో ఆమెనుకేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించింది. ఇక 2011లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆశా భోస్లేకు చోటు దక్కింది. ఎనిమిది దశాబ్దాలకు పైగా సాగిన ఆమె ప్రస్థానంలో వేల సంఖ్యలో పాటలు పాడి, ప్రపంచంలోనే అత్యధిక రికార్డింగ్‌లు చేసిన గాయనిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. 16ఏళ్ల వయసున్నప్పుడే ఆశ, తన సోదరి లతామంగేష్కర్‌వద్ద సహాయకునిగా పనిచేసిన 31 ఏళ్ల గణపత్ రావ్ భోస్లేను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీళ్లకు ముగ్గురు పిల్లలు. అయితే పలు కారణాలతో తన భర్త నుంచి విడాకులు తీసుకున్నారు. ఇక 1980లో ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌డీ బర్మన్‌ను వివాహమాడారు.

## ఆశాభోంస్లే మృతిపట్ల ప్రధాని సంతాపం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** ప్రముఖ గాయని ఆశాభోస్లే మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ ఎక్స్ వేదికగా నివాళులర్పించారు.భారతదేశం చూసిన అత్యంత ప్రసిద్ధ, బహుముఖ ప్రజ్ఞా వంతురాలైన గాయకులలో ఆశా భోంస్లే ఒకరని మోదీ కొనియాడారు. ఉంది. ఆమెతో నాకున్న పరిచ యాన్ని, సంభాషణలను నేను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రియులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆమె రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయంటూ ప్రధాని తన ట్వీట్‌లో కీర్తించారు.

# రాష్ట్రం ముందడుగు

>> మరింత బలపడుతోందని మంత్రి కొనియాడారు. వెల్‌కమ్ టు వైజాగ్ ఐబీఎం అంటూ లోకేశ్ పోస్టు పెట్టారు. చూజ్ స్పీడ్, చూజ్ ఏపీ హ్యాష్‌ట్యాగ్‌తో లోకేశ్ పోస్టు చేశారు.

# జాతీయ ఉద్యమం

>> చారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసిన ఆయన, కేంద్రం గతంలో 90 శాతం నిధులు భరించేదని, ఇప్పుడు 60 శాతానికి తగ్గించడం అన్యాయమన్నారు. మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఎలా భరిస్తుందో కేంద్రం చెప్పాలని ప్రశ్నించారు. రైతులు అప్పులపాలు అయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నా గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం రైతులకు ఏమి చేసిందని నిలదీశారు. దేశంలో భూములు ఉన్న రైతులు కూడా వాటిని అమ్ముకుని వలసలు వెళ్లి కూలి పనులు చేసుకునే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కేంద్రం సంవత్సరానికి కేవలం రూ.6 వేలు మాత్రమే ఇస్తోందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలకు రూ.4 వేల చొప్పున సహాయం అందించడం రైతులకు మేలు చేస్తున్న చర్యగా పేర్కొన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి కూడా దిగజారిందని రామకృష్ణ అన్నారు. 2014లో ఒక డాలర్ విలువ రూ.60 ఉండగా, ప్రస్తుతం రూపాయి విలువ తీవ్రంగా పడిపోయిందని, దేశం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దేశంలోని కోట్లాది కష్టజీవుల హక్కుల కోసం ఈ పాదయాత్ర ఎర్రజెండా పోరాటానికి ప్రతీక అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్, జాతీయ కాంగ్రెస్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా సంఘీభావం తెలిపారు.

# 18 లేదా 19న ఇంటర్ ఫలితాలు

**విజయవాడ,ఏప్రిల్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈ నెల 18 లేదా 19 తేదీల్లో విడుదల చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కసరత్తు చేస్తోంది. మూల్యాంకన ప్రక్రియ పూర్తికాగా ఫలితాల విడుదలకు ప్రాసెస్ కొనసాగుతోంది. ఇది ఈ నెల 16 కల్లా ముగిసే అవకాశముంది. ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన పబ్లిక్ పరీక్షలు మార్చి 23 వరకు జరిగాయి. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకునెలసమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైంది.

# దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి సస్పెన్షన్

**విజయవాడ,ఏప్రిల్ 12, ప్రభాతవార్తప్రతినిధి:** దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆదాయానికి మించి ఆస్తుల ఫిర్యాదులపై ఈనెల7న ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.ఆమె నుంచి అధికారికంగా ధృవీకరించని ఆస్తుల పత్రాలు,నగలు,నగదు స్వాదీనం చేసుకున్నారు.గంటూరు, విజయవాడల్లోని ఆమె ఇండ్లలో సోదాలు చేసారు.ఆమె అవినీతికి పాల్పడినట్లు గుర్తించారు.అనంతర పరిణామాల్లో అక్రమ ఆస్తుల కేసులో శాంతిని అరెస్టుచేశారు. అలాగే ఈనెల 21 వరకు జ్యూడీషియల్ కస్టడీ విధించారు. ఇప్పుడు ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.

# సిఎం చంద్రబాబుతో దోర్జే గ్యాంబా భేటీ

**విజయవాడ,ఏప్రిల్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ చైర్మన్ పి దోర్జే గ్యాంబా సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ, సమర్ధ నీటి నిర్వహణ చర్యలు గురించి దోర్జే గ్యాంబాకు ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలోని నదీపరివాహక ప్రాంతాల్లో అవేర్ సంస్థ ద్వారా జల వనరుల వివరాలు రియల్ టైమ్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిపారు.అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రాల సరిహద్దు భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు సమస్యపై చర్చించారు. గత సీజన్లో పెద్దవాగు పొంగి కట్ట తెగడంతో రెండు రాష్ట్రాల్లోనూ వరదలు సంభవించాయని, ఈ కారణంగా ప్రజలు ఇబ్బంది పడినవిషయం సమావేశంలో చర్చకు వచ్చింది.

# రోహిణికి ముందే పగులుతున్న రోళ్లు

>> 40 డిగ్రీల మార్కు దాటిపోయింది. రాష్ట్రంలో వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోనూ 40 -41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. కాగా ఆదివారం ఆదిలాబాద్ జిల్లాలో 41.8 డిగ్రీలు, నిర్మల్‌లో 41.7, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, ఖమ్మం, మెదక్, ములుగు, నల్గొండ, నిజామాబాద్, సిద్దిపేట, 41.6 డిగ్రీల ఎండ తీవ్రత నమోదు కాగా కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాల్లో 41.5 డిగ్రీల మేర, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల్లో 41.4డిగ్రీల మేర, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో 41.3 డిగ్రీల మేర, కరింనగర్, పెద్దపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 41.2 డిగ్రీల మేర, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాలో 41.1 డిగ్రీల మేర, వరంగల్‌లో 41.0, నారాయణపేటలో 40.9, మహబూబాబాద్ 40.7, జనగామ 40.5, మేడ్చల్-మల్కాజిగిరి 40.4 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక హైదరాబాద్ నగరంలో 39.9డిగ్రీలు, యాదాద్రి భువనగిరిలో 39.8డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారంనాటి గరిష్ట ఉష్ణోగ్రతల సగటు 4.18డిగ్రీల మేర నమోదు కావడం గమనార్హం.

**ఎపిలో 51 మండలాల్లో వడగాలులు వీచే ప్రమాదం:** ఇక ఎపి దిగువ ట్రోపో ఆవరణంలో ఉండడంతో దక్షిణ, నైరుతి దిశల నుండి గాలులు వీస్తున్నాయి. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రాగల మూడు రోజుల పాటు పూర్తిగా పొడి వాతావరణమే ఉంటుంది. వర్ష సూచన ఏమాత్రం లేదని అధికారులు స్పష్టం చేశారు. రానున్న అయిదు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. కేవలం ఎండలు పెరగడమే కాకుండా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో రాగల ఏడు రోజులపాటు వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగడం వల్ల ఉక్కపోత ఎక్కువగా ఉండి ఎపి ప్రజలు అసౌకర్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. సోమవారం 51 మండలాల్లో తీవ్ర వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, పోలవరం, తూర్పుగోదావరి, ఏలూరు, పల్నాడు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించింది. కాగా.. ఆదివారం కడప జిల్లా పొట్టిపాడులో 43.8 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఇక తెలంగాణలో ఉక్కపోత ఉండకపోయినా భరించలేని వేడి తీవ్రత ఉంటుందని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు:** ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం వేళల్లోఇళ్లలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ఆ సమయంలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తగినజాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# హార్ముజ్ ముట్టడి!

>> భావించిన ఆశలను ఈ ప్రకటన నీరుగార్చింది. యుద్ధం మొదలైనప్పటి నుండి ఇరాన్ జలసంధిని నియంత్రించడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. ప్రపంచ చమురులో ఐదో వంతు రవాణా చేసే ఈ వ్యూహాత్మక మార్గం దిగ్బంధనం, సంక్షోభాన్ని మరింత పెంచుతుంది. ఇరాన్ జలసంధిపై నియంత్రణ సాధించి, ప్రపంచం నష్టపోతుంటే ఆర్థికంగా లాభపడకుండా నిరోధించడమే అమెరికా దిగ్బంధన లక్ష్యమని ట్రంప్ వివరించారు. ఒకానొక దశలో, నౌకలన్నీ లోపలికి రావడానికి, బయటికి వెళ్లడానికి అనుమతి లభిస్తుంది. కానీ ఎక్కడో మైన్ ఉండవచ్చు అని ఇరాన్ తమకు తప్ప ఎవరికీ తెలియని విధంగా చెబుతూ అనుమతించడం లేదని వివరించారు. ఇది ప్రపంచాన్ని బ్లాక్‌మెయిల్ చేయడమేనని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాధినేతలు, ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్ ఎప్పటికీ బ్లాక్‌మెయిల్ అంగీకరించవని ఆయన గట్టిగా చెప్పారు. ఈఅక్రమ చర్యలను ఇరాన్ ఆపకపోతే దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఇరాన్‌కు రుసుము చెల్లించిన ఏ నౌకనైనా అంతర్జాతీయ జలాల్లో గుర్తించి అడ్డుకోవాలని అమెరికా నావికాదళాన్ని ఆదేశించినట్లు ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇది ఇరాన్ అధికారానికి ఒక సవాలు. రెండు వారాల కాల్పుల విరమణ సమయంలో ఇరాన్ నౌకల ప్రయాణాలపై రుసుము వసూలు చేయాలని ప్రయత్నిస్తోంది. టెహ్రాన్ ఈ మార్గంపై పట్టు సాధించే ప్రయత్నాల్లో ఉండటంతో ట్రంప్ ఆగ్రహించెందారు.చట్టవిరుద్ధమైన రుసుము చెల్లించిన ఎవరికీ అంతర్జాతీయ జలాల్లో సురక్షిత ప్రయాణం ఉండదని అధ్యక్షుడు స్పష్టం చేశారు.

## మంచి ఆఫర్ ఇచ్చాం.. ఇదే ఇక ఫైనల్!

### చర్చల వైఫల్యం తర్వాత అమెరికా వైస్ జెడివాన్స్

ఇస్లామాబాద్ వేదికగా 21 గంటలకు పైగా సాగిన ఈ మంతనాలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రకటించారు. అమెరికా పెట్టిన షరతులను టెహ్రాన్ తిరస్కరించడమే ఇందుకు కారణమని, ఇది అమెరికా కంటే ఇరాన్‌కే ఎక్కువ నష్టమని ఆయన హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున ఇస్లామాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేడీ వాన్స్ ఈ వివరాలు వెల్లడించారు. మేము గత 21 గంటలుగా ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాం. అనేక కీలక అంశాలపై ఫలవంతమైన చర్చలు జరిగాయి. ఇది మంచి విషయమే. కానీ, ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఇదే చెడు వార్తఅని ఆయన స్పష్టం చేశారు. చర్చల్లో అమెరికా తమ వైఖరిని చాలా స్పష్టంగా చెప్పిందని వాన్స్ తెలిపారు. మా రెడ్ లైన్స్ ఏంటో స్పష్టం చేశాం. ఏయే అంశాల్లో సర్దుకుపోగలమో, ఏయే విషయాల్లో వెనక్కి తగ్గేది లేదో స్పష్టం చేశాం. కానీ మా షరతులను అంగీకరించడానికి వారు ఇష్టపడలేదని ఆయన వివరించారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని సాధించకుండా నిరోధించడమే అమెరికా ప్రధాన లక్ష్యమని వాన్స్ నొక్కి చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయబోమని, వాటిని వేగంగా సమకూర్చుకోగల సాధనాల జోలికి వెళ్లబోమని కచ్చితమైన, దీర్ఘకాలిక హామీ ఇవ్వాలి. కేవలం ఇప్పటికో, రెండేళ్లకో కాదు సుదీర్ఘ కాలం పాటు ఈ నిబద్ధతను మేము చూడాలనుకుంటున్నాం. కానీ, అది ఇప్పటివరకు మాకు కనిపించలేదని జెడివాన్స్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ఇచ్చిన ఆదేశాల మేరకు తాము చిత్తశుద్ధితో వ్యవహరించామని వాన్స్ పేర్కొన్నారు. ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించమని అధ్యక్షుడు మాకు చెప్పారు. మేం అదే చేశాం. కానీ దురదృష్టవశాత్తు పురోగతి సాధించలేకపోయామని అన్నారు. ఈ 21 గంటల చర్చల సమయంలో తాము నిరంతరం అధ్యక్షుడితో సంప్రదింపులు జరిపామని, దాదాపు డజను సార్లు ఆయనతో మాట్లాడి ఉంటామని తెలిపారు. ప్రస్తుతం తాము ఒక స్పష్టమైన ప్రతిపాదనతో చర్చల నుంచి వైదొలుగుతున్నామని, ఇదే తమ తుది, అత్యుత్తమ ఆఫర్ అని వాన్స్ స్పష్టం చేశారు. మా తుది ఆఫర్‌ను వారి ముందు ఉంచాం. ఏం జరుగుతుందో చూద్దామని ఆయన పేర్కొన్నారు.



ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మగ్గం నేస్తున్న తమిళనాడు సిఎం స్టాలిన్

# విజయవాడలో రహదారులను పరిశీలించిన డిసిపి

**విజయవాడ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు రోడ్డుప్రమాదాల నివారణకు ట్రాఫిక్ డిసిపి సూర్యచంద్రరావు ఆదివారం పలుప్రాంతాల్లో పర్యటించి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సిబ్బందికి పలుసూచనలిచ్చారు. విజయవాడ 40వ డివిజన్‌లారీస్టాండ్‌నుండి గొల్లపూడి వైజంక్షన్ వరకు ప్రధాన రహదారిని పరిశీలించి బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. కనకదుర్గ ఫ్లైఓవర్ నుండి వచ్చే వాహనాలు,సర్వీస్‌రోడ్ నుండి వచ్చే వాహనాలు ప్రమాదాలకుగురికాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరుగు తున్నబ్లాక్‌స్పాట్ లలోహెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

# బెట్టింగ్‌లు, జూదంపై కఠిన చర్యలు: డిజిపి హారీష్ కుమార్ గుప్తా

**విజయవాడ, ఏప్రిల్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆన్‌లైన్ గేమింగ్ పేరిట జరుగుతున్న అన్ని రకాల బెట్టింగ్ మరియు జూద కార్యకలాపాలు పూర్తిగా నిషేధితమని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్ నిరోధానికి అమలు చేస్తున్న చర్యలపై డీజీపీ అన్ని జిల్లాల ఎస్పీలతో ఆదివారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో అధికారులందరూ అక్రమ బెట్టింగ్, జూద కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానంతో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పోలీసు బృందాలు బెట్టింగ్ నెట్వర్క్‌లపై దాడులు ముమ్మరం చేశాయన్నారు. జూదాలకు మరియు బెట్టింగ్ లకు వేదికలుగా ఉన్న క్లబ్బులు, ఇతర స్థావరాలను ఇప్పటికే మూసివేయించడంతో పాటుగా రాష్ట్రవ్యాప్తంగా అక్రమ గ్యాంబ్లింగ్ మరియు బెట్టింగ్ కేంద్రాలను గుర్తించి పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లను గుర్తించి సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ బ్లాక్ చేసే చర్యలు చేపడుతూ రాష్ట్రంలో బెట్టింగ్ కార్యకలాపాలు చెక్ పెడుతున్నారన్నారని వివరించారు. బుకీలు, ఏజెంట్లు, బెట్టింగ్‌లో పాల్గొనే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ ఈ నేరాలను ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించి తీవిళీ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారన్నారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను ఇప్పటికే గుర్తించి ఫ్రీజ్ చేస్తున్నారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడిన మరియు వారికి సహకరించే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తూ పదే పదే గ్యాంబ్లింగ్, బెట్టింగ్ లకు పాల్పడుతున్న నేరస్తులపై ప్రివెంటివ్ డిటెన్షన్, ఎక్స్‌టర్న్‌మెంట్ చర్యలు తీసుకోవాలని డీజీపీ ఈ సందర్భంగా పోలీసు అధికారులను ఆదేశించారు. అక్రమ బెట్టింగ్ ద్వారా సంపాదించిన లేదా ఉపయోగిస్తున్న ఆస్తులను గుర్తించి చట్టప్రకారం అటాచ్ చేస్తామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ సందర్భంగా తెలిపారు.ఐపీఎల్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు ఇప్పటికే ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. లాడ్జీలు, హోటళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయి. గ్రామ, వార్డు స్థాయిలో ఇంటెలిజెన్స్ సమాచార సేకరణ చేపడుతూ, ప్రత్యేక బృందాలతో బెట్టింగ్ నెట్వర్క్‌లను చేధిస్తూ నమోదైన కేసులపై సమగ్ర దర్యాప్తు జరిపి సమర్థవంతమైన అభియోగపత్రాలు దాఖలు చేసేలా పర్యవేక్షిస్తున్నారన్నారు.అదేవిధంగా సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లపై నిరంతర నిఘా కొన సాగుతోందని డీజీపీ తెలిపారు. ముఖ్యంగా యువతకు బెట్టింగ్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.బెట్టింగ్, జూదాలకు దూరంగా ఉండాలని ప్రజలకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



## ఆశా భోంస్లే మృతిపై సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ నివాళి

**విజయవాడ,ఏప్రిల్ 12,ప్రభాతవార్తప్రతినిధి :** ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే (92) తుది శ్వాస విడిచారు. ఆమె మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సినిమా రంగానికి ఆశా భోంస్లే చేసిన సేవలను కొనియాడారు.ఆశాభోంస్లే మరణవార్త విని తీవ్రంగా విచారించానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఒక దిగ్గజ, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, భారతీయ గాయనిగా ఆమె పేరు సంపాదించారని కొనియాడారు. ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు సీఎంచంద్రబాబు సంతాపం తెలిపారు. ఆశా భోంస్లే కన్ను మూశారని తెలిసి చింతించానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆశాజీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. భారతీయ భాషల్లో 80 ఏళ్ల పాటు తన సుమధుర స్వరంతో వీనుల విందైన పాటలు అందించిన లెజెండరీ సింగర్ ఆశా భోంస్లే అని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ కొనియాడారు.ఆశాజీ భౌతికంగా మనకు దూరమైనా ఆమెపాట రూపంలో జీవించే ఉంటారని కీర్తించారు. మహాగాయని మృతిపట్ల తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

# 16 నుంచి 3 రోజులు ప్రత్యేక పార్లమెంటు

>> ల్లో సవరించనున్నారు. "నారీశక్తి వందన్ అధినియం" పేరుతో బిల్లు ప్రవేశపెడుతున్నారు. ఈ బిల్లు ద్వారా చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తారు. త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్ల పెంపు, నియోజకవర్గాల పునర్విభజనకు అనుగుణంగా మహిళా రిజర్వేషన్ బిల్లును సవరిస్తారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఎన్‌డియే ప్రభుత్వానికి చాలా కీలకం. అందుకే తన పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలకు బిజెపి మూడు లైన్ల విప్ జారీ చేసింది. దీని ప్రకారం బిజెపికి చెందిన ఎంపీలు పార్లమెంట్‌కు హాజరవ్వడం తప్పనిసరి. గురువారం నుంచి శనివారం వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు ప్రవేశబెట్టబోతున్నట్లు, కేంద్ర మంత్రులు సహా సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని విప్‌లో పేర్కొన్నారు. నిర్ణీతతేదీలలో ఎలాంటి సెలవు ఇవ్వబోమని, ప్రతి ఒక్కరి హాజరు సభలో ఎంతో కీలకం అని విప్ నోటీసులో వివరించారు.

## వారం - వర్జ్యం

13-04-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
ఏకాదశి రా.1.05
ధనిష్ఠ మ.3.58
వర్జ్యం : రా.11.10-రా.12.46
దు.ము.12.32-మ.1.22 2) మ.3.02-మ.3.52
శుభసమయం: ఉ.9.00-10.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** దీర్ఘకాలికంగా చికాకు కలిగిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. వివాహ యత్నాలు అనుకూలిస్తాయి. వస్త్రలాభం.

**వృషభం:** భూమి కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు. సంతాన విద్యా విషయంలో బాధ్యత కలిగిఉంటారు.

**మిథునం:** గృహ నిర్మాణాలు చేపడతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ఋణబాధలు తీరుతాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో విజయంసాధిస్తారు. వస్త్రలాభం.

**సింహం:** ప్రత్యర్థులు సైతం మీ ధాటికి భయపడతారు. సంఘంలో గౌరవం లభిస్తుంది. వాహనాల విషయంలో మెలుకువ అవసరం.

**కన్య :** మిత్రులతో జరిపే సంభాషణలు ఉపయుక్తంగా ఉంటాయి. కీలక వ్యవహారాలలో సన్నిహితుల సహకారం పొందుతారు.

**తుల :** ప్రయాణాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. పారిశ్రామిక, వైద్యరంగాల వారికి అనుకూలం.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. సంఘసేవా కార్యక్రమాలకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు.

**ధనుస్సు:** ఎన్నడూ లేని విధంగా రాజకీయ నాయకులలో స్నేహంచేస్తారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. ఆరోగ్యం జాగ్రత్త.

**మకరం:** పూర్వపు మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**కుంభం:** వరిశ్రమలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మీనం:** ఫలితం ఆశించి ఎవరికీ సహాయం అందించవద్దు. మీ సలహాలవల్ల మీ సహచరవర్గం లాభపడగలుగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## తిరుమల సమాచారం



## వేసవిసెలవులకు ముందే కొండంత జనం

### • శ్రీవారి దర్శనానికి 20గంటలు

తిరుమల, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: వేసవిసెలవులు మొదలు కానుండటానికి ముందే కలియుగ వైకుంఠం తిరుమలకొండంతా భక్తజనంతో నిండిపోయింది. వారాంతం సెలవులతో వరుసగా రెండవశనివారం, ఆదివారం రావడంతో ఆదివారం కూడా తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 20గంటల పైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఆదివారం సాయంత్రానికి 41వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇదిలా ఉండగా అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. భక్తులకు శ్రీవారి సేవకులతో అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎనిమిది తొమ్మిది గంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. గదులు దొరకని భక్తులు ఆరుబయట, పార్కుల్లో, షెడ్లలో తలదాచుకుని విశ్రాంతి పొందుతున్నారు.



## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి


తిరుమల, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రముఖులు వేడుకున్నారు. ఆదివారం ఉదయం టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ బీదా మస్తాన్‌రావు, సినీనటి ప్రేమ వేర్వేరుగా విఐపి బ్రేకసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలకడంతో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## 18న జులై నెల ఆర్జిత సేవల టిక్కెట్లు కోటా విడుదల

తిరుమల, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న జులైనెలకు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 18వతేదీ నుండి 24వరకు విడుదల చేయనుంది. ఏడుకొండలస్వామి ఆర్జిత సేవా టికెట్లు (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)కు సంబంధించిన కోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో భక్తులు నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. 21న ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇక చివరగా తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఈ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే బుక్ చేసుకోవాలని టిటిడి కోరింది.

## మే 5నుండి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర



తిరుపతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర వారం రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఆలయ కమిటీ సిద్ధమైంది. ఆదివారం ఉదయం ఆలయంలో తాతయ్యగుంట గంగ జాతర ఆహ్వాన పత్రిక, కరపత్రం, గోడ పత్రికలను ఆవిష్కరించారు. మే 5వ తేది రాత్రి చాటింపుతో తాతయ్యగుంట గంగ జాతర ప్రారంభమై మే 13వ తేది తెల్లవారుజామున విశ్వరూప దర్శనంతో ముగుస్తాయి. మే 12వ తేది అంగరంగ వైభవంగా గంగ జాతర జరుగుతుంది. గంగజాతర పనులను ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్, పాలకమండలి సభ్యులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. తిరుపతితో పాటు చుట్టు పక్కల గ్రామాలతో పాటు రాయలసీమ వ్యాప్తంగా అమ్మవారి ఆశ్శిశ్శుల కోసం జాతర సమయంలో రావడం ప్రత్యేకత. అమ్మవారి దర్శన భాగ్యం కల్పనలో సామాన్య భక్తులకే పెద్దపీఠవేస్తామని ఆలయ ఛైర్మన్ మహేశ్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీనివాసులు చెప్పారు. జాతర సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని పనిచేయనున్నట్లు ఆయన తెలిపారు. గంగజాతరను రాజకీయాలకు అతీతంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ చెప్పారు. రాయలసీమతోపాటు తమిళనాడు, కర్నాటక నుంచి జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. జాతర పనులను పాలకమండలి సమిష్టిగా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి, జెబి శ్రీనివాస్, పులుగోరు మురళీ, కంకణాల రజనీకాంత్, జలపోతు చంద్ర, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనకు ప్రజలు సహకరించాలి

### మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం



విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: దేశవ్యాప్తంగా 2027 జనగణన ప్రక్రియ ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జనగణన నిర్వహణకు సంబంధించిన ముఖ్యమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. దేశంలో జనగణనను దశలవారీగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు హౌస్‌లిస్టింగ్ హౌసింగ్ సెన్సస్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనికి ముందు ప్రజలకు 15 రోజులపాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్ సదుపాయం కల్పించనున్నారని సమాచారం. అలాగే మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో జరగబోయే 2027 జనగణన ప్రక్రియకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కూటమి ప్రభుత్వం కోరింది. 1948 జనగణన చట్టం ప్రకారం ప్రజల విధులు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జనగణన నిర్వహణ కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని ప్రభుత్వం సూచించింది. నిబంధనల ప్రకారం జనగణన సిబ్బందికి ప్రశ్నలు అడిగే అధికారం ఉందని, వారు కోరిన సమాచారాన్ని సరైన విధంగా అందించాలని తెలిపింది. అలాగే, సెన్సస్ అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొంది. తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇంటి యజమానులు సెన్సస్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని, ఇళ్లకు వేసే గుర్తులు లేదా నంబర్లు తొలగించడం నేరమని స్పష్టం చేసింది. అలాగే సెన్సస్ ఫారమ్‌లను సరిగ్గా నింపడం కూడా ప్రజల బాధ్యతగా పేర్కొంది. సెన్సస్ చట్టం 1948 ప్రకారం నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించనున్నట్లు వెల్లడించింది. జనగణన అధికారులకు సహకరించని వారికి రూ.1000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష కూడా ఉండొచ్చని హెచ్చరించింది. అయితే, జనగణన కోసం సేకరించిన వ్యక్తిగత వివరాలను ఇతరులు పరిశీలించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేసింది. జనగణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావాలంటే ప్రజల సహకారం అత్యంత కీలకమని ప్రభుత్వం పేర్కొంది.

# వైసిపిదంతా హింసా రాజకీయం

### • శాంతిభద్రతలకు భంగం కలిగించే రీతిలో ఉన్నాయి • ఆ పార్టీ నేతల భాష, ఆలోచనలు మార్చుకోవాలి • మీడియా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే రీతిలో వైసిపి, ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆరోపించారు. మాజీ సీఎం జగన్ కుట్ర పూరితంగా వ్యవహరించడమే కాకుండా, అవాంఛనీయ పరిస్థితులను ప్రోత్సహిస్తున్నారన్నారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ ఏ పార్టీ అయినా శాంతిభద్రతలు కాపాడతామని చెబుతుంది. కానీ వైసిపి మాత్రం హింసను ప్రేరేపించే పార్టీగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. 2029లో పొట్టేళ్లను నరికినట్లు తలలు నరికేస్తాం అని బహిరంగంగా గొడ్డళ్లతో రోడ్ల మీద తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. జంతువులను నరికి ఆ రక్తాన్ని ఫ్లెక్సీల మీద చిమ్ముతూ రాక్షసానందం పొందే నాయకులు ప్రజలకు ఏం మేలు చేస్తారని నిలదీశారు. వైసిపి నాయకుల భాష, వారి ఆలోచనా విధానం చూస్తుంటే ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకుంటోందని మంత్రి మండిపడ్డారు. ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన నాయకులే బాహాటంగా హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. వైసిపి నాయకులు ఎంతటి తెగింపుతో మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారు. "గుంటూరు ఇవతల ఇంటిలో నుంచి బయటకు లాగి కొడతాం.. గుంటూరు అవతల ఇంటిలోకి వెళ్లి నరుకుతాం" అని బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. వీరికి అధికారం కావాల్సింది అభివృద్ధి కోసం కాదు, సంక్షేమం కోసం కాదు.. కేవలం తల్లులకు పుత్రశోకం మిగిల్చడానికి, భార్యలకు మాంగల్య దూరం చేయడానికే వీరు అధికార దాహంతో రగిలిపోతున్నారు. రేపటి రాష్ట్ర భవిష్యత్తును ఒక స్మశానవాటికలా మార్చడమే వైసిపి లక్ష్యమా? అని ప్రశ్నించారు. నిజాలను నిర్భయంగా వెల్లడిస్తున్న ఒక మీడియా సంస్థపై, వారి ప్రతినిధులపై జగన్ రెడ్డి, ఆ పార్టీ నేతలు ఉన్మాదంతో మాట్లాడుతున్నారు. "నాలుకలు కోస్తాం.. అంతం చేస్తాం.. కొత్త పలుకు వినిపించకుండా చేస్తాం" అని ఒక మీడియా సంస్థను బెదిరించడం అంటే, అది సాక్షాత్తూ రాజ్యాంగం కల్పించిన ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కడమే. ఇలాంటి మాటలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి. 151 సీట్లు ఉన్న పార్టీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారంటే, జగన్ రెడ్డి పరిపాలనపై ఎంతటి వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవాలి. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్నా, జగన్ రెడ్డికి బుద్ధి రాలేదు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, మరింత రెచ్చిపోయి ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారు. నాడు తండ్రి పదవిని అడ్డం పెట్టుకుని లక్ష కోట్ల రూపాయలు దోచుకున్న 'ఆర్థిక ఉగ్రవాది' జగన్ రెడ్డి, నేడు 'రాజకీయ ఉగ్రవాది'గా మారిపోయారు. వైసిపి జెండాను పక్కన పెట్టి 'గొడ్డలి'ని జెండాగా చేసుకున్నారు. రక్త చరిత్రనే తన రాజనీతిగా భావిస్తున్న జగన్ రెడ్డి, వైసిపిని గొడ్డలి పార్టీగా మార్చేశారని ఎద్దేవా చేశారు.

# రాజధాని విషయంలో వైకాపాది సెల్ఫ్‌గోల్

### • టిడిపిది సెల్ఫ్ డబ్బా • కాంగ్రెస్ సీనియర్ నేత తులసి రెడ్డి



తిరుపతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో వైకాపాది సెల్ఫ్ గోల్ కాగా, టిడిపిది సెల్ఫ్ డబ్బా అని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. రాజధాని అమరావతి విషయంలో వైకాపా పార్టీ గందరగోళంలో, అయోమయంలో, కన్ఫ్యూజన్‌లో ఉందని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజధాని విశాఖపట్నం మార్చాలని సర్వ ప్రయత్నాలు చేసి జగన్మోహన్ రెడ్డి వైఫల్యం చెందారని విమర్శించారు. మూడు ముక్కలాట ఆడి రాష్ట్ర ప్రజలను గందరగోళంలోకి నెట్టి, ప్రస్తుతం మావిగన్ అనగా మచిలీపట్నం విజయవాడ గుంటూరు అంటూ కొత్త సన్నాయి అందుకున్నాడని ఎద్దేవా చేశారు. ఆదివారం చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం కార్వేటి నగరం మండలం పాదిరి కుప్పం గ్రామంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బహుశా రేపు జగన్ "శ్రీవిపుల్" అంటే శ్రీకాకుళం విజయవాడ పులివెందుల అనొచ్చన్నారు. ఎల్లుండి శ్రీకాకుళం విజయవాడ కుప్పం అనొచ్చని ఆయన నోటికి ఒక హద్దులేదన్నారు. మొత్తం మీద రాజధాని విషయంలో వైకాపా విధానం నవ్వుల పాలైందన్నారు. రాజధాని విషయంలో టిడిపి సెల్ఫ్ డబ్బా వాయించు కోవడం ఎక్కువైందన్నారు. గత పది సంవత్సరాలుగా రాజధాని అమరావతి నుండే పరిపాలన సాగుతోంది. ప్రధానమంత్రి రెండు సార్లు శంకుస్థాపన కూడా చేశారు. ఏదో అద్భుతం సాధించినట్లు సంబరాలు చేసుకోవడం, డబ్బా కొట్టుకోవడం ఎబ్బెట్టుగా ఉందన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాజధానిలో రాజభవన్, రాష్ట్ర సచివాలయం, శాసనమండలి భవనం, శాసనసభ భవనం, హైకోర్టు, ఇతర మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వము గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వాలి. దానికోసం కృషి చేయాలని కూటమి ప్రభుత్వానికి తులసిరెడ్డి సూచించారు. అదేవిధంగా రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇంకా వారికి కేటాయించిన రెసిడెన్షియల్ ప్లాట్స్, కమర్షియల్ ప్లాట్లు లేఅవుట్లు వేయలేదు, అభివృద్ధి పరచలేదు. వెంటనే ఆ పని చేయాల్సిన అవసరం ఉంది. విభజన చట్టంలో సెక్షన్46 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం వద్ద మేజర్ ఓడరేవు నిర్మించాల్సి ఉందని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్, పిసిసి ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు టిక్కీ రాయల్, గత లోక్‌సభ ఎన్నికల్లో చిత్తూరు నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన జగపతి, పిసిసి మాజీ అధికార ప్రతినిధి బుల్లెట్ రవి, పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త ప్రభాకర్, నగరి అసెంబ్లీ సమన్వయకర్త కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

### మానవత్వానికి మచ్చ...

### పోక్సో కేసు నమోదు
### ప్రకాశం జిల్లా తాళ్లూరులో దారుణం

# కుమార్తె పై తండ్రి అత్యాచారం



తాళ్లూరు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: మానవత్వం మంటగలిసింది అని చెప్పుండానికి ఈ సంఘటనే నిదర్శనం. ఓ కామాంధుడు 13 ఏళ్ల తన కన్న కూతురిపైనే అత్యాచారం చేశాడు. తాళ్లూరు మండలంలో ఓ గ్రామంలో కన్నతండ్రే మైనర్ కుమార్తెపై మండలంలోని ఓ గ్రామంలో అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫోక్సో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికులు వివరాలు మేరకు ఆ గ్రామంలోని ఒక దంపతులకు ఇద్దరు కుమార్తెలు కలరు. పెద్ద కుమార్తె తూర్పు గంగవరం లో ఓ ప్రవేట్ పాఠశాలలో చదువుకుంటుంది. మైనరైన పెద్దకుమార్తె నాలుగు, ఐదు నెలల క్రితం పుష్పావతి అయింది. పలు చెడు వ్యసనాలకు బానిసైన కన్నతండ్రి ఆ మైనర్ బాలికను బయపెట్టి రెండునెలలుగా రెండు, మూడు పర్యాయాలు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ మైనర్‌కు గత వారం రోజులుగా తీవ్ర కడుపు నొప్పిగా వుండి బాధపడుతున్నది. బాధితురాలి తల్లి కుమార్తెకు ఆరోగ్యం గురించి చూపించేందుకు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు రెండు రోజుల క్రితం తీసుకవెళ్లింది. రిమ్స్‌లో ఆ మైనర్‌కి వైద్య పరీక్షలు చేయించగా ఆమైనర్‌ను అత్యాచారం చేశారని, అందువల్లే కడుపు నొప్పి వస్తున్నదని తల్లికి వివరించారు. తల్లి కుమార్తెను ఎవరు ఈ పాపానికి వడిగట్టారని నిలదీయగా తెలిసి, తెలియని ఆ మైనర్ కన్న తండ్రే చేశాడని, బయట ఎవరికి చెప్పవద్దు అన్నాడని చెప్పింది. దీంతో తల్లి కిన్నురాలైంది. ఆఘాయిత్యానికి పాల్పడ్డ భర్తపై ఫిర్యాధు చేసింది. ఒంగోలు పోలీసులు పూర్తి వివరాలు రికార్డు చేసి తాళ్లూరు పోలీసులకు సమాచారం పంపగా హెడ్ కానిస్టేబుల్ దాసు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కన్న కూతురిపై అత్యాచారంకు పాల్పడిన ఘటనపై నమోదైన పోక్సో చట్టంలో నమోదైన కేసుపై దర్శి డీఎస్పీ పి.బాలమురళికృష్ణ ఆ గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహిం చారు. గ్రామంలో బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి బాధితురాలిని విచారిం చారు. ఘటన జరిగిన తీరు తెన్నుల ను, అన్ని వివరాలను అడిగి తెలుసుకుని స్టేట్‌మెంట్ రికార్డుచేశారు. తల్లి నుండి వివరాలు సేకరించారు. కంటి పాపలా చూసుకోవాల్సిన కన్న కూతురు పైనే ఓ నరరూప రాక్షసుడు కన్నేశాడు. ఎవరూ లేని సమయంలో మైనర్ అయిన కుమార్తె పై అత్యాచారానికి తెగబడ్డాడు. కన్నూమిన్నూ కానకుండా... కడుపున పుట్టిన బిడ్డపైనే కామాన్ని చూపించాడు. నిందితుడు గతం లో తన తండ్రి ని కూడా నిద్రపోతున్న అయనను కిరోసిన్ పోసి దహనం చేసి చంపేశాడు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో ఈ ఘటన జిల్లాలో పెను సంచలనంగా మారింది. డీఎస్పీ వెంట ఎస్ఐ ఎస్.మల్లిఖార్జునరావు, సిబ్బంది ఉన్నారు.




## అమరావతి వేదికగా సాకారమవుతున్న భారత్ క్వాంటం విప్లవం

### • క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో ఎపి నుంచి నూతన టెక్ శకం ప్రారంభం • రేపు 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్ బెడ్స్‌ను ఆవిష్కరించనున్న సిఎం చంద్రబాబు

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ క్వాంటం డే పురస్కరించుకుని దేశ చరిత్రలో ఓ కీలక ఘట్టానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా ఏప్రిల్ 14వ తేదీన ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతం అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన అధ్యాయానికి నాంది పడనుంది. గన్నవరంలోని మేధా టవర్స్‌తో పాటు రాజధానిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు క్వాంటం హార్డ్‌వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్స్ ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.

**స్వదేశీ టెక్నాలజీతో రిఫరెన్స్ ఫెసిలిటీ:** అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ 1క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేసింది. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 1ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్‌ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ టెస్ట్ బెడ్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరుకానున్నారు. ఎపిలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్‌గా దాదాపు 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## శరవేగంగా అమరావతి నిర్మాణ పనులు

## జగన్ విష ప్రచారం: మంత్రి నారాయణ



విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న తరుణంలో జగన్ విష ప్రచారం చేస్తున్నారని, మావిగన్ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ విమర్శించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ అమరావతి రైతులు పార్లమెంటులో చట్టం చేయించాలని కోరారని, ముఖ్యమంత్రి కేంద్రాన్ని పట్టుబట్టి చట్టం చేయించారని తెలిపారు. పార్లమెంటులో చట్టంపై చర్చ జరుగుతుంటే ఎంపిలు ఏమి చేయాలో చెప్పకుండా ఇక్కడ మావిగన్ అంటూ ప్రకటన చేశారని పేర్కొన్నారు. మావిగన్ ప్రతిపాదనను ప్రజలు ఛీకొడుతున్నారని వివరించారు. జగన్ ప్రకటనల వల్ల పెట్టుబడులు రాకుండా పోతాయని విమర్శించారు. అమరావతికి ఇప్పటికే రూ.పదివేల కోట్లు ఖర్చయిందని, రూ.51 వేల కోట్ల టెండర్లు పిలిచామని అన్నారు. అమరావతి నిర్మాణం జరిగితే ఎకరా రూ.20 కోట్లు అవుతుందని తెలిపారు. రాజధానిని 217 చదరపు కిలోమీటర్లకు ప్లాన్ చేశామని, అప్పుడు ప్రాజెక్టులు వారీ భూములు తీసుకుంటున్నామని అన్నారు. పెదపరిమిలో వెయ్యి ఎకరాలు ఒకరోజు సమీకరణకు ఇచ్చారని పేర్కొన్నారు. పార్లమెంటులో సిఆర్‌డిఏ రీజియన్‌ను స్పష్టంగా ప్లాను చేశామని అన్నారు హైదరాబాద్ సెక్రటేరియట్‌కు రూ.615 కోట్లకు టెండర్లు ఇచ్చి రూ.1,423 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పార్లమెంటులో రూ.862 కోట్లకు టెండర్లు పిలిచి రూ.1,172 కోట్లు ఖర్చు చేశారని, చదరపు అడుగుకు రూ.16,900 ఖర్చు చేశారని పేర్కొన్నారు. జాతీయ రహదారికి కేవలం రోడ్డువేసి వదిలేస్తారని, అమరావతిలో అన్ని రకాల సదుపాయాలూ కల్పిస్తున్నామనే విషయాన్ని జగన్ పార్టీ పట్టించుకోవడం లేదని అన్నారు. దోమలు లేని నగరం కావాలంటే 100 శాతం యుజిడి ఉండాలని పేర్కొన్నారు. లైట్లు, గ్రీనరీ 2014కు ముందే పూర్తయితే ఖర్చు తగ్గేదన్నారు. తారు, ఇనుము ధరలు పెరిగాయని పేర్కొన్నారు. ధరలు పెరిగితే అంచనాలు పెరుగుతాయని, దీనికి గత ప్రభుత్వం పనులు చేయకపోవడమే కారణమని అన్నారు. పనులన్నీ టెండర్ల ద్వారానే ఇచ్చామని, నామినేషన్ పద్ధతుల్లో ఇవ్వలేదని తెలిపారు. ఐదు వేల ఎకరాలు ల్యాండ్ బ్యాంకు పక్కనబెట్టామని వివరించారు. వాటిని అమ్మి అప్పులు చెల్లిస్తామని పేర్కొన్నారు.

## 'అమరావతిపై అసత్యప్రచారం తగదు'

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ప్రపంచం మెచ్చే రాజధానిగా రూపుదిద్దుకోనున్న రాష్ట్రరాజధాని అమరావతిపై వైసిపి నాయకుల అసత్యప్రచారం మానుకోవాలని అఖిలబారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు హితవు పలికారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి రాష్ట్రరాజకీయ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతిపై చేసిన వాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు అమరావతి నిర్మాణాన్ని గాలికి వదలివేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి ఇప్పుడు మళ్ళీ రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అమరావతి పేరిట అవినీతి జరిగిందని చెప్పటం పూర్తిగా ఆధారరహితమన్నారు. ప్రజలు 11సీట్లకు పరిమితం చేసినా బుద్ధిరాలేదని ఇంకా అదేధోరణి కోనసాగించటం వైసిపి అహంకారానికి నిదర్శనంగా పేర్కొన్నారు. సామాచారహక్కు చట్టాన్ని రాకీయ ఆయుధంగా ఉపయోగించి ఉద్యమాల పేరుతో రాష్ట్రంలో గందరగోళం సృష్టించాలనుకోవటం ప్రజాస్వామ్యవ్యవస్థను దుర్దినియోగం చేయటమేనని జాస్తి అభిప్రాయపడ్డారు. రాష్ట్రఅభివృద్దిని అడ్డుకునేందుకు కు ట్రలు చేయటం మానుకుంటే మంచిదని హితవు పలికారు. అమరావతి కేవలం ఒక ప్రాంతం కాదని 5కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా పేర్కొన్నారు. అమరావతిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవటం వైసిపికి తగదని, ఇదే రీతిగా ముందుకు సాగితే ప్రజలు తరిమికొట్టేరోజు దగ్గర్లోనే ఉందని వీరాంజనేయులు హెచ్చరించారు.

వార్త

మిమ్మల్ని కిందికి లాగినప్పుడు వినయంగా ఉండటం గొప్పకాదు. కాని మిమ్మల్ని ఆకాశానికి ఎత్తుతున్నప్పుడు వినయంగా ఉండటమే గొప్ప.

న- సెయింట్ బెర్నార్డ్

# మాకు మేమే.. మీకు మీరే!

ఇరాన్‌తో ఒప్పందం జరిగితే ఏంటి? జరగకపోతే ఏంటి? ఎప్పటికైనా మాదే పై చేయి. ఇలా ట్రంప్ హుంకరించడంలో అర్థం ఉంది. ఆయనది మొదటినుంచీ ఒకే ధోరణి. ఇస్లామాబాద్ లో పశ్చిమాసియా యుద్ధం ముగింపు కోసం జరిగిన చర్చలు ఎంతవరకు సాఫల్యమవుతాయో ప్రపంచం యావత్తూ ఎదురు చూసింది. స్తంభించిన నిధులను విడుదల చేయాలని, లెబనాన్‌పై దాడులు తక్షణమే ఆపాలని ఇరాన్ కోరు తుంటే, హార్మూజ్ జలసంధి అందరిదీ కావాలనీ, దానిపై ప్రతిష్టంభన తొలగడం ఈ ప్రపంచానికి అత్యంత ఆవశ్యకమని అమెరికా చెబుతోంది. పనిలో పనిగా దాని మీద తమకూ పెత్తనం ఉంటే బాగుంటుందని అమెరికా ఆశ పడుతోంది. మా మూలుగా ఇవన్నీ మిగిలిన ప్రపంచానికి మంచి కోరికలుగానే అనిపిస్తున్నా ఆ రెండు దేశాలకు మాత్రం ఒకరి కోరికలు ఒకరికి గొంతెమ్మ కోరికల్లాగానే తోచుతున్నాయి. అందుకే శాంతి చర్చలు ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు. అలాంటి పరిస్థితుల్లో ఎవరు తగ్గుతారు, ఎవరు వెనకడుగు వేస్తారు? ఇరుపక్షాల్లోనూ పట్టుదల బాగా కనబడుతోంది. అందుకే ఓ కొలిక్కి రాలేదు. హార్మూజ్ జలసంధిపై కన్నేసిన ట్రంప్ ఇరాన్ సార్వభౌమత్వాన్ని గుర్తిస్తారనుకోవడం కల్ల. ఖతార్ తో సహా వివిధదేశాల్లో 11లక్షల కోట్ల నిధులు ఫ్రీజ్ చేసింది. అమెరికా ఊ అంటే తప్ప అవి విడుదల కావు. ఇక్కడే సంక్లిష్టత చోటు చేసుకుంది. ఈ నేపథ్యమే ట్రంప్‌కి మళ్ళీ కోపం తెప్పించింది. యుద్ధ నష్ట పరిహారం ఇమ్మని ఇరాన్ కోరుతోంది. ఇవన్నీ ఓ పట్టాన తేలే అంశాలు కావు. అందుకే శాంతి చర్చలు ముందుకు సాగలేదు. ట్రంప్ తాజాగా ఇరాన్‌కు చైనా నుండి ఆయుధాలు వస్తున్నాయని, ఇదే జరిగితే చైనాకు మళ్ళీ ఇబ్బందే! ట్రంప్ అంటే ఏంటో చూపిస్తానని చర్చల విఫలం తర్వాత అన్న మాటలివి. ఇరాన్ అమెరికా బృందాల మధ్య చర్చలు విఫలం అవుతాయని అందరూ ఊహించిందే. అమెరికాకు ఇరాన్ దేశం మీద, వారికున్న వనరుల మీద పెత్తనం కావాలి. కాగా హార్మూజ్ జలసంధి వంటి కీలక వనరుల మీద పెత్తనం వదులుకోవడానికి ఇరాన్ సిద్ధంగా లేదు. డీల్ కుదిరినా, కుదరకున్నా మేం గెలిచినట్లేనని చంకలు గుద్దుకోవడం తప్ప చేయగలిగిందేమీ లేదు. అయినా అది ఆయన వ్యవహార శైలి అని తెలిసిన వాళ్ళకు ఏమాత్రం విచిత్రంగా తోచలేదు. ట్రంప్‌కి లోపల్లోపల ఎలా ఉన్నా బయటికి మాత్రం తామే గెలిచామని చెప్పుకోవడంలో ఆయనకు సంతృప్తి ఉంటుంది. ఇదేదో కొత్తగా వచ్చిన ప్రవర్తన కాదు. కింద పడ్డా తానే గెలిచినట్లు బిల్డ్ అప్ ఇచ్చే రకం. ఇక యుద్ధంలో ఇరాన్‌కు చైనా రహస్యంగా ఆయుధాలు సరఫరా చేస్తున్నందువల్లే ఇరాన్ తమ యుద్ధ విమానాలను కూల్చగలిగిందనే అనుమానం ఆది నుంచీఉన్నదే. కానీ తన చేతుల్లోఇరాన్ ఇట్టే నేలకూలుతుందని భావించిన అమెరికాకు ఇరాన్ ఎంతకీ దిగి రాక పోవడంతో ఆ ధృఢవైఖరికి నేపథ్యం ఏమిటో తెలుసుకోవడం కోసమేనా? అన్నట్లు చీకట్లో రాయివేసాడని ఆయన మనస్తత్వాన్ని విశ్లేషించిన వారంతా అదే మిషతో చైనాకు అమెరికా వార్నింగ్ ఇస్తోంది. ఇరాన్ అమెరికాల మధ్య చర్చలు విఫలంకావడంతో ట్రంప్ మరింతగా రెచ్చిపోతున్నారు. కాగా ఎవరు దిగివచ్చినా, రాకపోయినా హార్మూజ్‌లో మరో కొత్త చిక్కు వచ్చిపడింది. సముద్ర మందుపాతరలు ఎక్కడెక్కడ ఉన్నాయో ఇరాన్ తమకు తెలియదంటోంది. పశ్చిమ ఆసియా సంఘర్షణలకి రెండువారాల సీజ్‌ఫైర్ ఉన్నప్పటికీ, హార్మూజ్ పూర్తిగా తెరవబడలేదు. ఆదిలోనే ఇరాన్ తన శత్రు నౌకలను అడ్డుకోవడానికి చిన్న పడవల ద్వారా సముద్ర మైన్లు వేసింది. దీంతో కొన్ని ఓడలపై దాడులు కూడా జరిగాయి, రవాణా పూర్తిగా స్తంభించి పోయింది, ఇంధన ధరలు ఆకాశానికిఎగిసాయి. అవి ఇప్పట్లో తగ్గడం చూడం. ఇప్పుడు ఈ మైన్లు ఇరాన్‌కు తలనొప్పిగా మారాయి. అంతర్జాతీయ మీడియా సమా చారం మేరకు ఇరాన్ మైన్లనురికార్డుచేయకుండా చెల్లా చెదురుగా వేసింది. రికార్డు ఉన్నా, పరికరాలు దెబ్బతిని ఉండవచ్చు. వాటిని గుర్తించి తొలగించడం అతి పెద్దకష్టం. ఇరాన్ వద్ద సరైన సామర్థ్యంలేదు. సీజ్‌ఫైర్ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హార్మూజ్‌ను తక్షణం తెరవాలని డిమాండ్‌చేశారు. కానీ ఇరాన్ టెక్నికల్ సమస్యలు (మైన్లు) కారణంగా చేయలేక పోయింది. దాంతో ట్రంప్ అసంతృప్తి వ్యక్తంచేయడంతో శాంతి చర్చలు అనిశ్చితంగా మారాయి. ఇకపై యుద్ధ జ్వా లలు మింటికెగసే అవకాశం ఉంది. ఈ దశలో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని పరిష్కార దిశగా ఆలోచించడం అవసరం. చర్చలు జరుగుతున్న సమయంలో కూడా లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడులు ఆపలేదు. దాదాపు పదిమంది మృతి చెందారు. ఇదిలా ఉంటే హార్మోజ్ జల సంధిలో మెరైన్ ట్రాఫిక్ డేటా ప్రకారం 426 ట్యాంకర్లు, 34ఎల్పిజి క్యారియర్లు, 196 నౌకలు చిక్కుకుపోయాయి.


ఇంతటి విచిత్ర పరిస్థితిలోనూ ఇరాన్ ఇచ్చిన సందేశమేమిటంటే తాము హార్మూజ్ రక్షణ కోసం గతంలో వివిధ ప్రాంతాల్లో నాటిన సిమైన్స్ ఆచూకీ ఇప్పుడు చెప్పలేని పరిస్థితుల్లో నౌకలు జాగ్రత్తగా కదలాలని హెచ్చరిక చేశాయి. ఒకవేళ చర్చలు ఫలవంతమైతే తప్ప వాటి ఆచూకీ లభించవేమో అన్న అనుమానాలు లేకపోలేదు. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు వీలు లేదని అమెరికా శాసిస్తోంది. ఆది నుంచి తమకు అణ్వాయుధాల తయారీ పట్ల ఆసక్తి లేదని ,తమను నమ్మమని ఇరాన్ వివరిస్తున్నా ట్రంప్ నమ్మకపోవడం కూడా ఈచర్చల్లో గందరగోళానికి కారణంగా చెప్పుకోవాలి. ఆ షరతు విషయంలో కూడా ఇరాన్ నుంచి హామీ కావాలని కోరుతున్నారు. కాగా తాజా పరిస్థితుల్లో యురేనియం శుద్ధి సహా అణు కార్యక్రమాలకు తమపై ఎలాంటి ఆంక్షలు విధించరాదని కోరడంపై మరి కొన్ని కొత్త అనుమానాలు వెలుగులోకి వచ్చాయి. ఇవన్నీ చర్చల పరిష్కారానికి చిక్కుముడులుగా అడ్డుపడుతున్నాయి.

మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.



లియో టాల్‌స్టాయ్

సమస్య చిన్నదైనా, పెద్దదైనా సకాలంలో చర్య తీసుకుంటే ఎందులోనూ అపజయం అనేది ఉండదు.



సిసి కాల్టన్

## ప్రజావాక్కు

### అక్రమ కట్టడాలను కూల్చివేయాలి

ఈమధ్య డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అనుమతులులేని చర్చీలను కూల్చివేయాలి అన్న ప్రకటనతో కొత్తఆలోచన రేకెత్తించాడు. అందుకు ఆయనకు అభినందనలు చెప్పుకోవాలి. కొంతమందికి ఆయనపై కోపం పెరిగింది. ఐతే వెంటనే ఒక రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అనుమతులులేని గుళ్లను కూడా కూల్చివేయాలి అని పోటీగా ఒక ప్రకటన ఇచ్చారు. ప్రభుత్వభూముల్లో అనుమతులులేకుండా కట్టిన మందిరాలను, మతచిహ్నాలను నిర్మోహమాటంగా కూల్చివేయాలీ అని సుప్రీంకోర్టు ఏనాడో ప్రభుత్వాలను హెచ్చరించింది. ఈ ఐఎఎస్ అధికారి తన ఉద్యోగసమయంలో ఎన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారో చెప్పాలి. అధికారంలో ఉన్నపుడు ఈ విషయం గుర్తుకురాలేదా?మరి ఐఎఎస్ అయిన ఈరిటైర్డ్ అధికారి తన ఉద్యోగసమయంలో అనుమతులులేనీ ఒక్క మందిరాన్నీ అయినా కూల్చివేశారా! ఎందుకు కూల్చలేదు ?చెప్పాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ఒంగోలు, ప్రకాశం జిల్లా

### మహిళా సాధికారత

భారత ప్రజాస్వామ్య ప్రయాణంలో మహిళల రిజర్వేషన్ ఒక కీలకమలుపు. సమానత్వం అనేరాజ్యాంగ విలువను కాపాడాలంటే శాసనసభల్లో మహిళల భాగస్వామ్యం పెంగడం అత్యవసరం. దశాబ్దాలుగా కొనసాగుతున్న చర్చలు, రాజకీయ అడ్డంకులు దాటి ఇప్పుడు ఈ లక్ష్యం సాకారం దిశగాసాగుతోంది. ఈసంస్కరణ ద్వారా గ్రామీణ, పట్టణ, గిరిజన అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు చట్టసభ ల్లో స్థానం లభిస్తుంది. సామాజిక పరిమితులు, ఆర్థిక సమస్యలు కుటుంబ బాధ్యతల వల్ల రాజకీయాలకు దూరమైన మహిళలకు ఈ విధానం గొప్ప మార్గాన్ని సుగమం చేస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఓటు రాజకీయాలు

అంబేద్కర్‌ని అవమానించిందని కాంగ్రెస్‌పార్టీని, ఆ పార్టీ నాయకులను పదేపదే విమర్శించడం, అంబేద్కర్ విగ్రహాలను శుద్ధిచేసి వాటికి పూలదండలువేయడం, అంబేద్కర్ అంటే తమకు మాత్రమే గౌరవం అని చెప్పుకోవటం సందర్భం వచ్చినప్పుడల్లా దివంగత ప్రధానులపై నోరు పారేసుకోవడం ఇవన్నీ ఎందుకంటే తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవటానికి ప్రజల దృష్టిని మరల్చడానికి.

- శాస్త్రి, హైదరాబాద్

### పాక్ వేదికగా ప్రహసనం

అమెరికా, ఇరాన్ యుద్ధంలో రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ఒకమొక్కుబడి ప్రహసనం. పాకిస్థాన్‌ని పెద్దమనిషిగా ముందు పెట్టి వైరివర్గాలు ఇరువురూ తమ తమ సొంత పరువులు తాత్కాలికంగా నిలుపుకునే ప్రయత్నం. అయితే ఈ రెండు వారాలైనా కాల్పులు లేకుండా గడుస్తాయా అన్నది ప్రశ్నార్థకం. ఒప్పందానికి వచ్చి ఒక్క రోజు గడవక ముందే లెబనాన్ పైఇజ్రాయెల్ దాడి చేసి వందల మందిని చంపింది. తమ మిత్రులపై దాడిచేయడాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణించి ఒప్పందంలో భాగమైనహోర్ముజ్ జలసంధితెరవడాన్ని వెనక్కి తీసుకుంది. మధ్యవర్తి పాకిస్థాన్, కుదిరిన ఒప్పందంలో లెబనాన్‌పై దాడి చేయకూడదన్న అంశం కూడా ఇమిడి ఉందని అంటుండగా, అదేంలేదని అమెరికా అంటోంది. అయినా చిన్నదో, పెద్దదో శాంతి వైపు జరిగిన ప్రయత్నాన్ని అభినందించవల్సిందే. ఆహ్వానించవల్సిందే. కానీ సాధ్యాసాధ్యాలు కూడా చూడాలి కదా. ప్రహసనాలతో ప్రపంచ శాంతి అసంభవం. చిత్తశుద్ధితో కూడిన దౌత్య ప్రయత్నాలు అత్యవసరం.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### పెరుగుతున్న నకిలీ బాబాలు

నేటి కాలంలో ఊరూర తిరిగే నకిలీ బాబా గాళ్లు, వేషాగాళ్ల ఇంటింటికి వెళ్లి మొదటగా లేని అపోహలు సృష్టించి మీ ఇంట్లో కీడుఉంది. భవిష్యత్‌లో ఇబ్బందులు ఉంటాయి అని పూజలు చేయాలని నమ్మబలికి కోట్లు సమకూర్చుకుంటున్న బాబాగాళ్లు మన కొరకు పూజలు చేయడమేమిటి? వాడు మన బాధలు తీర్చడానికి ఇంటికి ఎందుకు వస్తున్నాడు అని ఆలోచించాలి. నకిలీ బాబాలను తరిమికొట్టాలి. ఎక్కడ నకిలీ బాబాలు తిరుగుతున్న వెంబడే పట్టించేయండి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి

గతప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇప్పుడు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఇవ్వటానికే అభ్యంతరం ఏమిటి?ఓట్ బ్యాంకింగ్ తప్పమరోటి లేదా అయినా లబ్ధిదారులకు కేటాయించాల్సిన కేటాయిస్తే తమకేమి నష్టం వాటిల్లుందో అర్థం కావటంలేదు. ప్రజలను ఒకరకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న ప్రభుత్వం తమకు కాదని తమకు నచ్చిన వారిని నకిలీల ఎంపిక చేసివారికి కేటాయించే విధంగా ఉందని ప్రజల అనుమానం. బెడ్ రూమ్స్ కేటాయించి న్యాయం చేయాలి.

-సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# బతుకు భద్రతకు ఏదీ భరోసా?

**విధి నిర్వహణలోనే ఎంతో మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు అంగవైకల్యం చెందుతున్నారు. అటు కార్మికులకి ఎలాంటి సర్వీస్ బెనిఫిట్స్ లేవు. ఇటు బతుకుకు ఎలాంటి గ్యారెంటీ లేదు. ఇలా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో బ్రతుకుతున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తున్నా కనీస భరోసా కూడా లేకపోవడం నిజంగా బాధాకరం. ఇన్ని కష్టాలు భరిస్తూ కూడా ప్రభుత్వాన్ని కార్మికులు కోరుకునేది ఏంటో తెలుసా! ఆర్టిసన్ కార్మికుల్లో బి.టి డిప్లొమా, పిజిలు చేసినవాళ్లు కూడా ఉన్నారు. అయినా సరే వారికి సరైన కేడర్ లేకుండా, గౌరవం లేకుండా పని చేస్తున్నారు. వారిని కూడా గౌరవించి, సమాలోచన చేసి, తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కనీసం పాత సర్వీస్ రూల్స్ అమలు చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపండని ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.**



కోట దామోదర్

'ఏ గిరెగిరి దంచినోడికి అదే కూలి.. ఎగరకుండా దంచినోడికి అదే కూలి' అన్నట్లు ఏసీలో కూర్చునోళ్లకు అదే కూలి, ఎండనక వాననకా, రాత్రనక, పగలనక కరెంటు కోసం చెట్లు పుట్టలు ఎక్కెటోళ్లకు అదే కూలి కాదు అంతకన్నా తక్కువ కూలీ, అదేంది అనుకుంటున్నారా ఇది నిజం. కింద కూసోని పని చెప్పేటోళ్లకు పైసలెక్కువ అదే కరెంటు స్తంభాలెక్కి పనిచేసే కార్మికులకు తక్కువ జీతం, ఎక్కువ శ్రమ, గ్యారెంటీ లేని జీవితం ఎప్పుడు ఏమవుతుందో అర్థంకాని పరిస్థితి. ఇన్ని ఇబ్బందులను తట్టుకొని కూడా శ్రమిస్తున్నారంటే నిజానికి కరెంటు కార్మికులకు మనం సెల్యూట్ చేయాల్సిన అవసరం ఉంది. ఒక పది నిమిషాలు కరెంటు పోతే మనం అల్లాడిపోతం, అంతేకాదు మనం 12 గంటలు డ్యూటీ చేస్తేనే అయోమయం అయిపోతాం మరి అలాంటిది కరెంటు కార్మికుల పరిస్థితి ఎప్పుడైనా చూశారా? మనం దేశంలో ఎక్కువ కష్టపడేది ఎవరంటే మొదటగా సైనికులు, ఆతర్వాత పోలీసులు, కరెంటు కార్మికులు కూడా అత్యధికంగా శ్రమించే వారే ఇందులో ఎలాంటి సందేహంలేదు. ఎండైనా, వానైనా, రాత్రైనా, ప్రమాదకరమైన పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలెక్కి పని చేయడం చిన్న విషయం కాదు. ఒక్క చిన్న తప్పిదం జరిగినా ప్రాణానికి ముప్పు. అయినా కూడా వాళ్ల పనిచేస్తూనే ఉంటారు. ఎందుకంటే సమాజం నడవడానికి వాళ్ళు పని చేయడం ఎంతో అవసరం లేదంటే అంతా చీకటిమయం. మరి అంత శ్రమించేవారికి జీతం ఎందుకు తక్కువ అనుకుంటున్నారా అదే మరి ఇక్కడ సమస్య మనం అర్థం చేసుకోవాల్సింది. 'ఒక గుడ్డివాడికి చూపు రాగానే మొట్టమొదట విసిరేసేది అప్పటివరకు సహాయపడిన చేతికర్రనే' అన్నట్లు ఓడిపోయిన నాయకులకు, గెలిచిన నాయకులకు కరెంటు కార్మికులు చేతికర్రలాంటోళ్ళు. వాళ్ళకి పదవిరాగానే కరెంటు కార్మికుల కంటికి కనపడకుండా తిరుగుతారు. అప్పటిదాకా మేము ఉన్నాం మీకు అది చేస్తాం, ఇది చేస్తాం అన్నోళ్లే ఆఖరికి ఏమి చేయలేని పరిస్థితి. ఈ కార్మికుల కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కకావికలం అవుతున్నారు. కెసిఆర్ ప్రభుత్వం పెర్మినెంట్ చేస్తాం అనగానే కార్మికులకు ఇక మాకు మంచిరోజులు వచ్చినాయి అనుకుండ్రు. తీరా చూస్తే మళ్ళి మొదటికి వచ్చింది. మళ్ళా ఎలక్షన్స్‌దాకా ఇదే నస. ఇక కరెంటు కార్మికుల జీవితాలు మారేదెన్నడు అనే ప్రశ్నకు జవాబు లేదు. 'ఏరు దాటేదాకా ఓడమల్లయ్య.. ఏరు దాటాక బోడి మల్లయ్య' అన్నట్లు ఎన్ని ప్రభుత్వాలు మారినా వీరి తలరాత మాత్రం మారడం లేదు. పోనీ డ్యూటీ అయినా తగ్గిస్తారేమో అనుకుంటే 24 గంటల డ్యూటీ. ఇంకో గమ్మత్తైన విషయం ఏంటంటే కరెంటు పని చేస్తున్నాం అంటే పిల్లను ఇస్తలేరంట. ఎందుకంటే భద్రత లేని బతుకు కదా! అయ్యో కష్టాలు కన్నీళ్లు ఏరులై పారుతున్న కనికరించే నాయకుడు లేడు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత హోదా కల్పించాడని ఏండ్లతరబడి మొత్తుకున్నా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఇగ చేస్తాం అగ చేస్తాం అని చెప్పుడే తప్ప చేసింది ఏమిలేదు. గత 18ఏళ్లకు పైగా తెలంగాణ విద్యుత్ రంగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా సేవలందిస్తున్న వారు అప్పటి తెలంగాణ ఉద్యమ సమయంలో, వీరి సేవలను క్రమబద్ధీకరిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కె.సి.ఆర్



హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేరకపోవడంతో, 2016లో విద్యుత్ కార్మిక సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. నిరసన కారణంగా జూలై 28, 2017న పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లోని సెక్షన్ 12(3) ప్రకారం ఒప్పందం కుదిరింది. జూలై 29, 2017న సంస్థలో విలీనం చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతవరకు చూస్తే సమస్య పరిష్కారం దిశగా వెళ్లినట్టే కనిపించింది. అయితే, 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు' కొందరు నిరుద్యోగ యువకులు దీనిని హైకోర్టులో సవాలు చేసి నీరుగార్చేలా చేశారు. సెప్టెంబర్ 2018న హైకోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పునిస్తూ, సెక్షన్ 12(3) ప్రకారం ఈ సమస్యలను పరిష్కరించుకునే అధికారం విద్యుత్ సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక సంఘలకు ఉందని స్పష్టం చేసింది. అప్పటి ముఖ్యమంత్రి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ద్వారా 23,667 మంది కార్మికులను క్రమబద్ధీకరించినట్లు ప్రకటించారు. కానీ కార్మికుల రెగ్యులరైజేషన్ అనే ప్రక్రియ అనేక మలుపులు తిరుగుతూ కార్మికులకు పూర్తిస్థాయి క్రమబద్ధీకరణకు బదులుగా, పాత ఉత్తర్వులను రద్దు చేసి, ఫ్యాక్టరీల చట్టం 1946 స్టాండింగ్ ఆర్డర్స్ సర్వీస్ రూల్స్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల అధికారికంగా శాశ్వత హోదా లేకుండానే కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారు. 'చెప్పుకొని మురువు చూసుకొని ఏడువు' అన్నట్లు వీరు సమాజం దృష్టిలో శాశ్వత ఉద్యోగులే కానీ, ప్రభుత్వ దృష్టిలో మాత్రం కాదు. చెప్పుకోవడానికి కరెంటు ఉద్యోగం కానీ వీరి జీవితం కన్నీళ్ల కష్టాలే. జీతం పెంచుడు దేవుడెరుగు కానీ వారికష్టాలను చూసైనా కనికరించండయ్యా మహా ప్రభో అని వేడుకున్నా వినే నాయకుడు లేడు. ఇక పని విషయానికి వస్తే ఎంత చెప్పుకున్నా వీరి కష్టాలు తక్కువగానే అనిపిస్తాయి. ఇతర ప్రభుత్వ ఆఫీసుల్లో ఒకరి పని నలుగురు చేస్తుంటే, కరెంట్ ఆఫీసుల్లో మాత్రం ఐదుగురు చేయాల్సిన పనిని ఇద్దరు ముగ్గరే మోస్తున్నారు. సమాన అవకాశాలు లేకపోవడమే కాదు గత రెండు సంవత్సరాలుగా రెగ్యులర్ అయినవాళ్లకి, రెగ్యులర్ కాని వాళ్లకి 30 నుంచి 60శాతం వరకు జీతాల్లో తేడా ఉంది. సాధారణంగా ఏడాదికి 300 షిఫ్టులు ఉండాలి. కానీ వీరు 450 షిఫ్టులు చేస్తున్నారు. వారానికి సెలవులు కూడా లేకుండా, నిరంతరం పని ఒత్తిడిలోనే బ్రతుకుతున్నారు. ఈ ఒత్తిడి ఎంతలా ఉందంటే తమ కుటుంబ సభ్యుల చివరి చూపుకి కూడా వెళ్లలేని పరిస్థితి. అంత్యక్రియలకు హాజరు కాలేని బాధ మాటల్లో చెప్పలేం. ఇంకా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే. ఆర్టిసన్ కార్మికులకి ఎలాంటి సర్వీస్ బెనిఫిట్స్ లేవు. గ్రాట్యుటీ అనే హక్కు కూడా లేదు. దాంతో రిటైర్ అయ్యాక కూడా బ్రతుకుదెరువు కోసం మళ్లీ వృద్ధాప్యంలో అడ్డా కూలీలుగా తిరగాల్సిన పరిస్థితి. నిబంధనల ప్రకారం గ్రేడ్ మార్చితే ప్రభుత్వానికి నెలకు 10 కోట్ల రూపాయల భారం పడుతుందని చెప్తున్నారు. కానీ వారేమీ అదనంగా అడగడం లేదు సార్. ఇప్పుడు తీసుకుంటున్న జీతాలకే (కరెంట్ పే స్కేల్‌కి) వారిరెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకోండి అనేదే వారి విజ్ఞప్తి. ప్రభుత్వంపై భారం లేకుండా, వారి బ్రతుకుల్ని గాడిలో పెట్టాలనే వారి కోరిక మాత్రమే అంతే అని అంతలా వేడుకున్నా కూడా ప్రభుత్వం కరుణించకపోవడం ఇది మాత్రం కరెంట్ కార్మికుల దౌర్భాగ్యమే అనాలి. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే విధి నిర్వహణలోనే ఎంతో మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు అంగవైకల్యం చెందుతున్నారు. అటు కార్మికులకి ఎలాంటి సర్వీస్ బెనిఫిట్స్ లేవు. ఇటు బతుకుకు ఎలాంటి గ్యారెంటీ లేదు. ఇలా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో బ్రతుకుతున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తున్నా కనీస భరోసా కూడా లేకపోవడం నిజంగా బాధాకరం. ఇన్ని కష్టాలు భరిస్తూ కూడా ప్రభుత్వాన్ని కార్మికులు కోరుకునేది ఏంటో తెలుసా! ఆర్టిసన్ కార్మికుల్లో బి.టి డిప్లొమా, పిజిలు చేసినవాళ్లు కూడా ఉన్నారు. అయినా సరే వారికి సరైన కేడర్ లేకుండా, గౌరవం లేకుండా పని చేస్తున్నారు. వారిని కూడా గౌరవించి, సమాలోచన చేసి, తగిన చర్యలు తీసుకోవాలి. కనీసం వారికి ప్రభుత్వం పాత సర్వీస్ రూల్స్ అమలు చేసి, జీవితాల్లో వెలుగులు నింపండని ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని వారు వేడుకుంటున్నారు. ●

# పర్యావరణంపై ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ప్రతి రోజూ మనం వాడే వస్తువులలో ప్లాస్టిక్ ఒక పెద్ద భాగంగా ఉంది. సూపర్ మార్కెట్ ప్యాకేజింగ్ నుండి షాపింగ్ బ్యాగ్స్, బాటిళ్ల నుండి ఫుడ్ కంటైనర్లు అన్నీ ప్లాస్టిక్‌లో ఉంటాయి. సౌకర్యం, తక్కువ ధర, తేలికపాటైన ఉపయోగం కారణంగా ప్లాస్టిక్ వినియోగం అంతర్జాతీయంగా విపరీతంగా పెరిగింది. అయితే, దీని పరిణామాలు పర్యావరణానికి తీవ్రమైన ముప్పుగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులపై పరిశీలనల ప్రకారం, ప్రతి సంవత్సరం లక్షల టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లోకి పోతున్నది. ఇది సముద్ర జీవుల జీవనానికి ముప్పుగా మారుతోంది. చేపలు, డాల్ఫిన్‌లు, పాల చేపల వంటి జీవులు ప్లాస్టిక్ తింటూ చనిపోతున్నాయి. అందరం తినే సీ ఫుడ్‌లో కూడా మైక్రోప్లాస్టిక్ కలిపి వస్తుంది. భారత దేశంలో కూడా పరిస్థితి ఆందోళన కలిగించేది. పెద్ద నగరాల్లో ప్రభుత్వం నియమాలు, ప్లాస్టిక్ బ్యాగ్‌లపై నిషేధాలు ఉన్నప్పటికీ, రియల్ లైఫ్‌లో సక్రమంగా అమలు కాలేదు. ఉత్పత్తిదారులు, వినియోగదారులు ఇంకా తామ సౌకర్యం కోసం ప్లాస్టిక్‌పై ఆధారపడుతున్నారు. చిన్న గ్రామీణ ప్రాంతాలకూ ఈ సమస్య చేరింది. ఎందుకంటే రీసైక్లింగ్ సౌకర్యాలు అక్కడ అందుబాటులో లేవు. అయితే, నియంత్రణ అసాధ్యం కాదు. గవర్నమెంట్లు, పరిశ్రమలు, సివిల్ సొసైటీ కలిసి చర్యలు తీసుకుంటే మార్పు సాధ్యమే. ఒక్కో దశలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి ముందుగా బ్యాగ్‌లను, బాటిళ్లను రియూసబుల్ పదార్థాల




తో బదిలీ చేయాలి. వర్గీకరణ, రీసైక్లింగ్ అవగాహన పెంచడం ముఖ్యమైంది. చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకు ఈ ప్లాస్టిక్ నిషేధంపై విద్యా కార్యక్రమాలు, సామాజిక ప్రచారాలు నిర్వహించాలి. ప్రైవేట్ కంపెనీలు కూడా ఈ పోరాటంలో కీలకంగా ఉండాలి. ఫుడ్ డెలివరీ, షాపింగ్, ప్యాకేజింగ్ రంగంలో పునర్వినియోగపరచదగిన పదార్థాలను ఉపయోగించడం, ప్లాస్టిక్ తక్కువ చేసే ఇన్నోవేషన్‌లకు ప్రాధాన్యం ఇవ్వడం సమాజానికి మంచి సంకేతం. ముఖ్యంగా, మన రోజువారీ జీవనశైలి మార్పు తప్పనిసరి. ప్లాస్టిక్ బ్యాగ్ స్థానంలో క్లాత్ బ్యాగ్, ప్లాస్టిక్ బాటిల్ స్థానంలో స్టీల్ లేదా గాజు బాటిల్ వాడటం ఈ చిన్న ప్రయత్నాలు పెద్ద ప్రభావం చూపుతాయి. ఒక్కో వ్యక్తి, ఒక్కో కుటుంబం ప్రయత్నం చేస్తే, సమాజంలో పెద్ద మార్పు సృష్టించవచ్చు. మొత్తంగా, ప్లాస్టిక్ వినియోగం నియంత్రణ సాధ్యమే, కానీ అది ఒక నిరంతర కృషి. ప్రభుత్వం, పరిశ్రమ, ప్రజలు మూడింటికీ సమన్వయం ఉండాలి. ఒక్కో దశలో నిర్ణయాలు తీసుకోవడం, అవగాహన పెంచడం, ప్రత్యామ్నాయాలను వాడడం ఇవి కలిపితే మాత్రమే భవిష్యత్తు తరాల కోసం శుభ్రమైన, పర్యావరణ హితమైన ప్రపంచాన్ని సృష్టించవచ్చు. ప్లాస్టిక్ మనకు సౌకర్యం ఇస్తుంది, కానీ పర్యావరణానికి భారంగా మారింది. నియంత్రణ సాధ్యమే, కాబట్టి ప్రతి మనిషి ఈ బాధ్యతను గుర్తించి మార్పు తీసుకురావాలి. ప్రతి చిన్న చర్య, పెద్ద భవిష్యత్తు కోసం" అనేది ఇది అందరికి మార్గదర్శక సూత్రం కావాలి. దీనికై అందరూ పాటుపడాలి. ●

# గ్రామసభల పరమార్థం నెరవేరేనా?

నేదునూరి కనకయ్య

గ్రామసభల్లో మహిళా సంఘాల సభ్యులు, రైతులు, యువత, సర్పంచులు స్వయం సహాయక సంఘాల సభ్యులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు గ్రామసభలో పాల్గొనేట్లు విస్తృత స్థాయిలో ప్రచారంచేయాలన్న మంత్రి సీతక్క సూచనతో గ్రామసభల ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామ సభలో గ్రామ పంచాయతీ నిధులు ఆదాయాల మీద సమగ్ర చర్చచేసి గ్రామ సమస్యలను గ్రామసభల్లో సమగ్రంగా చర్చిస్తారు. పల్లెల్లో గ్రామపంచాయతీలలో స్థానిక స్వపరిపాలన ప్రారంభమైంది. గ్రామస్థాయిలో ప్రజాస్వామ్య పాలనకు పారదర్శకత జవాబుదారీతనానికి గ్రామసభలు ఆయువుపట్టు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమాల అమలు ద్వారా సమగ్ర గ్రామాణాభి వృద్ధిలో గ్రామసభ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ గ్రామసభలు చాలా చోట్ల నామమాత్రమైనాయి. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థికసంఘం రాష్ట్రంలోని పంచాయతీలకు రూ.619కోట్లు నిధులను విడుదల చేసింది. మరో వెయ్యి కోట్ల రూపాయలు నిధులు విడుదలకావలసి ఉందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు. గ్రామ సభ నిర్వహణలో అనేక సమస్యలు సవాళ్లు ఎదురౌతున్నాయి. గ్రామసభలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పైప్రభుత్వం దృష్టిపెట్టాలి. ప్రజలకు, ఓటర్లకు గ్రామసభపై అవగాహనలేదు. చాలా గ్రామాల్లో నిరక్షరాస్యత ఉంది. ప్రశ్నించే తత్వంలేదు. గ్రామస్తులకు గ్రామసభ అధికారాలు విధులు బాధ్యతలు పనిచేసే విధానం ప్రాముఖ్యత గురించి తెలియదు. గ్రామసభ అంటే ప్రభుత్వ కార్యక్రమం అనే అభిప్రాయం ప్రజల్లో నాటుకొని ఉంది. తమ తలరాతలు మార్చుకోవడానికి తమ బతుకుల్లో వెలుగులు తేవడానికి తమప్రణాళికలు తామే రూపొందించుకునే వేదిక అనే విషయం చాలామంది గ్రామీణులకు తెలియకపోవడం విచారకరం. గ్రామసభ సమావేశాలు ప్రభుత్వ సమావేశాలుగా భావిస్తున్నారే తప్ప గ్రామ అభివృద్ధి కొరకు జరిగే సమావేశంగా భావించడంలేదు. అందువల్ల చాలామంది గ్రామాలలో ప్రజలు/ఓటర్లు గ్రామ సభలోపాల్గొనడానికి ఆసక్తి చూపడంలేదు. గ్రామ సభలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. అధికారంలో ఉన్న వర్గం ఆధిపత్యం గ్రామ సభలో రాజ్యమేలటం గమనార్హం. ప్రభుత్వ లబ్ధిదారుల ఎంపికలో అధికారవర్గానికి పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలో వర్గాల ఆధిపత్య పోరుకు గ్రామసభను వేదికగాఎంచుకుంటున్నారని పరిశోధనలు తెలుపుతున్నాయి. అధికారపక్షం తమ కార్యకర్తలకు తమ కులం వారికి ప్రాధాన్యత ఇచ్చే సభగా గ్రామసభ మారిపోయింది. గ్రామసభపై బలమైన సామాజిక వర్గం అధికారం చెలాయించడం తమ నియంత్రణలో ఉంచుకోవడం సామాన్యులుతమ సమస్యలను వినిపించే స్థితిలో లేరు. ఒకవేళ హాజరై సమస్యలను సభదృష్టికి తీసుకు వచ్చినప్పటికీ గ్రామపంచాయతీ పాలకవర్గం అధికారులు ఆసమస్యలపై చర్చించడం లేదు .



సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించిన దాఖలాలులేవు. సామాన్యుల సూచనలు, విజ్ఞప్తులు బుట్టదాకలౌతున్నాయి. అందువల్ల సామాన్యులు గ్రామ సభ అంటే గ్రామంలో ఉన్న ఆధిపత్య కులాలు అధికార వర్గం పోరాట వేదికగా భావిస్తున్నారు. ప్రజావాణిని వినిపించే ప్రజా సంక్షేమం గురించి చర్చించే సభగా పరిగణించడం లేదు. గ్రామ సభ నిర్వహించడానికి కావలసిన కోరం కనీస సంఖ్యలో (ఓటర్లు) ప్రజలు హాజరు కావడం లేదని వాయిదా వేయడం జరుగుతుంది. గ్రామసభను నామమాత్రంగా నిర్వహించి సంతకాలు తీసుకొని ముగిస్తున్నారు. గ్రామసభకు హాజరుగాని వార్డుసభ్యుల ఇంటికివెళ్లి సంతకాలు తీసుకుంటున్నారు. ఈవిధానం మారాలి. గ్రామసభ పల్లె ప్రజాస్వామ్యానికి వేదిక. సమిష్టి నిర్ణయాలకు గ్రామసభ వేదికగా మారాలి. పల్లెల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి. మహిళలకు గ్రామ సభలకు గ్రామంలోని మహిళలు ఎస్సీలు, ఎస్టీలు హాజరు కావడం లేదు. కొన్నిగ్రామాలలో నేటికీ అమలౌతున్న అంటరానితనం, సామాజిక కట్టుబాట్లు భయం వల్ల ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించలేకపోతున్నారు. వారి అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదు. కాబట్టి మహిళాభ్యుదయం ఎస్సీ ఎస్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు అటకెక్కడం వల్ల మహిళా సాధికారిత యువజన సాధికారిత ఎస్సీ, ఎస్టీ, సంక్షేమాలు సంక్షోభంలో పడ్డాయి. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులు గ్రామసభకు హాజరుకావడం లేదు. ఆఫీస్ గుమస్తా లను తమ ప్రతినిధులుగా పంపి గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అధికారుల్లో సమన్వయంలేదు. గ్రామ సభ జరుగునప్పుడు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి. వ్యవసాయం విద్యుత్తు విద్య, పారిశుధ్యం ఆరోగ్యం విద్యకు సంబంధించిన అధికారులు హాజరు కావడం లేదు. ప్రజలు, ఓటర్లు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేవారు గ్రామసభలో లేకపోవడం వల్ల చాలామంది ఓటర్లు, ప్రజలు గ్రామసభకు హాజరుకావడంపై ఆసక్తి చూపడం లేదు. గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి గ్రామపంచాయతీల దగ్గర తగిన నిధులులేవు. నిధుల కొరత రాజ్యమేలుతుంది. ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్థిక సంఘం) ద్వారా సకాలంలో నిధులు మంజూరు కాకపోవడం. చాలాగ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు కొరతగా ఉన్నాయి. తెలంగాణ గ్రామ పంచాయతీ చట్టం 2018ప్రకారం సంవత్సరానికి నాలుగు గ్రామ సభలు జరగాలి. ప్రతిఏటా కనీసం 4సార్లు గ్రామసభ సమావేశాలు నిర్వహించాలి. గ్రామసభ తీర్మానాలను అమలు చేయకపోతే సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సిఫారసు చేసే అధికారం గ్రామసభకు ఉంటుంది. గ్రామ సభ స్వరాజ్య సాధన. బాపూజీ భావించిన గ్రామ స్వరాజ్యం సాకారం కావాలంటే గ్రామ సభలో ఎంపీలు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని సమన్వయంతో గ్రామ సమగ్ర అభివృద్ధి కొరకు ప్రణాళికల రూపకల్పన చేయాలి. గ్రామ అభివృద్ధి వ్యవహారాలతో కార్యాచరణ చేపడితే గ్రామ సమస్యల పరిష్కారమై గ్రామ స్వరాజ్య లక్ష్యం నెరవేరుతుంది. ప్రభుత్వం స్థానిక సంస్థల సాధికారితకు ఆర్థిక పరిపుష్టికి చట్టబద్ధమైన సంస్కరణలు తీసుకొనిమెరుగైన స్థానిక పాలనకు తగుకార్యాచరణ తో ముందుకు వచ్చి గ్రామాభివృద్ధే దేశాభివృద్ధి దిశగా సమగ్రమైన చర్యలు చేపడుతుంది. ●

# 2029లోపే మహిళా రిజర్వేషన్లు



## బిల్లుకు మద్దతివ్వండి: అన్ని పార్టీల నేతలకు ప్రధాని మోడీ లేఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియం' అమలు దిశగా ప్రధాని నరేంద్ర మోడీ కీలక ముందడుగు వేశారు. 2029 సార్వత్రిక ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు వీలుగా, ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభలోని అన్ని పార్టీల పార్లమెంటరీపక్షనేతలకు ప్రధాని లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లుపై చారిత్రక చర్చ జరగనుందని, దీని ఆమోదానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తుందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుంచి నారీశక్తి వందన్ అధినియంపై పార్లమెంట్‌లో చారిత్రక చర్చ జరగనుంది. ఇది మన ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఒక గొప్ప అవకాశం. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్న మన సమష్టి నిబద్ధతను చాటుకోవాల్సిన సమయం ఇది అని మోడీ పేర్కొన్నారు. జాతి నిర్మాణంలో మహిళల పాత్రను ప్రశంసిస్తూ, వారు నిర్ణయాధికారంలో చురుకైన పాత్ర పోషించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు.

2023లో పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ ఈ బిల్లుకు మద్దతు పలికిన క్షణాలను ప్రధాని గుర్తుచేశారు. దేశ మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి అందరూ ఏకతాటిపై నిలిచిన ఆ సందర్భం చిరస్మరణీయమని అన్నారు. అయితే, రిజర్వేషన్ల అమలు సమయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో, నిపుణులు, రాజకీయ పార్టీలతో విస్తృత చర్చల అనంతరం ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చిందని తెలిపారు. ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం మహిళా రిజర్వేషన్ల అమలును 2027 జనాభా లెక్కలతో ముడిపెట్టకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. దీనివల్ల 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా కోటాను అమలు చేయడం సాధ్యమవుతుంది. "దేశవ్యాప్తంగా నారీశక్తి వందన్ అధినియం స్ఫూర్తిని అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థలకు కొత్త శక్తినిస్తుంది అని మోడీ తన లేఖలో వివరించారు. ఇది ఏ ఒక్క పార్టీకో, వ్యక్తికో సంబంధించిన అంశం కాదని, మహిళలు, భావి తరాల పట్ల మనందరి బాధ్యత అని ప్రధాని అన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో పాలుపంచుకునే అవకాశం వదులుకోవద్దని, ఈ సవరణకు మద్దతు ఇవ్వడం ద్వారా మన ప్రజాస్వామ్య సంప్రదాయాలను మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కాబట్టి, ప్రతిపక్షాల మద్దతు ఈ బిల్లు ఆమోదానికి అత్యంత కీలకం కానుంది.

## రాజ్యాంగాన్ని అంతం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి లక్ష్యం

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** భారతదేశంలోని ప్రజలందరూ సమానంగా పరిగణించబడటం వారికి ఇష్టం లేనందున, రాజ్యాంగాన్ని అంతం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపణలు గుప్పించారు. ఏప్రిల్ 14న రానున్న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని, ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన 'అంబేద్కర్ కోసం పరుగు, రాజ్యాంగం కోసం పరుగు' మారథాన్‌ను రాహుల్‌గాంధీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, 'అంబేద్కర్ ప్రధాన సందేశం రాజ్యాంగానికి సంబంధించినదే. రాజ్యాంగం లేకపోతే, మనం 'భారతదేశం' అని పిలుచుకునే ఈ దేశమే ఉండేది కాదు. నేడు, ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి భావజాలం కలిగిన వ్యక్తులు రాజ్యాంగాన్ని అంతం చేయాలని చూస్తున్నారు. వారు ఏమని చెప్పినా సరే, రాజ్యాంగాన్ని తుడిచిపెట్టడమే వారి ప్రధాన లక్ష్యం. ఎందుకంటే భారతదేశంలోని ప్రజలందరూ సమానంగా పరిగణించబడటం వారికి ఇష్టం లేదు' అని ఆరోపించారు. "వారు (ఆర్‌ఎస్‌ఎస్- బిజెపి) ఏం చేసినా సరే, చివరికి అంబేద్కర్ విగ్రహానికి నమస్కరించినా సరే, రాజ్యాంగాన్ని అంతం చేయడమే వారి అసలు లక్ష్యం. రాజ్యాంగాన్ని రక్షించడం, రాజ్యాంగాన్ని బలోపేతం చేయడమే మా లక్ష్యం, అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. జై భీమ్, జై సంవిధానం, జై హింద్, అని ఆయన తన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. భారత క్రికెట్ జట్టు మాజీకెప్టెన్, తెలంగాణ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కూడా ఈ మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా బిల్లుపై అంత తొందరెందుకు?

### 29 తర్వాత అఖిలపక్షం నిర్వహించి బిల్లు పెట్టాలి

### ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, మరికొన్ని ప్రాంతాల్లో ఉప ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్న నిర్ణయాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆదరాబాదరాగా అమలు చేసేందుకు ప్రయత్నించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యగా కనిపిస్తోందన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఖర్గే లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలు వెల్లడించకుండా మళ్లీ తమ సహకారం కోరడం సరికాదని, ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశాలపై అర్థవంతమైన చర్చ జరగాలని ఖర్గే అన్నారు. ఇందుకోసం ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'నారీ శక్తి అభియాన్ 2023' సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మీకు తెలుసు. ఆ సమయంలో తక్షణం ఈ కీలక చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున స్వయంగా కోరా' అని ఖర్గే గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన వివరాలు వెల్లడించకుండా విపక్షాల సహకారాన్ని కేంద్రం కోరుతోందని, డీలిమిటేషన్, ఇతర కీలకాంశాలకు సంబంధించిన వివరాలు లేకుండా ఈ చారిత్రక చట్టంపై అర్థవంతమైన చర్చ సాధ్యం కాదని అన్నారు.

## 167 మంది బాలకార్మికులను రక్షించిన రైల్వేపోలీసులు



**భోపాల్, ఏప్రిల్ 12:** పనుల కోసం సుమారు 167 మంది పిల్లలను రైలులో తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆ రైలును తనిఖీ చేసి వందలాది మంది బాలురను రక్షించారు. బాలల సంరక్షణ అధికారులకు వారిని అప్పగించారు. బీహార్‌లోని అరేరియా ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని లాతూర్‌కు పనుల కోసం వందలాది మంది పిల్లలను పాట్నాపూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్నట్లు పిల్లల సంక్షేమ కమిటీ సమాచారం ఇచ్చింది. దీంతో రైల్వే, ప్రభుత్వ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున మధ్యప్రదేశ్‌లోని కట్ని రైల్వే స్టేషన్‌కు ఆ రైలు చేరుకున్నది. దీంతో ఐదో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై వేచి ఉన్న ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఆ రైలును తనిఖీ చేశారు. ఆరు నుంచి 13 ఏళ్ల వయస్సున్న 167 మంది బాలురను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. సరైన టిక్కెట్లు, పత్రాలు లేకపోవంతో ఆ పిల్లలను తీసుకెళ్తున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు రైలు నుంచి రక్షించిన 167 మంది బాలుర వయస్సు, గుర్తింపు, ప్రయాణం గురించి పోలీసులు తెలుసుకున్నారు. బాలల సంరక్షణ అధికారులకు వారిని అప్పగించారు. దీంతో కొంత మంది పిల్లలను కట్నీ, మరికొందరిని జబల్‌పూర్‌లోని బాలల సంరక్షణ కేంద్రాలకు తరలించారు. వారి తల్లిదండ్రులను సంప్రదించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అలాగే రక్షించిన పిల్లలకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు.

## జులై 3నుంచి ఆగస్టు 28వరకూ అమర్‌నాథ్ యాత్ర



**శ్రీనగర్; ఏప్రిల్ 12:** ప్రతి ఏటా హిందూ భక్తులు ఎంతో ఆశగా ఎదురుచూసే అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్ విడుదలైంది. దక్షిణ కాశ్మీర్‌లోని పరమ పవిత్ర గుహలో కొలువై ఉన్న మంచు లింగాన్ని దర్శించుకునేందుకు చేపట్టే ఈ యాత్ర జూలై 3 నుంచి ప్రారంభం కానుంది. ఈ వివరాల్ని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు. అమర్‌నాథ్ ఆశ్రమ బోర్డుతో, ఎల్జీ సిన్హా అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాత్ర తేదీలపై నిర్ణయం తీసుకున్నారు. సిన్హా కార్యాలయం అయిన లోక్ భవన్ తెలిపిన వివరాల ప్రకారం జూలై 3న ప్రారంభమయ్యే అమర్‌నాథ్ యాత్ర 57 రోజులపాటు సాగి ఆగష్టు 28న ముగుస్తుంది. 13నుంచి70 ఏళ్ల వయసు గలవారు ఈ యాత్ర చేపట్టవచ్చు. ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. దేశంలో వివిధ బ్యాంకులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 556 కేంద్రాలలో భక్తులు ఈ యాత్రకు రిజిష్టర్ చేసుకోవచ్చు. యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంకులలోని కొన్ని కేంద్రాలలో ఈ దరఖాస్తులు లభిస్తాయి. అలాగే, శ్రీ అమర్‌నాథ్ జి ఆశ్రమ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవచ్చు. ఈ యాత్రకు సంబంధించిన తొలి పూజ, జ్యేష్ట పూర్ణిమ సందర్భంగా జూన్ 19న జరుగుతుంది. ఈ యాత్ర రెండు మార్గాల్లో సాగుతుంది. ఒకటి అనంత్‌నాగ్ జిల్లాలోని 48 కిలోమీటర్ల సంప్రదాయ నున్వాన్‌పహల్గాం మార్గం కాగా, రెండోది 14 కిలోమీటర్లు ఉండే బల్తాల్ మార్గం.



## ఇరాక్ అధ్యక్షుడుగా నిజార్ అమెడీ

**బాగ్దాద్, ఏప్రిల్ 12 :** ఇరాక్ పార్లమెంట్ మాజీ పర్యావరణ మంత్రిగా పనిచేసిన నిజార్ అమెడీని దేశ కొత్త అధ్యక్షుడిగా ఎన్నిక చేసింది. రాజధాని బగ్దాద్‌లో జరిగిన కీలక ఓటింగ్ సమావేశంలో ఈ ఎన్నిక పూర్తైంది. పార్లమెంట్ స్పీకర్ హైబెట్ అల్‌హల్బౌసీ, రన్‌ఆఫ్ ఓటింగ్‌లో అమెడీ 227 ఓట్లు సాధించి విజేతగా నిలిచినట్లు అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అమెడీ రాజ్యాంగ ప్రమాణ స్వీకారం చేశారు అని జిన్‌హువా వార్తా సంస్థ తెలిపింది. ఈ కీలక సమావేశానికి 329 స్థానాలున్న పార్లమెంట్‌లో సుమారు 250 మంది సభ్యులు హాజరయ్యారు. అధ్యక్ష ఎన్నికకు అవసరమైన 220 మందికోరమ్‌ను ఇది అధిగమించింది. దేశభక్తి యూనియన్ ఆఫ్ కుర్దిస్తాన్ అభ్యర్థిగా ఉన్న అమెడీ మొదటి రౌండ్‌లో 208 ఓట్లు సాధించి ముందంజలో నిలిచారు. ఆయన ప్రత్యర్థులు కుర్దిస్తాన్ ఇస్లామిక్ యూనియన్‌కు చెందిన ముతన్నా అమిన్ 17 ఓట్లు, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఫువాద్ హుస్సేన్ 16 ఓట్లు పొందారు. మొదటి విడతలో ఏ అభ్యర్థి రెండొంతుల మెజారిటీ సాధించకపోవడంతో అమెడీ, అమిన్ మధ్య రెండో విడత ఓటింగ్ నిర్వహించారు. బగ్దాద్‌లోని పీయూకే రాజకీయ బ్యూరో అధిపతిగా ఉన్న అమెడీ, 2022 నుంచి 2024 వరకు ఇరాక్ పర్యావరణ మంత్రిగా సేవలందించారు. గత ఇరాక్ అధ్యక్షులకు సలహాదారుడిగానూ పనిచేశారు. ఇరాక్ రాజ్యాంగం ప్రకారం, కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు 15 రోజులలోపుగా పార్లమెంట్‌లో అతిపెద్ద పార్టీ నేతను ప్రధానమంత్రిగా నామినేట్ చేయాలి. ఆ తరువాత ఆ అభ్యర్థి 30 రోజులలో కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసి విశ్వాస పరీక్షను ఎదుర్కోవాలి. గత సంవత్సరం నవంబరులో ఇరాక్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఓటింగ్‌తో దీర్ఘకాల రాజకీయ స్థబ్దతకు ముగింపు పలికినట్లు భావిస్తున్నారు.


## ఎన్నికల ర్యాలీలు రద్దుచేసుకుంటున్న టివికె విజయ్

### వర్క్‌ఫ్రం హోం పాలిటిక్స్ అంటూ డిఎంకె ఎద్దేవా



**చెన్నై, ఏప్రిల్ 12:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్న తరుణంలో, నటుడు, తమిళగ వెట్రి కజగం(టీవీకే) అధినేత విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముందుగా ఖరారైన పలు బహిరంగ సభలను ఆయన అకస్మాత్తుగా రద్దు చేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయంపై అధికార డీఎంకే 'వర్క్ ఫ్రమ్ హోమ్ రాజకీయమంటూ వ్యంగ్యాస్త్రాలు ఎక్కుపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జరగాల్సిన కీలకమైన ర్యాలీలు, సభలను విజయ్ రద్దు చేస్తున్నట్టు టీవీకే వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయానికి కచ్చితమైన కారణాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. ప్రచార వ్యూహంలో మార్పులు చేయడం లేదా భద్రతాపరమైన అంశాలు దీనికి కారణమై ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ నిర్ణయంపై అధికార డీఎంకే పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఎన్నికల సమయంలో ప్రజల మధ్య ఉండాల్సింది పోయి, ఇలా సభలు రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించింది. విజయ్ క్షేత్రస్థాయిలో తిరగకుండా వర్క్ ఫ్రమ్ హోమ్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేసింది. మరోవైపు, అధినేత పర్యటనలు ఆగిపోవడంతో టీవీకే కార్యకర్తలు, అభిమానులు కొంత నిరాశకు గురయ్యారు. విజయ్ సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు చేరువవుతారని పార్టీ నాయకులు చెబుతున్నారు. డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు పోటీగా తమిళనాడులో మూడో ప్రత్యామ్నాయంగా నిలవాలని టీవీకే లక్ష్యంగా పెట్టుకుంది. ఇలాంటి కీలక సమయంలో విజయ్ ప్రచార సభలను రద్దు చేసుకోవడం ఆయన వ్యూహంపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. పార్టీవర్గాల ప్రకారం ప్రభుత్వం సరైన అనుమతులు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం తమ ప్రచార కార్యక్రమాల్ని అడ్డుకుంటోందని టీవీకే ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఆయన ర్యాలీలకు సమయం తక్కువగా ఇవ్వడం, సరైన భద్రత ఏర్పాటు చేయకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. అలాగే, రవాణాపరమైన సమస్యలు కూడా కారణాలుగా చెబుతున్నారు. ఇక, గత ఏడాది కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అందుకే ముందు జాగ్రత్త చర్యగా, ఇలాంటి ఘటనలు జరగకుండా విజయ్ కొన్ని ర్యాలీలు రద్దు చేస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు టీవీకేకు ప్రధాన ఆకర్షణ విజయ్. అలాంటిది ఆయనే ప్రచారానికి రాకపోవడంతో టీవీకే తరఫున పోటీ చేస్తున్న నేతలు ఇబ్బంది పడుతున్నారు.

## బీహార్ సిఎం ఎంపికకోసం పరిశీలకునిగా కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



**పాట్నా, ఏప్రిల్ 12:** బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. కొత్త ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియను బీజేపీ అధిష్ఠానం వేగవంతం చేసింది. ఈ క్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు బీహార్ పరిశీలకుడిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు తాజాగా నియమించింది. బీహార్ శాసనసభ పక్ష నాయకుడిని ఎన్నుకునే బాధ్యతను శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అప్పగిస్తూ బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఆయన అత్యవసరంగా బీహార్‌లోని బీజేపీ ఎమ్మెల్యేలందరితో భేటీ కానున్నారు. ఈ సమావేశం అనంతరం కొత్త ముఖ్యమంత్రి ఎవరనేది అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ మేరకు బీజేపీ తన అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో పోస్ట్ చేస్తూ. శాసనసభ పక్ష నాయకుడి ఎన్నిక ప్రక్రియ చౌహాన్ పర్యవేక్షణలో జరుగుతుందని వెల్లడించింది. బీహార్ రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాల యంలోని క్యాబినెట్ గదిలో ముఖ్యమైన సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించనున్నారు. నితీష్ కుమార్ పదవీకాలంలో ఇదే చివరి క్యాబినెట్ సమావేశం కావచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా హాజరయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి అభ్యర్థిపై బీహార్ మంత్రి విజయ్ కుమార్ చౌదరి స్పందిస్తూ ఎన్డీఏ శాసనసభ పక్షం తమ నాయకుడిగా ఎవరిని ఎన్నుకుంటే వారే ముఖ్యమంత్రి అవుతారు. ఇందులో భారతీయ జనతా పార్టీ నిర్ణయమే కీలకమని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రిసామ్రాట్ చౌదరి నిరంతరం ముఖ్యమంత్రితో భేటీ అవుతుండటంపై స్పందిస్తూ వారు గతంలోనూ క్రమం తప్పకుండా కలుసుకునేవారని, ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని అన్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్ రంగంలోకి దిగడంతో బీహార్ కొత్త ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నితీష్ కుమార్ తదుపరి అడుగు ఏంటనేది ఏప్రిల్ 14 నాటి క్యాబినెట్ భేటీ తర్వాత స్పష్టమయ్యే అవకాశం ఉందని సమాచారం.

## హార్ముజ్‌లో మళ్లీ ఉద్రిక్తత..సూపర్ ట్యాంకర్లు యూటర్న్



**టెహ్రాన్, ఏప్రిల్ 12:** ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హార్ముజ్ మీదుగా పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశించాల్సిన రెండు అతిపెద్ద ఖాళీ సూపర్‌ట్యాంకర్లు ఆదివారం వెనక్కి మళ్లాయి. హార్ముజ్‌లోకి ప్రవేశించడానికి అనుమతి లభించకపోవడంతో చివరి నిమిషంలో ఇవి యూటర్న్ తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మాల్టా పతాకంతో ఇరాక్‌కు వెళ్తున్న 'ఆగియోస్ ఫనౌరియోస్ 1', యుఎఇలోని దాస్ ద్వీపానికి వెళ్తున్న పాకిస్థాన్ పతాకం ఉన్న 'షాలమార్', దక్షిణ కొరియాకు చెందిన 'మొంబాసా బి' అనే మరో నౌక శనివారం రాత్రి గల్ఫ్ ఆఫ్ ఒమర్ నుంచి హార్ముజ్ వైపు ప్రయాణించినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు పేర్కొన్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఇవి ఇరాన్‌లోని లారాక్ ద్వీపం సమీపానికి చేరుకున్నట్లు తెలిపాయి. అయితే 'మొంబాసా బి' నౌకకు మాత్రమే హార్ముజ్‌లో ప్రవేశానికి అనుమతి లభించడంతో మిగిలిన రెండు భారీ నౌకలు వెనక్కి మళ్లినట్లు వెల్లడించాయి.

## అప్పుడు బెదరించింది..ఇప్పుడు భయపడుతోంది: నెతన్యాహు



**టెల్‌అవీవ్, ఏప్రిల్ 12:** ఇరాన్-అమెరికా మధ్య చర్చలు విఫలమవడంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందించారు. ఇరాన్‌లోని అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలను అణచివేయడానికి చేస్తున్న పోరాటంలో తాము విజయం సాధించామన్నారు. గాజాలోని హమాస్, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా, సిరియాలోని అసద్ ప్రభుత్వం, ఇరాక్‌లోని సాయుధ ముఠాలు, యెమెన్‌లోని హూతీల రూపంలో ఇరాన్ తమను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు ప్రయత్నించిందని పేర్కొన్నారు. కానీ అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఏకమై ఇరాన్ సేనలకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయన్నారు. ఇజ్రాయెల్‌ను సర్వనాశనం చేస్తామని నాడు బెదరించిన ఇరాన్ పాలకులు నేడు భయంతో మనుగడ కోసం పోరాడుతున్నారని అన్నారు. ఈ యుద్ధంలో తాము ఇప్పటికే చారిత్రాత్మక విజయాలు సాధించినప్పటికీ.. ఈ పోరాటం ఇంకా ముగిసిపోలేదని నెతన్యాహు అన్నారు. మరోవైపు పాకిస్థాన్‌లో అమెరికాతో చర్చలు విఫల మైనప్పటికీ భవిష్యత్తులో అగ్రరాజ్యంతో మళ్లీ చర్చలు జరపడానికి తాము సిద్ధంగాఉన్నట్లు ఇరాన్ విదేశాంగప్రతినిధి ఇస్మాయిల్‌బఘాయీ పేర్కొన్నారు.

## పెళ్లి చేసుకోవాలి, అందమైన అమ్మాయిని అప్పగించండి: ఉగాండా జనరల్



**కంపాలా, ఏప్రిల్ 12:** ఉగాండా సైన్యాధిపతి జనరల్ ముహూజీ కైనెరుగాబా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. సోమాలియాలో ఇస్లామిక్ మిలిటెంట్ల నుంచి రక్షణ కల్పించడానికి ఉగాండా అందిస్తున్న సేవలకు గానూ 1 బిలియన్ డాలర్ల నగదు చెల్లించాలని తుర్కియేను డిమాండ్ చేసింది. నగదుతోపాటు తను పెళ్లి చేసుకోవడానికి దేశంలోని అత్యంత అందమైన అమ్మాయిని అప్పగించాలని అన్నారు. 30 రోజుల్లోగా తన డిమాండ్‌కు అంగీకరించకపోతే తీవ్రమైన దౌత్య పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తుర్కియేను హెచ్చరించారు. ఉగాండాలోని ఆ దేశ రాయబార కార్యాలయాన్ని సైతం మూసివేస్తామని, తమ గగనతలంలో తుర్కియే ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు నిలిపివేస్తామని అన్నారు. తుర్కియేతో ఉగాండాకు ఉన్న సంబంధాలన్నీ త్వరలో తెంచుకుంటామని కైనెరుగాబా అన్నారు.

## ఉగ్రవాద సూచీలో పాకిస్థాన్ నం.1



**రబత్(మొరాకో), ఏప్రిల్ 12:** ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద మరణాలు, దాడుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్‌లో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026లో పాకిస్థాన్ అగ్ర స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది అక్కడ ఉగ్రవాద సంబంధిత ఘటనల్లో ఏకంగా 1,139 మంది ప్రాణాలు కోల్పోయినట్లు మొరాకోకు చెందిన జర్నలిస్ట్, పరిశోధకురాలు ఫాతిమా ఎల్ హాషిమి అమెరికన్ థింకర్ అనే ఆన్‌లైన్ మ్యాగజైన్‌లో ఈ విషయంపై విశ్లేషించారు. పాకిస్థాన్‌లో హింస ఒక సాధారణ విషయంగా మారిపోయిందని, ఇది దేశ భద్రతా వ్యవస్థ తీవ్రంగా క్షీణిస్తోందనడానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. పాక్‌లో ఉగ్రవాదం పెరగడం ఇది వరుసగా ఆరో ఏడాది అని ఆమె గుర్తుచేశారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా మరణాల సంఖ్య పెరిగిందని తెలిపారు. 2025లో జరిగిన దాడుల్లో 74 శాతానికి పైగా, మరణాల్లో 67 శాతం ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే నమోదయ్యాయని ఫాతిమా వివరించారు.

## చోరీ కోసం వచ్చి షట్టర్‌లో ఇరుక్కున్న దొంగ



**లక్నో, ఏప్రిల్ 12:** ఒక క్లినిక్‌లో చోరీ కోసం దొంగ ప్రయత్నించి రోలింగ్ షట్టర్, గోడ మధ్య ఉన్న ఖాళీలో అతడు ఇరుక్కుపోయాడు. షట్టర్ పైనుంచి వేలాడుతున్న ఆ వ్యక్తిని స్థానికులు గమనించారు. చివరకు ఫైర్ సిబ్బంది అతడ్ని రక్షించి పోలీసులకు అప్పగించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. అర్ధరాత్రి వేళ ఒక యువకుడు దొంగతనం కోసం క్లినిక్ పైకప్పు మీదుగా లోపలకు ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. కిందకు దిగుతున్నప్పుడు షట్టర్, గోడ మధ్య ఉన్న గ్యాప్‌లో ఆ వ్యక్తి ఇరుక్కుపోయాడు. అతడి మెడ అక్కడ చిక్కుకుపోవడంతో వేలా డుతూ రాత్రంతా అక్కడ ఉండిపోయాడు. ఆదివారం ఉదయం స్థానికులు అతడ్ని గమనించారు. పోలీసులు, అగ్నిమాపక విభాగానికి సమాచారం ఇచ్చారు. మరోవైపు ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. స్థానికుల సహాయంతో ఆ వ్యక్తిని రక్షించారు. అభిషేక్‌గా గుర్తించిన అతడ్ని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఆ దొంగను రెస్క్యూ చేసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో నెటిజన్లు ఫన్నీగా కామెంట్లు చేశారు.

## అమెరికాలో అతిపెద్ద భారీ విజయతోరణం



**వాషింగ్టన్, ఏప్రిల్ 12:** అగ్రరాజ్యం అమెరికాకు రాజధాని నగరమైన వాషింగ్టన్ డిసిలో భారీ విజయ తోరణాన్ని నిర్మించేందుకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృషి చేస్తున్నారు. అందుకు సంబంధించిన ప్రణాళికను అమెరికా ప్రభుత్వానికి చెందిన యూఎస్ కమిషన్ ఆన్ ఫైన్ ఆర్ట్స్ విడుదల చేసింది. తోరణంపై 250 అడుగుల ఎత్తైన రెక్కల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ విగ్రహం చేతిలో న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ చేతిలో ఉన్నట్లుగా కాగడా ఉండనుంది. తలపై కిరీటం ఉంటుంది. విగ్రహానికి రెండువైపులా రెండు గద్దలు, నాలుగు సింహాల విగ్రహాలు ఉంటాయి. అన్ని విగ్రహాలకు బంగారు పూత వేస్తారు. ఈ తోరణం తూర్పు భాగంలో లింకన్ మెమోరియల్, పశ్చిమ భాగంలో ఆర్లింగ్టన్ జాతీయ శ్మశాన వాటిక ఉంటాయి. కొత్త నిర్మాణం పూర్తయితే 99 అడుగుల ఎత్తులో ఉన్న లింకన్ మెమోరియల్ దీనికన్నా చిన్నదిగా కనిపిస్తుంది. భారీ విజయ తోరణం ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన, అందమైనదిగా నిలుస్తుందంటూ ట్రంప్ సోషల్ మీడియాలో తాజాగా ఒక పోస్ట్ పెట్టారు. వాషింగ్టన్ డీసీ ప్రాంతానికి అది ఒక అద్భుతమైన అదనపు ఆకర్షణగా మారుతుందని అన్నారు. కాగా అమెరికా స్వాతంత్ర్యాన్ని పొంది 250 ఏళ్లవుతున్న సందర్భంగా ఈ భారీ నిర్మాణాన్ని తలపెట్టారు. అమెరికాకు 1776లో స్వాతంత్రం వచ్చింది.

## బిజెపీ ఆఫీస్ బాయ్‌కి కార్పొరేటర్ టికెట్



**మెహసానా, (గుజరాత్), ఏప్రిల్ 12:** విధేయతకు, సామాన్య కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇస్తుందని బీజేపీ మరోసారి నిరూపించింది. 28 ఏళ్ల పాటు బీజేపీ ఆఫీస్‌లో ప్యూన్‌గా పనిచేసిన వ్యక్తికి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్ ఇచ్చింది. గుజరాత్‌లోని మెహసానా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. దాదాపు మూడు దశాబ్దాలుగా మెహసానా జిల్లా బీజేపీ కార్యాలయంలో ప్యూన్‌గా పనిచేస్తున్న అంకితభావం గల ఉద్యోగి రమేష్ భిల్‌కు టికెట్ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. రమేష్ భిల్ అధికారికంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయన 13వవార్డుకు పార్టీ కార్యకర్త నుంచి అభ్యర్థిగా మారారు. 10వతరగతి వరకు చదువుకున్న రమేష్, 28ఏళ్లుగా పార్టీ కార్యాల యం లో పనిచేయడం, అక్కడికి వచ్చే సీనియర్ నాయ కులకు, పార్టీ కార్యకర్తలకు టీ, నీరు అందిస్తూ ఉన్నారు. ఆయనకు ఉన్న విధేయత, క్షేత్రస్థాయి కార్యకర్తలతో ఆయనకున్న పరిచయం కారణంగా పార్టీ ఆయనకు టికెట్ ఇచ్చింది. ఇప్పటి వరకు నా పార్టీ కార్యాలయం కోసంపనిచేశానని, ఇప్పటినుంచి తన వార్డు ప్రజల బాగుకు పనిచేస్తానన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు శ్రీకారం



● ఫేజ్ వన్ కింద రూ.9.55 కోట్ల పనులకు మంత్రి శంకుస్థాపన

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి: తూర్పు గోదావరి జిల్లా, గోదావరి పుష్కరాలు- 2027 సందర్భంగా చేపట్టవలసిన పనులను ప్రారంభం చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఫేజ్ 1 కింద రూ.9.55 కోట్ల తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులతో కలిసి శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా పరిసర ప్రాంతాల ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణపై ఇప్పటివరకు మూడు రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక సమావేశం, 12 మంత్రులతో సబ్ కమిటీ సమావేశం, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రులు, సెక్రటరీలతో మరో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్కరాల నిర్వహణలో విశేష అనుభవం కలిగిన నాయకుడని, ఆయన సారథ్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలో రూ.9.55 కోట్ల వ్యయంతో 6 దేవాదాయ సంస్థల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఆలయాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో గుర్తించి అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లోని 43 దేవాలయాల అభివృద్ధి కోసం రూ.51.79 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచినట్లు వెల్లడించారు.

పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు రానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాలు సమగ్రంగా కల్పించనున్నట్లు తెలిపారు. గోదావరి నది ప్రవహించే 212 కిలోమీటర్ల పరిధిలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో పుష్కర స్నానాలకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో ఈ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 26 నుంచి జూలై 7 వ తేదీ గోదావరి పుష్కరాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఇందులో శ్రీ పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం (పిండప్రదాన భవనం)కు రూ.3 కోట్లు, శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవస్థానం ముఖ మండపం నిర్మాణానికి రూ.1 కోటి, శ్రీ రాజమండ్రి నూనేవర్తకుల అన్నదాన సమాజం అన్నదాన భవనానికి రూ.70 లక్షలు, శ్రీ రామలింగ చౌడేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.55 లక్షలు, శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం భవనం నిర్మాణానికి రూ.2.80 కోట్లు, శ్రీ చందా సత్రం కళ్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలు దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మహోత్సవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ కె.రామచంద్ర మోహన్, ప్రాంతీయ జాయింట్ కమిషనర్ వి.త్రినాథరావు, రాష్ట్ర స్థాపతి పి. పరమేశ్వరప్ప, కేఆర్ఆర్‌సి ఎస్‌డిసి కె.భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఎస్.ఇ. దుర్గేష్, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, జిల్లా దేవాదాయ అధికారి ఇ.వి. సుబ్బారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్‌కుమార్, ఎఏఇ కళ్యాణ్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారులు విశ్వనాథ్ రాజు, లక్ష్మీబాయి, నాగేశ్వరరావు, తారకేశ్వరరావు, వి. శ్రీదేవి, రమేష్, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



## మోస్ట్ వాంటెడ్ అంతర్ రాష్ట్ర ఘరానా హంతకుడు అరెస్ట్

● రూ.20 లక్షల విలువైన బంగారు నగలు, ఆటో సీజ్

● తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు వివరాలు వెల్లడి

తిరుపతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లాలో గతంలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని, బంగారు ఆభరణాల కోసం జరిగిన వరుస హత్య కేసుల మిస్టరీ ని తిరుపతి జిల్లా పోలీసులు చేధించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో2024 వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు నమోదైన కేసుల చేధింపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ ఎ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడంతో సులభమైంది. రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మహిళ హత్య, బంగారు ఆభరణాల చోరీ కేసులో అరెస్టు కాబడిన ముద్దాయి పి. విశ్వనాథ్ ప్రశాంత్ తిరుపతి పరిధిలో జరిగిన రాబరీ కేసులో తదుపరి దర్యాప్తు నిమిత్తము పోలీస్ కస్టడీకి తీసుకుని విచారణ చేయడంతో వెలుగులోకి వచ్చింది. మోస్ట్ వాంటెడ్ అంతర్ రాష్ట్ర ఘరానా హంతకుడుని అరెస్ట్‌చేసి, రూ.20 లక్షల విలువైన బంగారు నగలతో పాటు ఆటో స్వాధీనం చేసుకున్నారు కేరళ పోలీసులు. నిందితుడు ఆచూకీ కోసం రూ.2 లక్షల రివార్డ్ ప్రకటించారు. తిరుపతి ప్రాంతంలో నాలుగు హత్యలు చేసి దోచుకున్నాడని ఎస్పీ ఆదివారం మీడియాకు తెలిపారు. తిరుచానూరులో రెండు హత్యలు, రామచంద్రపురంలో ఒకటి, పిచ్చాటూరులో మరొకటి హత్యలు చేసి నగలు దోపిడితో పరారయ్యాడు. రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బలిజపల్లెలో జరిగిన మునీశ్వరి హత్య కేసులో నిందితుడు పట్టుబడ్డాడు. నిందితుడికి సహకరించిన రాజమ్మను కూడా అరెస్టు చేయడం జరిగిందన్నారు. కర్ణాటక, కేరళ రాష్ట్ర సరిహద్దు సులియా ప్రాంత నివాసి విశ్వనాథ్ ప్రశాంత్ అజీజ్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు. 2018లో కేరళ రాష్ట్రంలో హత్య కేసులో నిందితుడికి శిక్ష పడి పోలీసుల కస్టడీ నుండి తప్పించుకుని మారు పేర్లతో తిరుగుతున్నాడు. కేరళ పోలీసులకు సమాచారం అందిస్తామని జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు వెల్లడించారు.

## ఉగ్ర లింకుల కేసు: నిందితుల విచారణలో కీలక విషయాలు

● భారత్‌లో ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పాటు ఆలోచనల్లో భాగంగా ఆత్మాహుతి దాడులు

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ ఉగ్ర లింకుల కేసులో పోలీసు కస్టడీలో నిందితుల విచారణ కొనసాగుతుంది. విచారణలో భాగంగా ఆరుగురు నిందితులను వేర్వేరు గదుల్లో పోలీసులు, సీఐ, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు విచారణ చేశారు. నిందితుల నుంచి పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. భవిష్యత్తులో ముజాహిద్దీన్లుగా మారేందుకు కూడా తాము సిద్ధపడ్డామని నిందితులు వెల్లడించారు. వారందరి నోట భారత్‌లో ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచననే కీలమనే మాట వెల్లడైంది. లక్ష్య సాధన కోసం ఆత్మాహుతి దాడులకు సిద్ధపడాలని తాము నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. తాము జిహాదీ భావజాలానికి ఆకర్షితులయ్యామని సామాజిక మాధ్యమాల్లో ఆ విషయాలకు సంబంధించి విస్తృతంగా పోస్టులు పెట్టామని నిందితులు వెల్లడించినట్లు తెలిసింది. భారత్‌లో ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించేందుకు కృషి చేయాలంటూ విదేశీ హ్యాండర్ల నుంచి వచ్చిన పిలుపు మేరకు తాము తీవ్రవాద భావజాలం వైపు మళ్లామని వారు అధికారులకు వివరించారు. ముజాహిద్దీన్లుగా మారేందుకు మరికొన్ని నెలల్లో పాకిస్థాన్‌కు వెళ్లాలని కూడా తాము నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు. విదేశీ హ్యాండ్లర్లు ఎలా పరిచయం అయ్యారు? వారు మిమ్మల్ని ఎలా ప్రేరేపించారు? అని నిందితులను పలు రకాలుగా ప్రశ్నించారు. బెనెక్స్ గ్రూప్‌ను ఎందుకు ఏర్పాటు చేశావు? ఎవరి ఆదేశాల మేరకు ఇలా చేశావని ఢిల్లీకి చెందిన లక్కీ అహ్మద్‌పై అధికారులు ప్రశ్నల వర్షంతో ఉక్కిరిబిక్కిరి చేశారు. సోషల్ మీడియాలో ఐసిస్ జెండాను ఎగురవేయడం, ఉగ్రవాదుల చిత్రాల్లో తన తల వరకు పెట్టుకున్న వాటిని ఎందుకు పోస్టు చేశావని పోలీసులు అతడ్ని అడిగారు. తమ లక్ష్యాలను సాధించేందుకు ఆత్మాహుతి దాడులకు పాల్పడటానికి కూడా తాను సిద్ధంగా ఉన్నానని లక్కీ అహ్మద్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. తనకు సోషల్ మీడియాలో షకూర్ పరిచయం అయ్యాడనీ చెప్పాడు. అతను ప్రేరేపించడంతోనే తాను నిత్యం సామాజిక మాధ్యమాల్లో ఉగ్రవాదానికి సంబంధించినవి పోస్టులు పెట్టేవాడినని లక్కీ అహ్మద్ పోలీసులకు వివరించినట్లు తెలిసింది. సమాచారం.ఈ కేసులో విజయవాడలోని ఉగ్రవాద భావజాలాన్ని పెంపొందించడంతో పాటు జిహాద్ సిద్ధత కోసం యువతను ప్రేరేపించడంలో ప్రధాన పాత్ర ఎవరు పోషించారు, వారితో వీరికి ఉన్న సంబంధాలు, విదేశీ హ్యాండ్లర్ల ఎవరూ అన్న విషయాలు దర్యాప్తులో వెలుగు చూస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ, ఢిల్లీ, జోధ్‌పూర్ వంటి ప్రాంతాల మధ్య టెర్రరిస్టు సంబందాలున్నట్లు గుర్తించారు.

ఉగ్రలింకుల కేసు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్వహిస్తున్న సమగ్ర దర్యాప్తు చర్యల్లో కీలకంగా మారింది. ఉగ్రవాద చర్యలను నిరోధించేందుకు, యువతలో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడాన్ని అరికట్టేందుకు ఈ దర్యాప్తు కీలకంగా భావిస్తున్నారు. ఉగ్రలింకుల కేసులో అరెస్టు అయిన మైనర్ రిమాండ్‌ను ఈనెల 24 వరకు పొడిగించారు. అతడి కస్టడీ కోసం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై తదుపరి విచారణ జూన్ 13కి వాయిదా పడింది. మైనర్‌కు సంబంధించిన విచారణ కూడా ఉగ్రవాద కార్యకలాపాల చివరి విడత నిందితుల విచారణలో కీలకం కానుంది.

## క్షత్రియులు ఐకమత్యంతో ముందుకురావాలి

- వక్తలు పిలుపు



తిరుపతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాబోవు రోజుల్లో రాజకీయాలకు అతీతంగా క్షత్రియులు ప్రతి ఒక్కరు ఐక్యమత్యంతో ఏక వాక్య తీర్మానంతో ముందుకెళుతూ సంఘ బలోపేతానికి కృషి చేయాలని క్షత్రియ సంఘం నాయకులు ముఖ్యవక్తలు కోరారు. రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం కార్యనిర్వాహణ కమిటీ ప్రమాణస్వీకారం తిరుపతిలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా సిద్ధార్థ విద్యాసంస్థల యజమాని కొండూరు అశోక్ రాజు, ప్రధాన కార్యదర్శిగా నారాయణ బాబు, కోశాధికారిగా శివరాజు, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ బలరామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీరేంద్రవర్మ, ఆర్గనైజేషన్ సెక్రటరీగా కీర్తిపాటి రాధాకృష్ణ వర్మ, కార్యవర్గ సభ్యులు ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి, పూర్వ టిటిడి జెఇఒ కెఎస్ శ్రీనివాసరాజు హాజరయ్యారు. తమిళనాడు, కర్ణాటకకు సంబంధించిన రాష్ట్రీయ క్షత్రియ సేవా సమితి సభ్యులందరూ కూడా హాజరయ్యారు. తిరుపతిలో నూతనంగా నిర్మాణం చేస్తున్న క్షత్రియ భవన నిర్మాణం పూర్తికి సహకరిస్తూ పలువురు దాతలు విరాళాలు ప్రకటించారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో ఖచ్చితంగా కొత్తగా ఎన్నికైన సంఘం క్షత్రియ బడుగు బలహీన వర్గాల్లో ఉన్న వారందరికీ వారి తోడ్పాటు అందించి కృషి చేయాలని మరొక ముఖ్యఅతిథిగా పాల్గొన్న గత తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్, రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు లోకేష్ వర్మ తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ శాఖలో క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య కులాలు సంఘటితంగా ఏర్పాటు చేసుకున్న సంఘం బలోపేతమవుతుందని, ఇతర అన్ని శాఖల్లో కూడా ఉద్యోగులు అదే రీతిన సంఘం ఏర్పాటు చేసుకొని క్షత్రియ సంఘానికి క్షత్రియకుల వికాసానికి తోడ్పడాలని కార్యవర్గ సభ్యులు దొమ్మరాజు భాస్కర్ రాజు తెలిపారు.

## బ్రాహ్మణులపై దాడులు ఆపండి

● రిజర్వేషన్ చట్టం తక్షణమే అమలు చేయాలి ● రాష్ట్ర బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్



తిరుపతి(హెల్త్), ఏప్రిల్ 12 ప్రభాతవార్త: బ్రాహ్మణులపై దాడులు ఆపాలని, బ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, బ్రాహ్మణులకు రిజర్వేషన్ చట్టం తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ కోరారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మందకృష్ణ అనే వ్యక్తి బ్రాహ్మణ సమాజంపై చేస్తున్న విద్వేషపూరిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంద కృష్ణ చేస్తూ వున్న విద్వేషపూరిత వ్యాఖ్యలపై నిరసన తెలియజేస్తూ వున్నామన్నారు. సమాజంలో కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ఉనికి చాటుకోవాలని మందకృష్ణ అనే వ్యక్తి చూస్తున్నారన్నారు. విద్వేష భావజాలాన్ని ప్రచారం చేస్తూ సమాజాన్ని విడగొట్టాలని చూడటం మేధోపరమైన విషయమని, ప్రస్తుతం ఎవరు ఏ కుల, మత అనే తారతమ్యం లేకుండా కలిసి మెలిసి రాజకీయాలలో అటు అన్ని రంగాలలో కలిసిమెలిసి పోతున్న తరుణంలో ఇటువంటి వ్యాఖ్యలు చేసి పబ్లిసిటీ కోసం ఎవరైతే మనల్ని ఏమీ చేయలేరు అనేటువంటి ఆలోచనలో బ్రాహ్మణ జాతి వారిని టార్గెట్ చేస్తూ గత వారం ఆయన చేసినటువంటి వ్యాఖ్యలు వున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ దేశ సంస్కృతికి వెన్నెముకగా నిలిచిన వర్గాన్ని అకారణంగా దూషించడం అవివేకానికి పరాకాష్ట అన్నారు.రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుపెట్టుకొని ఒక సామాజిక వర్గంపై ద్వేషాన్ని నూరిపోస్తున్నటువంటి వ్యక్తులపై హేట్ స్పీచ్ చట్టాల కింద తక్షణమే పటిన చర్యలు తీసుకోవాలని తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. సామాజిక సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు విస్మరించకూడదని, తక్షణమే ఆ వ్యక్తి తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణులపై దాడులు ప్రభుత్వ వైఫల్యానికి నిరసన తెలియజేస్తున్నామన్నారు. మడకశిర ఎంపీడీవో పై దాడి, ఉరుకుందూరు ఈరన్నస్వామి క్షేత్రంలో ఉపప్రధాన అర్చకుడి ఆత్మహత్య, కాకినాడ తాళ్లరేవు (మం) చొల్లంగిపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుందర సీతారామయ్య శర్మ పూజారి పైన దాడి, బ్రాహ్మణ జాతిపై డబ్బులు పాటలతో అవమాన పరుస్తూ పల్లవులు రమణ అనే జెడి సారయ్య వ్యాఖ్యలు, శ్రీశైలంలో కరువైన నూతనం ప్రహరీ గోడ కూల్చివేత, విశాఖపట్నం లో 120 ఏళ్ల చరిత్ర, బేడమ్మ సత్రాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నం, భైరవకోన పూజారిపై కత్తితో దాడి, ఈ ఘటనలన్నిటినీ తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రాహ్మణ సమాజం పట్ల చూపిస్తున్న ఉదాసీనతను తాము ఎండ గడుతున్నామన్నారు. రాజకీయ పేరు ప్రఖ్యాతల కోసం బ్రాహ్మణ జాతిని అడ్డుపెట్టుకుని చేసే ఎటువంటి ప్రయత్నాలు ప్రజాస్వామికం కాదని,ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తుందా..? అనే ఆలోచిస్తే అవి క్షేత్రస్థాయిలో బాధితులకు పూర్తి రక్షణ గాని,న్యాయాన్ని గాని చేకూర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాహ్మణులకు రిజర్వేషన్ కల్పించాలని, బ్రాహ్మణులపై దాడులకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని, రాష్ట్రవ్యాప్తంగా అర్చకులకు దేవాలయ ఆస్తులను ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే మందకృష్ణ మాదిగ ఆయన మాటలు ఉపసంహరించుకోవాలని, మా మౌనాన్ని అసమర్థతగా భావించొద్దని, మా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరిగితే దానిని చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం మణికంఠ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటూరి విజయకుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెల్లంపల్లి వీర మణికంఠ స్వామి, మీడియా, జిల్లా అధికార ప్రతినిధి జూలకంటి ఇంద్రనీల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లాలో దారుణం

### ఆస్తికోసం అన్నను కడతేర్చిన తమ్ముడు



ఘర్షణలో మృతిచెందిన దైవభక్తుడు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండ లం ఆర్. కృష్ణాపురంలో ఆస్తి వివాదం హత్యకు దారితీసింది. ఎస్సీకాలనీకి చెందిన ఏసేబుకు ఐదుగురు కుమారులు. వారు ఆస్తి పంచుకునే విషయంలో కొంతకాలంగా తరచు గొడవపడు తూ ఉన్నారు. శనివారం రాత్రి కుటుంబంలో మరోసారి వాగ్వివాదం చోటుచేసుకుంది. మాటల తగాదా ఘర్షణగా మారంది. విజయరాజు ఆవేశంతో రోకలి బండతో అన్న దైవభక్తుడు (40)పై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన దైవభక్తుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో ఇద్దరు అన్నదమ్ములు కూడ గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డకు తరలించారు. నిందితుడు విజయరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## అమెరికాలో బొబ్బిలి యువకుడు మృతి



సాయిశ్రీ హరికృష్ణ

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామానికి చెందిన యువకుడు అమెరికాలో మృతి చెందాడు. ఉన్నత చదువుల నిమిత్తం రెండేళ్ల క్రితం సాయిశ్రీ హరికృష్ణ అమెరికాకు వెళ్లాడు. ఎంఎస్‌సి పూర్తైన తర్వాత అక్కడే రెండు నెలల కిందట ఎలిసెంట్ క్లీన్ టెక్నాలజీలో ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరాడు. నిన్న(శనివారం) తన పుట్టినరోజు సందర్భంగా ఓ రిసార్ట్‌లో వేడుకల తర్వాత నదిలో ఈతకు వెళ్లాడు. కానీ ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతిచెందినట్లు హరికృష్ణ తండ్రి తెలిపారు. కుమారుడి మరణవార్తతో కుటుంబసభ్యుల కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యువకుడు మృతి చెందడంతో ఒక్కసారిగా స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి సాయిశ్రీ హరికృష్ణ తండ్రి శ్రీనివాసరావు ఆటో డ్రైవర్, తల్లి రమ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తోంది. కుమారుడు ప్రయోజకుడు కావడంతో తమ కష్టలు తీరుతాయని భావించిన తల్లిదండ్రులకు ఊహించని పరిణామం ఎదురైంది. సాయిశ్రీ హరికృష్ణ అకాల మరణంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

## స్వస్థలానికి టెకీ రుషికేశ్ మృతదేహం

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: హరియాణాలో ఇటీవల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రుషికేశ్ హత్య జరిగిన విషయం తెలిసిందే. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం మొలకలపెంటకు టెకీ మృతదేహం చేరుకుంది. వ్యాపారం నిమిత్తం గుడివాడలో రుషికేశ్ కుటుంబం స్థిరపడింది. రుషికేశ్ మృతి సమాచారంతో కుటుంబం హుటాహుటిన హర్యానా వెళ్లింది. హర్యానా నుంచి తమ సొంతూరికి మృతదేహాన్ని తరలించారు. రుషికేష్ ఆత్మహత్య చేసుకునే అంతటి పిరికివాడు కాదని కుటుంబ సభ్యుల రోదించారు. ఈ ఘటన వెనుక ఏదో జరిగిందని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

## యాంకర్ విష్ణుప్రియపై పోలీసులకు ఫిర్యాదు

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రముఖ టివి యాంకర్ విష్ణుప్రియ భీమినేనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) నాయకులు పోలీసులను ఆశ్రయించారు. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో డబ్బుల కోసం అర్ధనగ్న వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ విజయవాడ సూర్యారావుపేట సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ మాట్లాడుతూ విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్‌లో అర్ధనగ్న వీడియోలు చూడాలంటే నగదు చెల్లించి సబ్ స్క్రైబ్ చేసుకోవాలని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంతోమందికి తెలిసిన ఒక సెలబ్రిటీ కేవలం డబ్బు కోసం ఇలాంటి అసభ్యకరమైన వీడియోలను ప్రోత్సహించడం సరికాదన్నారు. ఇది సమాజానికి, ముఖ్యంగా యువతకు తప్పుడు సందేశం పంపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే బ్లాక్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు తమ ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దీపక్, సిద్ధు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలుంటే విన్నవించండి

### నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి




తిరుపతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్‌ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ అధికారంలోకొస్తే దళితుని సిఎం చేస్తాం

- దేశ, రాష్ట్ర రాజకీయాలను శాసించబోతున్న మాల, మాదిగలు - మాజీ కేంద్ర మంత్రి చింతామోహాన్



మాలల ఆత్మీయ కలయికలో ప్రసంగిస్తున్న చింతామోహన్

చిత్తూరురూరల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: మాల, మాదిగలు కలిసి ప్రయాణం చేయాల్సిన సమయం ఆసన్నమైందని, దేశ, రాష్ట్ర రాజకీయాలను శాసించబోతున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ తెలిపారు. ఆదివారం చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో మాలల ఆత్మీయ కలయిక సభ ప్రముఖ దళిత నాయకులు పరదేశి ఆద్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో పుట్టిన చంద్రబాబునాయుడు దళితులను ఎబిసిడిలుగా విడదీసి పెద్ద పాపం చేసారని, పక్కనే వున్న తమిళనాడులో ఎటువంటి వర్గీకరణ జరగలేదని, ఏపిలో ఎస్సీలను బలహీనం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పూరితంగా దళిత వర్గీకరణకు పాల్పడిందన్నారు. 2029లో మాల, మాదిగలు దేశ రాష్ట్ర రాజకీయాలను శాసించబోతున్నారనీ, ఇందుకు ఓబిసిలు కూడా దళితులతో కలసి రావాలని, అప్పుడే రాజ్యాధికారం వస్తుందన్నారు. చిత్తూరు జిల్లాలో 99శాతం ఎస్సీలు 1000, 2000లేక తీవ్ర ఇబ్బందుకు పడుతున్నారని, జగన్, చంద్రబాబు ఇద్దరూ కలసి ఎస్సీ కార్పొరేషన్లు మూసేశారని, విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయక నరకం చూపిస్తున్నారన్నారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో ఎస్సీ విద్యార్థినులు కడుపు కూటి కోసం టాయిలెట్లు కడుగుతున్నారని, కూటమి ప్రభుత్వంలో ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ స్టేటస్ ఇప్పించే బాధ్యత నేను తీసుకుంటానని, 2029లో అధికారంలోకి రాగానే రాజ్యాంగ సవరణ చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తామన్నారు. రాయలసీమలో పుట్టిన జగన్, చంద్రబాబునాయుడు ఇద్దరూ పోటీలు పడి కోనసీమలో రాజధాని కావాలంటున్నారని, నేను తిరుపతి రాజధాని కావాలని అక్టోబరు 13, 2013లోనే అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు లేఖ రాయడం జరిగిందని గుర్తు చేసారు. పార్లమెంటులో ఎన్నో చట్టాలు చేయగా, విద్యాహక్కు చట్టం కూడా వచ్చిందని, ఆ చట్టం ఏమైందని ప్రశ్నించారు. అమరావతి చట్టం కూడా అలాంటిదేనని పేర్కొన్నారు. జగన్ మావిగన్, చంద్రబాబు అమరావతి సక్సెస్ కాదని, అమరావతి కాదు అది చంద్రావతి అని ఎద్దేవా చేసారు. చంద్రబాబునాయుడు ఒక్కరే అమరావతిని ఇష్టపడుతున్నారనీ, ఉత్తరాంధ్ర ప్రజలు అమరావతిని రాజధానిగా ఇష్టపడటం లేదన్నారు. చిత్తూరు జిల్లాలో ఒక ఎస్సీ ఎంపి, ముగ్గురు ఎస్సీ ఎమ్మెల్యేలు వున్నప్పటికీ క్యాబినెట్‌లో చోటు దక్కపోవడంపై మీ స్పందన ఏమిటని ప్రశ్నించగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోని రాగానే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామన్నారు. ఓబిసిలు సహకారం అందిస్తే రాజ్యాధికారం తప్పక సాధిస్తామని చింతామోహన్ తెలిపారు.

### మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు

# చరిత్రాత్మక నిర్ణయం

**● అన్ని రాష్ట్రాలు 33శాతం చట్టసభల్లో అమలుచేయాలి: బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి**



తిరుమల, ఏప్రిల్ 12 ప్రభాత వార్త ప్రతినిధి: మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం,ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక మని బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ఎన్‌డిఎ ప్రభుత్వం అమలుకు సిద్దమైందని, అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలకతీతంగా మద్దతు తెలిపి ముందుకు రావాలని కోరారు. గత నాలుగు దశబ్ధాలుగా మహిళలకు 33శాతం రిజర్వేషన్‌పై తర్జనభర్జనలు జరుగుతున్నా అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికీ 13శాతం అమలవుతున్న మహిళల రిజర్వేషన్ దేశంలో తొలిసారిగా 33శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం గర్వించదగిన విషయమన్నారు. ఈ బిల్లును ప్రతి రాష్ట్రం అసెంబ్లీలో అమలు చేసి, మహిళల కోటాను పెంచాలన్నారు. దేశంలోని కోట్లా మంది మహిళల ఆకాంక్షను ఈ బిల్లు నిదర్శనమన్నారు. దేశంలో హిందూ దేవాలయాలపై పనిగట్టుకుని చేస్తున్న ప్రచారం, కుట్ర ఎన్‌డిఎ ప్రభుత్వంలో సాగవన్నారు. దేవాలయాలను రాజకీయాలకు వాడుకోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం కలసి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తుండటం అభినంద నీయమ న్నారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన ఆయన విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు

**● బిల్లు ఆమోదం పొందేందుకు మద్దతుగా ఎన్‌డియే ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహణ ● బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వెల్లడి**

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: చట్లసభల్లో మహిళా బిల్లు ఆమోదం పొందేందుకు మద్దతుగా కూటమిలోని పార్టీల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వెల్లడించారు. ఆదివారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలతో ర్యాలీలు, సభలు నిర్వహిస్తామన్నారు. అలాగే వాల్ రైటింగ్, సిగ్నేచర్ క్యాంపులు, మిస్డ్ కాల్స్ ద్వారా ఈ బిల్లు ఆమోదం పొందేందుకు ప్రజల మద్దతు కూడగడతామని చెప్పారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చల్లో చట్ట సభల్లో మహిళ బిల్లు ఆమోదం పొందుతుందని మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేస్తామని ప్రకటించారు. 2029 నాటికి మహిళా బిల్లు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధిలో బిజెపిదీ కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయాలని భావించే మహిళలు బిజెపిలోకి రావాలని పిలుపునిచ్చారు. ఏ పార్టీ అయినా గెలుపు కోసం పనిచేస్తుందని, నాయకులు తయారు కావాల్సి ఉందన్నారు. 2029 నాటికి జన గణన, డీ లిమిటేషన్, మహిళా బిల్లు అన్నీ పూర్తవుతాయని ఎపి బిజెపి చీఫ్ ధీమా వ్యక్తం చేశారు. మొదటి నుంచీ మహిళలకు బిజెపి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సెప్టెంబర్ 23వ తేదీన మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. చట్టసభల్లో మహిళలు రెండు శాతం ఉండే పరిస్థితి నుంచి.. నేడు వంద మందిపైగా ఉన్నారని వివరించారు. దేవెగౌడ ఆధ్వర్యంలో మహిళా బిల్లు పెట్టినా సభలో ఆమోదం పొందలేదని పేర్కొన్నారు.



మహిళా బిల్లు లోక్‌సభలోకి రాకుండా నిలిపి వేసిందంటూ కాంగ్రెస్ పార్టీపై ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ నిప్పులు చెరిగారు. మోదీ సారథ్యంలో లోక్ సభ, రాజ్యసభల్లో మహిళా బిల్లుకు పూర్తి మద్దతు లభిస్తుందన్నారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ద్వారా ఈ బిల్లును సవరణ చేసుకుని పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురానున్నారని వివరించారు. మహిళలు, పురుషులు అన్ని రంగాల్లో సమానంగా రాణించాలనేదే బిజెపి అభిప్రాయమన్నారు.
ఈ బిల్లుకు అంతా పూర్తి మద్దతు ఇచ్చేలా ప్రధాని మోడీ చర్యలు తీసుకున్నారని చెప్పారు. సభను కాంగ్రెస్ పార్టీ బాయ్ కాట్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఉన్నా.. మహిళా బిల్లుకు పూర్తి స్థాయిలో ఆ పార్టీ ఆమోదం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. మోడీ నేతృత్వంలో నారీ శక్తి వందన్‌కు పూర్తి ఆమోదం వచ్చేలా చేశారని వివరించారు.
ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యలు సభ్య సమాజంతో పాటు ఎవరూ అంగీకరించరని పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఒక వర్గాన్ని పూర్తి స్థాయిలో నాశనం చేయాలనే ఉద్దేశంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. రాజకీయాల్లో ఇలాంటి నాయకులు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అత్యంత దిగజారుడు విధంగా మల్లికార్జున్ ఖర్గే తీరు ఉందంటూ మండిపడ్డారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం లభించిన సందర్భంగా దేశంలోని మహిళా లోకం తరఫున ప్రధాని మోడీకి ఎపి మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషితారాజు ధన్యవాదాలు తెలిపారు. చట్టసభల్లో మూడో వంతు మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామమన్నారు.
ఝాన్సీ లక్ష్మీభాయి, రాణీ రుద్రమదేవి వంటి ఎంతో మంది నారీ మణులను స్ఫూర్తిగా తీసుకుని ఈ రిజర్వేషన్ అమలు చేసుకుంటున్నామని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ముద్ర యోజన వంటి అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు.
స్టాండప్, స్టార్టప్ ఇండియాలో 84 శాతం మహిళలే ఉన్నారని నిషితా రాజ్ గుర్తు చేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లాంటి చాలా మందికి ప్రధాని మోదీ అవకాశాలు కల్పించారని వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మహిళలకు భద్రత కల్పించారని చెప్పారు. ఉజ్వల యోజన ద్వారా ప్రతి ఇంటికీ గ్యాస్ సిలిండర్ అందించారని వివరించారు. 2047 నాటికి వికసిత్ భారత్ నినాదంతో ప్రపంచంలో తొలి స్థానంలో భారత్ నిలబడేలా మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# దుర్గమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త: ఆదివారంనాడు ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, దర్శనం కోసం వేచి ఉండే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లలో మంచినీరు, చలువ పందిళ్లు మరియు ఇతర కనీస వసతులను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తులకు బిస్కట్‌పాకెట్లు, మంచినీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

**దాతలు ముందుకురావాలని ఇఓ పిలుపు:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ వేసవిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీకి దాతలు ముందుకు రావాలని ఇఓ వికె శీనా నాయక్ పిలుపునిచ్చారు. ఈ పుణ్యకార్యంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు రోజుకు కేవలం రూ.650లు చెల్లించి రశీదు పొంది ఈ పథకానికి విరాళం అందించవచ్చునన్నారు. వేసవి కాలం ముగిసే వరకు భక్తులకు ఎండ వేడి నుండి ఉపశమనం కలిగించేలా ఉచిత తాగునీరు మరియు మజ్జిగ పంపిణీ పథకాన్ని ఉగాది పర్వదినం నుండి భారీగా ప్రారంభించారు. ఆ క్రమంలోనే చంటి పిల్లలకు బిస్కెట్లు మరియు భక్తుల దాహార్తిని తీర్చడానికి ప్రతిరోజూ కొండపై ఉచిత తాగునీటి సదుపాయం కల్పించబడింది. ఈ మజ్జిగ రోజువారీ పంపిణీ జూన్ 15వ తేదీ వరకు ప్రతిరోజూ 2000 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ నిరంతరాయంగా జరుగుతుందని ఇఓ తెలిపారు. వారాంతాల్లో ప్రత్యేకంగా భక్తుల రద్దీని బట్టి శుక్ర, శని, ఆదివారాల్లో 5000 మజ్జిగ ప్యాకెట్లు లేదా అంతకంటే ఎక్కువ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. కావున ఈ పుణ్యకార్యంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు రోజుకు కేవలం రూ.650లు చెల్లించి రశీదు పొంది ఈ పథకానికి విరాళం అందించవచ్చు. దాతలు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి ఈ సేవా కార్యక్రమంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మొదటి అంతస్థులో కూడా అన్నప్రసాద వితరణ:** దుర్గమ్మవారి ఆలయంలో వేసవి కాలము భక్తులు అధిక తాకిడి సందర్భముగా మహా మండపము రెండవ అంతస్తు హాలు మరియు మొదటి అంతస్తు హాలు నందు కూడా భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఇఓ ఆదేశం మేరకు ఈ ఏర్పాటు చేశారు.



**ఇంద్రకీలాద్రిపై భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం ఉదయము లోక కల్యాణార్థం సమస్త జీవకోటి క్షేమం కోసం నిర్వహించిన సూర్యోపాసన సేవలో ఆలయ వేద పండితులు ముగ్గులతో యంత్ర ప్రతిష్టాపనగా ఆదిత్యుని ఆవాహన చేసి ఆదిత్యహృదయం అరుణ పారాయణ మహాసౌర పారాయణ సూర్య అష్టోత్తర శతనామావళితో ప్రత్యక్ష దైవం సూర్య భగవానునికి అంగన్యాస కరన్యాస పూర్వకంగా సూర్యనమస్కారములతో ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ సూర్యోపాసన వల్ల జ్యోతిష్య శాస్త్రం ప్రకారం తేజస్సుతో కూడిన ఆరోగ్యం మానసిక ప్రశాంతత లభిస్తాయని పండితులు భానువాసరం సూర్యునికి ప్రీతికరమైన రోజు కావడంతో సూర్యోపాసన సేవ నిర్వహించారు. సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సూర్యోపాసన ఇతర ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక వెబ్‌సైట్ 'డబ్లుడబ్లుడబ్లు. కనకదుర్గమ్మ. ఓఆర్‌జి' ద్వారా లేదా నేరుగా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.



**నిత్య అన్నదానమునకు విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మధిరకు చెందిన నల్గొండ సత్యనారాయణ కుటుంబీకులు జయలక్ష్మి వంశీకృష్ణ పేర్ల మీద రూ.1,28,166 విరాళముగా అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో ఎస్పైకి ఫిర్యాదు కాపీని అందజేస్తున్న సింగర్ మంగ్లీ

## ఆ ఆరోపణలతో నాకెలాంటి సంబంధం లేదు

### పంజాగుట్ట పిఎస్‌లో సింగర్ మంగ్లీ ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** మైక్రో ఫైనాన్స్ స్కాం కేసులో సింగర్ మంగ్లీ(సత్యవతి) ఆదివారం పంజాగుట్ట ఠాణాకు వచ్చారు. తనపై ఆరోపణలు చేసిన న్యాయవాది సుబ్బారావుపై ఫిర్యాదు చేశారు. తనను సుబ్బారావు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వని కారణంగా తనపై ఆరోపణలు చేస్తున్నాడని ఆరోపించింది. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బిగ్‌బాస్‌కు వెళ్లేందుకు ఫేమస్ కావాలని చూస్తున్నారని ఆరోపించారు. ఠాణా వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తన పేరుతో ఎవరెవరో డబ్బులు వసూలు చేస్తున్నారంటే అవన్నీ తనకు తెలియడానికి దేవతనా అంటూ ప్రశ్నించారు. తనకు విషయం తెలియగానే బాధితులకు న్యాయం చేయమని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాను కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, మూలాలను మరిచిపోనన్నారు. తనకు డబ్బు ముఖ్యం కాదని, డబ్బే ముఖ్యం అనుకుంటే 2023, 2024 ఎన్నికల్లో ప్రచారం చేస్తే కోట్లకు కోట్లు డబ్బులు ఇస్తామంటూ ఆఫర్ చేసినా తిరస్కరించానన్నారు. తనకు పాటలు పాడటమే తెలుసని, తనకు అదే ప్రపంచం అన్నారు. తనకు వ్యక్తిత్వం ముఖ్యమని, ఎవరినో చూపిస్తూ తన తమ్ముడని ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారంలో తనకు పాత్ర ఉన్నట్లు తేలితే దేనికైనా సిద్ధమని, ఒకవేళ లేకుంటే సుబ్బారావును ఏం చేస్తారని మీడియాను ప్రశ్నించారు. మైక్రో ఫైనాన్స్ బాధితుల తరుపున పోరాడతనన్నారు. ఈ సందర్భంగా ఆమె కంటతడి పెట్టుకున్నారు. సోషల్ మీడియా తనకు శాపంగా మారుతుందని ఏనాడు అనుకోలేదన్నారు. నిజాలు తెలుసుకోకుండా నిందించడం తనను బాధించిందన్నారు.

# ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తే వదిలిపెట్టేది లేదు

### చైనాకు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా చేయడాన్ని వెంటనే ఆపకపోతే, భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మా శత్రువులకు మీరు ఆయుధాలు ఇస్తే, మేం మిమ్మల్ని వదిలిపెట్టబోం అని ట్రంప్ ఘాటుగా హెచ్చరించారు. హార్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాను అడ్డుకోవాలన్న ఇరాన్ ప్రయత్నాలకు సహకరించే దేశాలపైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన సంకేతాలిచ్చారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగించే చైనా కంపెనీలపై ఆర్థిక ఆంక్షలు విధించడంతో పాటు, అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి బహిష్కరిస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు. కాల్పుల విరమణ అమలులో ఉన్న సమయంలో ఇరాన్ కు చైనా సైనిక సహకారం అందించడం తమ బలగాలకు ముప్పుగా పరిణమించనుందని అమెరికా భావిస్తోంది. ట్రంప్ ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించింది. తమపై నిరాధార నిందలు వేస్తున్నారని పేర్కొంది. ఈమేరకు అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో పశ్చిమాసియా సంక్షోభంలో పాల్గొన్న ఏ దేశానికీ తాము ఎలాంటి ఆయుధాలు సరఫరా చేయలేదని వివరించింది. సెన్సేషనలిజం కోసమే కొన్ని మీడియా సంస్థలు తమపై నిరాధార ఆరోపణలతో కథనాలు ప్రసారం చేస్తున్నాయని విమ ర్శించింది. అయితే చైనా నుంచి ఆయు ధాలు అందినట్లు ఇరాన్ బహిరంగంగా వెల్లడించింది. కానీ, తాము అమెరికా విమానాలను విజయవంతంగా కూల్చ డానికి చైనా ఆయుధాలను వాడలేదని, తమ అధునాతన రక్షణ వ్యవస్థలే యూఎస్ విమానాలను కూల్చడానికి ఉపయోగపడ్డాయని ఐఆర్‌జీసీ వెల్లడించింది. భుజం మీద పెట్టుకొని ప్రయోగించే షార్ట్ రేంజ్ మిస్సైల్ లాంచర్‌లను, ఇతర క్షిపణి వ్యవస్థలను సరఫరాచేస్తున్నదని, వారం రోజుల్లో అవి టెహ్రాన్‌కు చేరే అవకాశం ఉందని అమెరికా పత్రికలు గగ్గోలు పెట్టాయి.



# ఒంటరి వ్యక్తులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల కొత్త మోసం

**యాప్‌లు ఇన్‌స్టాల్ చేయిస్తూ, ఫొటోలు సేకరించి, అశ్లీలంగా మార్చి దోచుకుంటున్న వైనం**

**అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్‌క్రైం పోలీసులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల కొత్త మోసాలకు ఓవైపు ఒంటరి వ్యక్తులు నిలువునా మోసపోతుండగా మరోవైపు ఈ తరహా కేసుల విచారణ పోలీసులకు సవాల్‌గా మారుతు న్నాయి. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కొత్త సైబర్ మోసాల వల్ల వేలాది మంది కోట్లాది రూపాయ ల నగదును పోగొట్టుకుంటుండగా ఇందులో కొందరు పరువు పోతుందనే కారణంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. ఈ తరహా నేరాలపై అం దరు అప్రమత్తంగా వుండాలని సైబర్ క్రైం పోలీసులు కోరుతున్నారు. ఎలాంటి వ్యక్తులు లేదా యాప్‌లపై అనుమానం వున్నా వెంటనే 1930 లేదా సమీప పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని వారు చెబుతున్నారు.

మారిన పరిస్థితుల కారణంగా దేశంలో కోట్లాది మంది ఒంటరి జీవితం గడుపుతుండడం తెలిసిందే. ఇందులో పురుషులతో పాటు మహిళలు వు ండగా వీరిలో వివాహం అయిన వారు కాని వారు, వివాహ బంధం విచ్చినమైన వారు, మోసపోయిన వారు ఇలా అనేకరకాల వారు వుండం విది తమే. వీరిలో చాలా మంది కుటుంబ సభ్యులతో వుంటుండగా మరికొందరు కుటుంబాలతో వుండలేక హాస్టళ్లలో లేదా మరోచోట వుంటున్నారు. ఆధునిక జీవనశైలిలో ఇలా ఒంటరిగా వున్న వారు సంపాదనపరంగా బాగానే వున్నా తాము ఏకాకులమన్న బాధ మాత్రం వారిని నిత్యం వెంటాడుతూ నే వుంటుంది. సరిగ్గా ఇలాంటి వారిని వెతికి పట్టుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. సోషల్ మీడియాలో ఒంటరి వారి కోసం స్పెషల్ అంటూ పోస్టు లు పెడుతూ మీ కష్టాలను తీరుస్తాం..కన్నీళ్లను తుడు స్తాం...ఆపదలో వుంటే ఆదుకుంటాం.. అంటూ పోస్టులు పెడుతున్నారు. మీకు ఇష్టమైతే మాతో మాటలు కలపండి అంటూ మొదట వాట్సాప్ మెసేజ్‌లతో మాటలు కలుపుతారు. ఆ తరువాత చాటింగ్‌లకు దిగి ఆనక నేరుగా ఫోన్‌లో సంభాషణలు చేస్తూ తమతో నిత్యం మాట్లాడాలనుకుంటూ తాము పంపే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని కోరుతున్నారు. ఇక్కడి నుంచి సైబర్ నేరగాళ్ల మోసాలు మొదలవుతాయి. పురుషులయితే మహిళలు, మహిళలయితే పురుషులు మాటలు కలుపుతారు. ఒంటరి వయోధిక పురుషులు లేదా మధ్య వయస్సు వారు మహిళలు లేదా పురుషులతోనూ ఎదుటివారికి ఇష్టమైన రీతిలో మాటలు కలుపుతారు. ఆనక వీరిచేత కూడా యాప్‌లను ఇన్‌స్టాల్ చేయించి ఎదుటివారి ఫోన్‌లలో వున్న సమాచారం అంతా లాగేసుకుంటారు. దీని తరువాత సైబర్ నేరగాళ్లు తమతో ఫోన్‌లో మాట్లాడే వారిని నగ్నంగా లేదా అర్ధనగ్నంగా వీడియో కాల్స్‌తో మాట్లాడాలని కోరుతారు. ఇందులో ఎవరైనా టెంప్ట్ అయి నేరగాళ్లు చెప్పినట్లు చేస్తే అంతే సంగతులు. ఈ ఫొటోలను మరింత మార్ఫింగ్ చేసి వారి ఫోన్ కాల్ లిస్టులో వున్న వారికి వీటిని పంపుతామని బెదిరిస్తూ అందినంత వసూలు చేస్తున్నారు. నగ్నంగా మాట్లాడేందుకు ఇష్టపడని వారికి అశ్లీల వీడియోలు పంపుతూ వీటిని వీడియో రికార్డింగ్ చేసి ఆ తరువాత వారిని బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక రకంగా హనీ ట్రాప్ తరహాలో సాగే ఈ సైబర్ నేరం గురించి బాధితులు తెలుసుకునే లోపు బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. కొన్ని ఘటనల్లో బాధితులు ఇళ్లు ఆస్తులు అమ్ముకున్న ఉదంతాలు వున్నట్లు సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు.

**యాప్‌ల జోలికి వెళ్లవద్దు: సైబర్‌క్రైం పోలీసులు**

ఇదిలా ఉండగా ఒంటరి వారికి సహాయంగా వుంటామని చెబుతూ సోషల్ మీడియాలో వచ్చే యాప్‌ల జోలికి వెళ్లవద్దని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఈ తరహా యాప్‌లన్నీ గోల్‌మాల్‌కు కేరాఫ్‌గా వున్నాయని సైబర్ క్రైం పోలీసులు అంటున్నారు, ఈ తరహా యాప్‌లను క్లిక్ చేయవద్దని, ఒకవేళ ఫోన్‌లు లేదా మెసేజ్‌ల ద్వారా ఎవరైనా బలవంతం చేస్తే వెంటనే 1930 లేదా సమీప పోలీసు స్టేషన్లకు ఫిర్యాదు చేయాలని వారు కోరుతున్నారు.

# ఇంటర్ ఫలితాలు.. నలుగురు విద్యార్థుల ఆత్మహత్య

**ఫెయిల్ అయినందుకు ఇద్దరు..**

**ఫెయిల్ అవుతానని మరొకరు సూసైడ్**

**తెలంగాణలో విషాద ఘటనలు**

**ఆత్మహత్యలొద్దని అధికారులు సూచన**

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల మూలంగా నలుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంటర్‌లో ఫెయిలైనందుకు ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోగా.. మరొక విద్యార్థి ఫలితాలు వెలువడకముందే ఫెయిల్ అవుతాననే భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఉట్నూర్ మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లికి చెందిన జిల్లపెల్లి బక్కన్న, బుచ్చవ్వ దంపతుల కుమార్తె సౌజన్య(17) ఉట్నూర్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆదివారం ఇంటర్ పరీక్షల ఫలితాల విడుదల కాగా ఆ ఫలితాలలో ఫెయిల్ అవ్వడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకి పాల్ప డింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సౌజన్యను ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఆస్పత్రికి చేరుకునేలోపే మృతి చెందినట్లు తెలిపారు.
ఇంటర్మీడియట్ ఫెయిల్ అయ్యానన్న బాధతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో జరిగింది. జక్కుల శ్రావణి (16) భూత్పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివి పరీక్షలు రాసింది. ఆదివారం విడుదలైన ఫలితాలలో శ్రావణి ఫెయిల్ అయింది. దీంతో మానసిక వేదన చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండు రోజుల క్రితమే విద్యార్థి ఆత్మహత్య.. ఇంటర్ ఫలితాల వేళ ఖమ్మం జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. బోనకల్ మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గంగదేవుళ్ల అక్షాంత్ ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాశాడు. పరీక్షలు సరిగ్గా రాయలేదని బాధపడుతూ రెండు రోజుల కింద మధిరలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆదివారం ఇంటర్ బోర్డు విడుదల చేసిన ఫలితాలను చెక్ చేయగా అతను అన్ని సబ్జెక్టులు పాస్ కావడం గమనార్హం.
అక్షాంత్‌కు ఇంగ్లీష్‌లో 67, సంస్కృతంలో 60, మ్యాథ్స్ 1ఏలో 40, మ్యాథ్స్ 1బిలో 58, ఫిజిక్స్‌లో 49, కెమిస్ట్రీలో 54, ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో 19 మార్కులు వచ్చాయి. మొత్తంగా ఫస్టియర్‌లో 470 మార్కులకుగానూ 347 మార్కులు సాధించిన ఉత్తీర్ణుడయ్యాడు. కానీ ఫలితాలు రాకముందే, ఫెయిల్ అవుతాననే భయంతో అక్షాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

# సాతే పోరాట స్ఫూర్తితో సామాజిక న్యాయానికి ఉద్యమిద్దాం



## ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** జానపద కవి, సంఘసంస్కర్త అన్నాభావుసాతే దళిత సాహిత్యవ్యవస్థాక పితామహుడని, ఆయన దళితోద్ధరణకు తన పదునైన అక్షరాలను ప్రయోగించి అందరిని ఆలోచింపచేశాడని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్ కాలనీ చౌర స్తాలో ఆదివారం డాక్టర్ అన్నాభావు సాతే విగ్రహా విష్క రణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్య క్రమంలో మంత్రి మాట్లాడుతూ సామాజిక విప్లవకారుల స్ఫూర్తిని కొనసాగిద్దామనీ అన్నారు. సాంగ్లీ జిల్లాలోని వాటేగావ్ గ్రామంలో పుట్టిన అతను నాల్గవ తరగతివరకే చదివినాడని ఆయన ఎంతటి లక్ష్యమైనా సాధించే గొప్ప వ్యక్తి అని కొనియాడారు. 1931 లో కరువుకారణంగా జీవనోపాధికి సతారా నుంచి ముంబాయికి కాలి నడకన ఆరునెలలు ప్రయాణంచేసిన గొప్ప లక్ష్యసాధకుడని వివరించారు. సాతే విగ్రహం మనకు నిరంతరం పోరాట పటిమను గుర్తుచేస్తుంది. ముఖ్యంగా మాదిగ సామాజిక వర్గం నుంచి గెలుపొందిన సర్పంచులు, కౌన్సిలర్లు తమ ప్రాంత అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలి. దళిత సమాజం ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన సామాజిక మార్పు సాధ్యమని చెప్పారు.

నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు మన ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందేలా చూడటమే మన లక్ష్యమన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించుకోవడం మన బాధ్యత.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బహుజన పక్షపాతిగానే ఉంటుందని అన్నారు. ఇవాళ ఇక్కడ ఇంతమంది మాదిగ ప్రజాప్రతినిధులను సన్మానించుకోవడం గర్వకారణమని తెలిపారు. రాజకీయాల్లో ఎదిగిన మాదిగ సోదరులు తమ అధికారాన్ని పేదల సంక్షేమం కోసం ఉపయోగించాలి.బలహీన వర్గాల సాధికారత కోసమే ఇవాళ కులగణన వంటి కీలక నిర్ణయాలను మనం ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ డాక్టర్ అన్నా బహు సాతే, కేవలం ఒక వర్గానికి చెందిన వారు కాదు, ఆయన అణగారిన వర్గాల గొంతుక అని వర్ణించారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయం జరగాలన్నదే మన ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధిలో మాదిగ సోదరుల పాత్ర మరువలేనిదని, ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ప్రతినిధులే కీలకమనీ.ప్రభుత్వం ఎప్పుడూ మీ వెంటే ఉంటుందనీ తెలిపారు. సన్మానం పొందిన ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో, వార్డుల్లో అంబేద్కర్, సాతే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనీ కోరారు. అనంతరం జిల్లాలోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు కౌన్సిలర్లను కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు



ఆదివారం హైదరాబాద్‌లో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలేను సత్కరిస్తున్న ఆర్‌పిఎఫ్, మహాత్మాజ్యోతిరావుఫూలే అభిమానులు

# సామాజిక సమానత్వానికి మహాత్మా ఫూలే మార్గమే శరణ్యం

## కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** సమాజంలో సామాజిక సమానత్వమే లక్ష్యంగా మహాత్మా జ్యోతిరావు ఫూలే చూపిన మార్గమే ఆవశ్య కమని కేంద్రమంత్రి రిపబ్లిక్ పార్టీఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రామ్ దాస్ అథవాలే అన్నారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) మహాత్మా జ్యోతిరావుఫూలే 200 జయంతి వేడుకలను నిర్వహించారు. రిపబ్లిక్‌పార్టీ ఆఫ్‌ఇండియా నాయకులు రాజేశ్ కంబాలే నేతృత్వంలో భీమ్‌రాజ్ సేవాసంఘాన్ని ఆయన అభినందించారు. కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం సంఘటితంగా పోరాడాల్సి న సమయం ఆసన్నమైందన్నారు. సమాజం లోని బడుగు, బలహీన, అట్టడుగు వర్గాలకు సముచిత న్యాయం జరగా లంటే మహాత్మాజ్యోతిరావుఫూలే మార్గమే శరణ్యమన్నారు. భీమ్ రాజ్‌సేవ వ్యవస్థాపక అధ్యక్షుల చైతన్యవంతమైన న్యాయకత్వంలో మాల మహానాడు నాయకత్వంలో కలికట్టుగా నడుం బిగించాలని సూచించారు. అవిశ్రాంత కృషితో సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక పురోగతికోసం నిరుపేదలకు బలమైన సందేశం ఇచ్చేదిశగా ప్రతిఒక్క భీరాజ్‌సేవ కార్యకర్తలు సన్నంద్ధం కావాలని సూచించారు. అవిశ్రాంతకృషికి దృఢనిబద్ధతతో సభ విజయవంతం కావడం అభినందనీయమన్నారు. యువత, సామాజిక కార్యకర్తలు, కమ్యూనిటీ నాయకులు, ఉత్సాహంగా పాల్గొనడంద్వారా ఉత్తమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. మహాత్మా జ్యోతిరావుఫూలే వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని సాధికారిత, సామా జిక పరివర్తనదిశగా సమాజిక సంకల్పాన్ని కూడా బలపరిచేదిశగా ముందడుగు వేస్తుందన్నారు.

# అంబేద్కర్ ఆశయాలకనుగుణంగానే రేవంత్ సర్కారు పాలన

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం.. ఈ మూడు సూత్రాల ఆధారంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశ యాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో నెరవేరుస్తోందని రాష్ట్ర షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధిశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ నెల 14న అంబేద్కర్ 135వ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అంబే ద్కర్ వాదులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యో గులు యువత పెద్ద సంఖ్యలో ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చినివాళులు అర్పించనున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు వరించారు. ఈ మేరకు ఈ నెల 14న నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం, పరిసర ప్రాంతాలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సమాన అవకాశాల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం, ఆ శాఖ ఎడి అధికారులు సి. శ్రీధర్, విసి హనుమంత్‌నాయక్, జెడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో తెలంగాణ పారిశ్రామికవేత్తలకు అవకాశం ఇవ్వండి : మాజీ ఎంపి విహెచ్

**హైదరబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తెలంగాణ పారిశ్రామికవేత్తలకు, వ్యాపారస్తులకు కొత్త కంపెనీల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు పేర్కొన్నారు. సిద్ది పేట జిల్లాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ప్రైవేటు కంపెనీ ప్రారంభోత్స వంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై తెలుగు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలలో పరస్పర సహకరాం ఉండాలని మాజీ ఎంపి ప్రతిపాదన చేశారు. తెలంగాణలో కొత్త కంపెనీల ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పారిశ్రామికవేత్తలకు వ్యక్తులకు ప్రాముఖ్యత ఇస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్ తెలిపారు. తెలంగాణ తరహాలోనే ఇచ్చిపుచ్చుకొనే సూత్రం ఆంధ్రప్రభుత్వం కూడా పాటించాలని ఆయన సూచించారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు ఆంధ్ర, రాయల సీమ వారికి తగిన అవకాశాలు కల్పిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కంపెనీల ఏర్పాటు విషయంలో తెలంగాణ వారికి కూడా సమాన అవకాశాలు కల్పించాలని అపుడే రెండు రాష్ట్రా మధ్య పెట్టుబడులు ఉపాధి విషయంలో సమతుల్యత ఏర్పడు తోందని, యువతకు మేలు జరుగుతోందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ తరహాలోనే అమరావతి కూడా అభివృద్ధి చెందాలని కోరుకుంటేనే అక్కడ తెలంగాణ పెటుటబడి దారులకు నిపుణులకు తలుపులు తీయాలని డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కెటిఆర్ నీలాపనిందలు తగదు

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**హైదరబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** కెటిఆర్ ఏదో మాట్లాడే ప్రయత్నంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నీలాప నిందలు వేయడం ఖండిస్తున్నట్లు భువనగిరి ఎంపి చామల కిరణ్ కమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎప్పటికీ మేమే అధికారంలో ఉంటామన్న కెసిఆర్, కెటిఆర్ భ్రమలు తొలిగిపోయి బిఆర్ఎస్ వరుసగా ఎన్నికల్లో ఓడిపోతుం డటంతో కెటిఆర్ మతిస్థిమితం కోల్పోయారని ఎద్దేవా చేశారు. ఇబ్రహీంపట్నంలో మున్సిపాలిటీ గెలవగానే కెటిఆర్ తొడలు కొడుతున్నారని అన్నారు. తెలంగాణ 16 వేల కోట్ల మిగులు రాష్ట్రంగా ఏర్పాటైతే బిఆర్ఎస్ పాలనలో 8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆయన చెప్పారు. పదేళ్ల ఫామ్‌హౌస్ పరిపాలన చేశారనీ ఒక్కరోజు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవలేదనీ నిజాం నవాబుల్లా పాలించారని దుయ్యబట్టారు. మూసీ రివర్ బోర్డుకు కెటిఆర్ ఎప్పుడూ ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డిపిఆర్ రెడీ చేసి మూసీ పనులు మొదలుపెట్టామని వివరించారు.

# ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు రూ.21 వేల కోట్లు

## ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ రూ.4 వేల కోట్ల రుణం

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఎస్టీ, ఎస్సీ, బిసి, మైనారిటీ వర్గాలకు ఆధునిక సౌకర్యాలు, క్రీడా సౌకర్యాలు, పోటీ పరీక్షల కోచింగ్‌తో ఉచిత, సమగ్ర విద్యను (4 నుండి 12 తరగతులు) అందించడం, స్మార్ట్ మౌలిక సదుపాయాలు, స్థిరత్వం, సామాజిక సమానత్వంపై ప్రభుత్వం చొరవ తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కార్పొరేట్ స్థాయి, సమ్మిళిత విద్యను స్థాపించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు (వైఐఆర్ఎస్) పేరుతో గురుకులాలను నిర్మిస్తుంది. కార్పొరేట్ స్థాయి విద్యను ఒకే గొడుగు క్రింద అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీలు, ప్రత్యేక క్రీడా మైదానాలు (క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్) వంటి ఆధునిక, సమగ్ర సౌకర్యాలు కల్పించనుంది. ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చుకునే పనిలో నిమగ్నమైంది. ఈ నేపథ్యం అంతర్జాతీయ ఆర్థిక సంస్థ అయిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) వద్ద రుణం తీసుకునేందుకు నిర్ణయించింది. రాష్ట్రంలో 79 గురుకులాలను నిర్మించాలని నిర్ణయించింది. వీటిలో తొలి విడతగా 3, రెండో విడతలో 11, మూడో విడతలో 64 నిర్మించాలని భావిస్తున్నది. ప్రస్తుతం తొలివిడతలో చేపట్టిన స్కూళ్లు పురోగతిలో ఉన్నాయి. ఇందు కోసం 8 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంచనా వేయగా, అందులో 5 వేల కోట్ల రూపాయల మేర రుణం కోసం ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు దరఖాస్తు సమర్పించింది. ప్రస్తుతం అందులో రూ.4 వేల కోట్లు మాత్రమే ఇచ్చేందుకు ఆసియా బ్యాంకు ఆమోదం తెలిపినట్లు తెలియవచ్చింది.

# ప్రజలకు మరింత చేరువగా పోలీస్ వ్యవస్థ

## రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతిపౌరుడి బాధ్యత

## మంచిర్యాల, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో డిజిపి పర్యటన



కన్నెపల్లి నూతన పోలీస్‌స్టేషన్‌ను అధికార ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి

**మంచిర్యాల/ కుమరం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** ప్రజలకు మరింత చేరువగా పోలీస్ వ్యవస్థను తీసుకెళ్లే దిశగా రాష్ట్ర పోలీసు శాఖ కీలక చర్యలు చేపట్టింది. డిజిపి శివధర్‌రెడ్డి పర్యటనలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమా లను ప్రారంభించారు. మంచిర్యాల జిల్లాలోని కన్నెపల్లి మండలంలో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని డీజీపీ శివధర్ రెడ్డి, కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, తదితర ఉన్నత అధికాం ప్రజా ప్రతి నిధులతో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందిం చడమే పోలీసుల లక్ష్యమని తెలిపారు. ఆధునిక సాంకేతిక విని యోగంతో భద్రతను మరింత బలోపేతం చేస్తా మని స్పష్టం చేశారు. ఈ భవనం ద్వారా పోలీసు వ్యవస్థ మరింత సమర్థవంతం అవుతుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సంకేతం ఇచ్చారు. అనంతరం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెనలో పాత పోలీస్ స్టేషన్ ను పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం ఆధునిక గ్రంథాలయంగా మార్పు చేశారు. ఈ గ్రంథాలయాన్ని డీజీపీ ప్రారంభిం చారు. గ్రామీణ యువతకు మెరుగైన చదువు వాతావరణం కల్పించడం, పోటీ పరీక్షల్లో విజ యాన్ని సాధించేందుకు అవసరమైన పుస్తకాలు, సాధన మెటీరియల్ అందించడమే లక్ష్యమని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు ప్రస్తుత వ్యవహారాలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన గ్రంథాలు అందుబాటులో ఉంచారు. ప్రశాంత వాతావరణంలో చదువుకు నేందుకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఆసిఫాబాద్ పట్టణంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు హెల్మెట్ చౌక్ ను ఏర్పాటు చేశారు. భారీ హెల్మెట్ ఆకార రూపంతో నిర్మించిన చౌక్‌ను డీజీపీ శివధర్‌రెడ్డి ప్రారం భించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలనే సందేశాన్ని ప్రజల్లో బలంగా చాటేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. హెల్మెట్ వినియోగం ప్రాణ రక్షణలో కీలకమని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచిం చారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొం దించేందుకు ఈ హెల్మెట్ చౌక్ ఒక ప్రతీకగా నిలు స్తుందని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా, ఎస్పీ నితికా పంత్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఎసీపీ కిరణ్‌కుమార్, సిఐలు, ఎస్సైలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో అడుగంటుతున్న భూగర్భజలాలు

## నీటిని పొదుపుగా వాడుకోవాలి


## ట్యాంకర్ బుకింగ్, డెలివరీపై జలమండలి ఎండి సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** నగరంలో భూగర్భజలాలు రోజురోజుకు అడు గంటుతు న్నాయి. ఇప్పటికే ట్యాంకర్ల డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం పరిస్థితులలో నీటిని పొదుపు చేసుకోకపోతే నగర వాసులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రస్తుత పరిస్థితులలో నీటిని పొదు పుగా వాడుకోవాల్సిన పరిస్థితులు నెల కొన్నాయి. ప్రతి ఒక్కరు 20శాతం నీటిని పొదుపు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవి అధికా రులు పేర్కొంటున్నారు. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్ర తలు, నగర పరిధిలో భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో తాగునీటి డిమాండ్ నీటి విని యోగంపై ప్రతి పౌరుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నీటి అవసరాలు గణనీయంగా పెరుగుతు న్నందున, నీటిని వృధా చేయకుండా నీటి పొదుపు చర్యలను కచ్చితంగా పాటించడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. వేసవి కార్యాచరణ, ట్యాంకర్ మేనేజ్ మెంట్ పై ఎండి అశోక్ రెడ్డి జలమండలి జేఎండి మయాంక్ మిట్టల్‌తో కలిసి రీజినల్ ఈడిలు,డైరెక్టర్లలు, సిజిఎంలు, జీఎంలతో జూమ్ మీటింగ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లా డుతూ.. క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా, ట్యాంకర్ బుకింగ్స్, డెలివరీ టైమ్ తదితర వివరాల్ని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు.ఈ వేసవిలో గత యేడాది కంటే ఓవరాల్‌గా ట్యాంకర్ బుకింగ్ ఘననీయంగా పెరగకపోయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లోని ఫిల్లింగ్ స్టేషన్‌లలో గత ఏడాదికంటే బుకింగ్ పెరిగిందని చెప్పారు. గత ఏడాది కంటే మణికొండ, బంజారాహిల్స్, డోయెన్స్, హాఫీజ్ పేట్, నేతాజీ పార్క్ ఫిల్లింగ్ స్టేషన్లో బుకింగ్స్ పెరిగినట్టు వెల్లడించారు. ఫిల్లింగ్ స్టేషన్లో నీటి సరఫరా సరఫరాలను, సరఫరా సమయాన్ని పెంచడం, డిమాండ్ తక్కువ ట్యాంకర్ బుకింగ్ నమోదు అవుతున్న ఫిల్లింగ్ స్టేషన్ నుంచి అధికంగా డిమాండ్‌ని డెలివరీ చేసేలాగా ప్రత్యేక ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. రాత్రి వేళల్లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడంతో పెండెన్సీ బాగా తగ్గించుకున్నామని తెలిపారు. అవసరమైతే నైట్ షిఫ్ట్‌లో పనిచేసే వారికి ప్రత్యేక అలవెన్స్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే రోజులలో నీటి డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, ప్రతి పౌరుడు నీటిని బాధ్యతా యుతంగా వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రతి కుటుంబం కనీసం 20 శాతం వరకు నీటిని ఆదా చేయాలని సూచించారు. చిన్నచిన్న అలవాట్ల మార్పులతోనే పెద్ద మొత్తంలో నీటిని సంరక్షించవచ్చని ఆయన పేర్కొన్నారు. పౌరులకు ముఖ్య సూచనలు చేశారు. విలువైన తాగునీటిని వాహనాల శుభ్రపరిచేందుకు, ఇళ్ల పరిసరాలను కడగడానికి ఉపయోగించవద్దని, బ్రష్ చేసేటప్పుడు నల్లా (ట్యాప్) నిరంతరం తెరిచి ఉంచకుండా, మగ్గులో నీరు తీసుకుని వినియోగించాలని, స్నానం చేసేటప్పుడు షవర్ వినియోగాన్ని తగ్గించి, బకెట్ నీటితో స్నానం చేయడం ద్వారా గణనీయంగా నీటిని ఆదా చేయవచ్చునని, లీకేజీలు ఉన్న పైపులు, ట్యాపులు వెంటనే మరమ్మతులు చేయిం చుకోవాలని, అవసరానికి మించి నీటిని నిల్వ చేయడం, వృథాను నివారించాలన్నారు.వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్యలు చేపడు తోందని ఎండి తెలిపారు.వేసవిలో తాగునీటి సమ స్యలను అధిగమించేందుకు ప్రతి పౌరుడు నీటిని వృధా చేయకుండా నీటి పొదుపు చర్యలను పాట స్తూ జలమండలికి సహకరించాలని కోరారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకుంటే కొత్తగూడెం ముట్టడిస్తాం

## కెసిఆర్ హయాంలో 16 వేల మందికి కారుణ్య నియామకాలు

## కత్తి వారి చేతికిచ్చి మమ్మల్ని పోరాడమంటే ఎలా? : కెటిఆర్



మంచిర్యాలలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**నస్పూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాం గ్రెస్ ప్రభుత్వం హయాంలో అరాచక రాజకీయం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావే శానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించినప్పటికీ, మంత్రి వివేక్ అహం దెబ్బతిని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. వెయ్యి మంది పోలీసులతో కవాతు నిర్వహిస్తూ కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేయడం ఇందిరమ్మ ఎమర్జెన్సీ కాలాన్ని తలపిస్తోందని మండిపడ్డారు. కోట్లాది రూపాయల ఆశ చూ పినా, ఇళ్లు కూలగొడతామని బెదిరించినా బీఆర్ఎస్ కౌన్సిలర్లు లొంగకుండా ప్రజాస్వా మ్యాన్ని గెలిపించారని కేటీఆర్ కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అడ్డు తొలగించు కోవడానికే అక్రమంగా కేసులు పెట్టి 16 రోజులు జైల్లో ఉంచారని ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థలో కాంట్రాక్టులన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డి కనుసన్నల్లోనే నడుస్తున్నా యని ఆరోపిం చారు. కేసీఆర్ హయాంలో 16 వేల మందికి కారుణ్య నియామకాలు కల్పిం చామని గుర్తు చేశారు. ప్రస్తుతం మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే బోర్డు ఏర్పాటు చేసి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిం చారు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తం కాస్త 'భస్మా సుర హస్తం'గా మారిం దని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థాయికి తగని భాష వాడుతున్నారని విమర్శించారు. అమృత్ పథకం కాంట్రాక్టులు కూడా సృజన్‌రెడ్డికే దక్కా యని, కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు చీకటి దోస్తు లని ఆరోపించారు. రాష్ట్రంలో 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్లు జరుగు తున్నాయని ప్రధాని మోదీ, అమిత్‌షా అంటు న్నారే తప్ప ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు, రైతులు, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నా, ప్రజాస్వామ్యం పరిఢ విల్లాలన్నా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని, 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే టీబీజీకేఎస్‌ను గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. మంచిర్యాలలో బీఆర్ఎస్ హయాంలోనే 38 ఎకరాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి దాచుకో, దోచుకో అన్న పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నడిపిస్తున్నారని అన్నారు. కెటిఆర్ ప్రసంగి స్తుం డగా, సభలో ఉన్న పలువురు సింగరేణి కార్మికుల వారసులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ కత్తిని కాంగ్రెస్ పార్టీ చేతిలో పెట్టి, మమ్మల్ని యుద్ధం చేయమంటే ఎలా? అని ప్రశ్నించారు.

# రాష్ట్రంలో రూ.6.50 కోట్లతో అథ్లెటిక్ ట్రాక్

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** తెలంగాణలో అత్యాధునికి స్పోర్ట్స్ ట్రాక్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు కేంద్రం చేపట్టింది. రాష్ట్రంలోని జమ్మికుంటలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ అభివృద్ధికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి పాలనాపరమైన అనుమతులను సైతం ఇప్పటికే ఇచ్చినట్లు రాష్ట్ర స్పోట్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ ట్రాక్ ఏర్పాటు నిమిత్తం రూ.6.50 కోట్ల మంజూరు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో అనుమతిస్తూ అ శాఖ అండర్ సెక్రటరీ చంచల్ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సింథటిక్ ట్రాక్ ను నిర్మించి సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అత్యాధునిక అథ్లెటిక్ ట్రాక్స్ ఏర్పాటుకు సంబంధించి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తన ఆమోదం కూడా తెలిపింది. కాగా జమ్మికుంటలో స్టేడియాన్ని నిర్మిస్తామని కేంద్రం ఇటీవల కాలంలో ప్రకటించింది.

# రాష్ట్రంలో 245 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు

## సోలార్ పవర్‌పై దృష్టి సారించిన జెన్‌కో

**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సోలార్ ప్లాంట్లపై తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో దృష్టిసారించింది. ఇందులో భాగంగా మొత్తంగా 245 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇటీవలి కాలంలో ప్లాంట్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో సింగరేణి సహ అనేక ప్రైవేట్ కంపెనీలు సోలార్ విద్యుత్తు రంగంలోకి ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో జెన్కో కూడా సోలార్ పవర్ ఉత్పత్తిపై కేంద్రీకరించింది. జెన్కో అధికారవర్గాల వివరాలు ప్రకారం థర్మల్, హైడల్ పవర్ యూనిట్లలోఈ సోలార్ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రధానంగా థర్మల్, హైడల్ పవర్ యూనిట్లకు సంబంధించి సోలార్ రూఫ్‌టాఫ్, ఫ్లోటింగ్, గ్రౌండ్ మౌంటెడ్ ప్లాంట్లను నెలకొల్పేందుకు చర్యలు చేపట్టింది. జెన్‌కోకు చెందిన ఆఫీసు, యూనిట్లు తదితర కార్యాలయాల భవనాలపై 186, కొత్తగూడెంలో 13, భూపాలపల్లిలో 8, జూరాలలో 25, పులిచింతలలో 11, కేటీపీఎస్ 7వ దశలో 4 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. కాగా 2023-24 వరకు 6,486 మెగావాట్లుగా ఉన్న జెన్‌కో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లోని యూనిట్లు క్రమంగా అందుబాటులోకి వస్తుండటంతో ప్రస్తుతం 8,823 మెగావాట్లకు చేరింది. రాష్ట్ర మొత్తం స్థాపిత విద్యుత్తు సామర్థం 23,187 మెగావాట్లు కాగా, దీంట్లో 11,099 మెగావాట్లు జెన్‌కో, సింగరేణి వంటి సంస్థలకు చెందినది. అలాగే ప్రైవేట్ రంగంలో 8,279 మెగావాట్లు, ఎన్టీపీసీ లాంటి ప్లాంట్లలో 3,809 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది.

# ఇంటర్ ఫలితాల్లో విఫలం.. మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



సౌజన్య (ఫైల్)

**ఉట్నూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఇంటర్ పరీక్షల్లో విఫలం అవడం ఓ విద్యార్థినిని మృత్యువు ముఖం లోకి నెట్టింది. జిల్లాలోని ఉట్నూరు మండలంలో ఈ విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సౌజన్య(17) విద్యార్థిని ఫలితాల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉట్నూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువు తున్న సౌజన్య ఆదివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించ లేకపోయింది. దీంతో తీవ్రఆందోళనకు గురై, మానసికంగా కృంగిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సౌజన్య ఉరివేసుకున్న విషయం గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**అన్నాసాగర్‌లో ..**



జక్కుల శ్రావణి(ఫైల్)

**భూత్పూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** ఇంటర్‌లో ఫెయి ల్ అయ్యానని మనస్తాపం చెంది ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అన్నాసాగర్‌కు చెందిన జక్కుల అంజనేయులు కూతురు జక్కుల శ్రావణి(17) భూత్పూర్ ప్రభుత్వ జూనియర్‌లో సీఈసీ చదివి పరీక్షలు రాయగా, ఫలితాల్లో శ్రావణి రెండు సబ్జెక్టులు తప్పడంతో మనస్తాపం చెంది ఆదివారం సాయంత్రం శ్రావణి ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

# రోజ్ వాటర్ ఇలా కూడా !



సౌందర్య పోషణకి వంటింటి చిట్కాలు పాటించే వాళ్ల దగ్గర తప్పక ఉండేదేదంటే రోజ్ వాటరే గుర్తొస్తుంది కదూ! దీన్ని ఫేస్ ప్యాక్లకే కాదు.. ఇంకా చాలా రకాలుగానూ వాడొచ్చని తెలుసా?

✦ జుట్టు నిర్జీవంగా, గడ్డిలా కనిపిస్తోందా? అయితే రోజ్ వాటర్ స్ప్రే చేసి, ఆపై నెమ్మదిగా దువ్వండి. తేమ అంది, కురులు మెరుస్తాయి. మెత్తగా నిగనిగలాడుతూ కనిపించాలంటే గులాబీ నీటికి కొన్ని చుక్కలు ఆర్గాన్ ఆయిల్ని కలిపితే సరి.

✦ సరిగా నిద్ర లేకపోయినా... బాగా అలసిపోయినా ఆ ప్రభావం కనిపించేది కళ్ల దగ్గరే కదూ! రోజ్ వాటర్ని కాసేపు ఫ్రిజ్లో ఉంచండి. బయటకు తీసిన తరువాత, కాటన్ ప్యాడ్ మీద చిలకరించండి. ఆపై వాటిని కళ్లమీద ఉంచి, కాసేపు విశ్రాంతి తీసుకుంటే సరి. కళ్ల వాపు, ఎర్రదనం, అలసట... అన్నిటినీ మటుమాయం చేస్తుంది.

✦ ఎండ వేడి, ఏసీ చల్లదనం ముఖాన్ని నిర్జీవంగా మారుస్తాయి. అలాంటప్పుడు ముఖంమీద దీన్ని స్ప్రే చేసుకోండి. తేమను అందించడమే కాదు... తాజాగానూ మారుస్తుంది. పైగా మేకప్ వేసుకున్నా పనిచేస్తుంది. మిస్ట్లో పనికొస్తుంది కాబట్టి, బ్యాగులో తప్పక ఉంచుకోండి మరి.

✦ ఎండలో కాసేపు ఉంటే చాలు చర్మం ఎర్రబడిపోతుంది చాలామందికి. ఆపై దురద, మంట. అలాంటప్పుడు చర్మాన్ని మరింత ఇరిటేట్ చేయాలంటే, ఇన్ఫ్లమేషన్ పెంచని పరిష్కారాలు కావాలా? అయితే రోజా వాటర్ ని కలబంద గుజ్జుతో కలిపి రాస్తే చాలు.

✦ లిప్బామ్ ఎంత రాసినా ప్రయోజనం లేదా? ముందు కాస్త రోజ్వాటర్ పట్టించి, తరవాత లిప్ బామ్ రాయాలి. దీనివల్ల తేమ ఎక్కువ సేపు ఉంటుంది. పెదాలూ మృదువుగా కనిపిస్తాయి. ◘

# గ్యాస్ వృథాని అరికడదామిలా !

వంటచేస్తున్నప్పుడు స్టవ్పై నూనె పడటం, పాలు, టీ, పప్పు వంటివి పొంగడం సహజం. కానీ వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. లేదంటే వాటి తాలూకు వ్యర్థాలతో బర్నర్ రంధ్రాలు పూడుకుపోతాయి. గ్యాస్ వృథా అయ్యి వంటకు సమయం ఎక్కువ పడుతుంది.



● బర్నర్లని క్లీన్ చేయడానికి కొందరు సబ్బుని వాడుతుంటారు. ఇలా చేస్తే వాటి రంధ్రాలు క్రమంగా మూసుకుపోయి మంట సరిగా రాదు. అందుకే ముందు వాటిని తడిబట్టతో తుడిచాక శుభ్రం చేయాలి.

● ఒక కప్పు వినెగర్కు రెండు కప్పుల నీటిని కలిపి బర్నర్లను అందులో నాననివ్వాలి. ఆపై డిష్వాషర్ లిక్విడ్తో శుభ్రం చేస్తే సరి. వినెగర్లోని ఆమ్లతత్వం మురికీ, తుప్పునీ వదిలిస్తుంది.

● బర్నర్లకి నూనె జిడ్డు ఎక్కువగా కనిపిస్తే వంటసోడ, ఉప్పు రెండు సమ పరిమాణంలో తీసుకుని కొన్ని నీళ్ల కలపాలి. దాన్ని పేస్టులా చేసుకొని వాటికి పట్టించాలి. పావుగంట తరవాత డిష్ వాషర్ లిక్విడ్లో ముంచిన తర్వాత టూత్ బ్రష్తో రుద్దితే రంధ్రాలపై ఉంటే మొండి జిడ్డు పోయి పాత్రకి మంట సమానంగా తగులుతుంది. ఇలా కనీసం వారానికోసారి అయినా చేయాలి. ●. తుప్పు పట్టిన బర్నర్లను మార్చుకోవాలి. గ్యాస్ పైప్లైన్ మడత పడకుండా చూసుకోవాలి. మంట నీలం రంగులో ఉంటే స్టవ్ సరిగ్గా పనిచేస్తుంది... పసుపు, ఎరుపు రంగులో మంట వస్తుంటే బర్నరిని తీసి శుభ్రం చేయాలి. ఈ జాగ్రత్తలన్నీ పాటిస్తే కనీసం 10 14 శాతం. మన ఇంట్లో గ్యాస్ను ఆదా చేసుకోవచ్చు. ◘

# ఆవుపేడతో ఎన్నో రకాల పెయింట్లు !



కొత్తగా ఆలోచించలే గానీ... సాధ్యం కానిదేదీ ఉండదు అని నిరూపించారు ఒడిశాకు చెందిన దుర్గా ప్రియదర్శిని. ఆవు పేడతో పర్యావరణ అనుకూల వస్తువు లను తయారుచేస్తూ వ్యాపార వేత్తగా ఎదిగారు.

ఒడిశాలోని బరగఢ్కు చెందిన దుర్గా ప్రియ దర్శినికి చిన్నప్పటి నుంచీ ఏదైనా సాధించాలన్న కోరిక. పోస్ట్ గ్రాడ్యుయేషన్ తరవాత వెంటనే పెళ్లి, పిల్లలు, దాంతో మరో పదేళ్లకు కానీ ఆమె కల నెరవేరలేదు. కోవిడ్ సమయంలో వీళ్ల కుటుంబం గురుగ్రామాల్లో ఉండేది. అప్పుడే దేశీ ఆవులకోసం గోశాల ఏర్పాటు చేయాలనుకున్నారీమె. అందుకోసం దగ్గరలోని ఝజ్జర్ నగరానికి వెళ్లి శిక్షణ ఇచ్చారు. అయితే అక్కడ పేడను వృథాగా పారేయడం గమనించాక, దాంతోనే ఏదైనా చేయాలను కున్నారు. అప్పుడే రాజస్థాన్ని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమీషన్(కేవీఐసీ) కి చెందిన ఓ శాస్త్రవేత్త ఆవు పేడ నుంచి పెయింట్ తయారుచేయొచ్చని చెప్పిన వీడియో ఆమె కంట పడింది. దాని గురించి తెలుసుకుందామని జైపుర్కి వెళ్లి, కేవీఐసీలో చేరి, తయారీల తయారీలో శిక్షణ తీసుకున్నారు. అయితే అక్కడ వాళ్లు రెండు రకాల దుస్తులు మాత్రమే తయారు చేసేవారు. కానీ నేను అనేక రకాలుగా చేయాలనుకున్నా. ముంబయి, ఢిల్లీ శాస్త్రవేత్తలు, టెక్నీషియన్ల దగ్గర శిక్షణ తీసుకున్నా, బర్ఢ్కు తిరిగొచ్చాక సొంత ఫ్యాక్టరీ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. కానీ బ్యాంకులు నమ్మలేదు, లోను ఇవ్వలేదు. అయినా నిరాశపడలేదు. ఉన్న భూమిని అమ్మి సొంతంగా కంగాన్లో ఫ్యాక్టరీని నెలకొల్పు. ప్రస్తుతం బర్గఢ్తోపాటు భువనేశ్వర్, బాలేశ్వర్, బెంగళూరు... వంటి చోట్ల మా కార్యాలయాలు ఉన్నాయి. మరో 30 మంది యువకులకీ పేద మహిళలకు ఉపాధి కల్పిస్తున్నా అంటున్నారీమె.

**గది చల్లగా!....** ఈ పెయింట్లకోసం చుట్టుపక్కల గ్రామాల్లో రైతుల నుంచి కిలో రూ.5 చొప్పున పేడను కొంటారు. 29 రకాల పేడ పెయింట్లను తయారుచేస్తున్నారు. 35 శాతం వేడనీ మిగిలిన 65 శాతం పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలనీ వాడి ఈ పాత్రలలో ప్రైమర్, తేమ నిరోధక మెటాలిక్, పర్యావరణ అనుకూలమైన ఎనామల్... అన్ని రకాల వంటివన్నీ ఉన్నాయి. ఇవి 3 నుంచి 15 ఏళ్ల వరకు ఉంటాయట. మార్కెట్లో ఉన్నవాటికన్నా ధర కూడా తక్కువే. పైగా వీటితో గది ఉష్ణోగ్రత 3 నుంచి 5 డిగ్రీల వరకూ తగ్గుతుంది. కాలుష్యమూ ఉండదు అంటున్నారు దుర్గ. దేశీయ ఆవుల సంరక్షణే నా లక్ష్యం. చాలామంది పాలిచ్చే వరకూ ఆవుల్ని పెంచి, తరవాత రోడ్లమీదకి వదిలేస్తారు. అదే పేడకీ డిమాండ్ ఉంటే ఆ పని చేయరు. అందుకోసమే ఈ ఫ్యాక్టరీ అంటోన్న ఆమె ఆలోయన ప్రశంసనీయం.

# మహిమాన్విత గిరి

నమశ్శివాయ అనే పంచాక్షరి మంత్రానికి ఉన్న మహాత్మ్యం అరుణాచలం అనే నామానికి కూడా శివమహాపురాణం లేదు. అరుణాచలేశ్వర ఆలయ ప్రదక్షిణ, అరుణగిరి ప్రదక్షిణ.. రెండు ముక్తిప్రదాయకమని, భూమండలానికి హృదయ స్థానమైన అరుణాచలం మీద కార్తికపౌర్ణమి నాడు వెలిగించే అఖండ జ్యోతి జ్ఞానానికి ప్రతీక అని తెలియజేసింది. పరమశివుడు అరుణాచలం కొండపై దక్షిణామూర్తిగా కొలువై ఉంటాడు. తపోదీక్షలతో ఆ మూర్తిని దర్శనం చేసుకున్న సాధకులెందరో ఉన్నారు. రమణ మహర్షి శిష్యుడైన చాడ్విక్ అరుణ గిరిపై తనకు కలిగిన విశేషమైన అనుభవాల గురించి ఆంగ్లంలో అనేక వ్యాసాలు రాశారు. ఆ కొండపై అలౌకిక శక్తులు ప్రసరిస్తున్నాయని ఉదాహరణలతో వివరిం చారు. 'అరుణాచల శివ' అనే నామోచ్చారణ అమోఘ ఫలితాన్ని స్తుందంటూ తన స్వీయ అనుభవాన్ని తెలియజేశారు. సుబ్రహ్మణ్యస్వామి భక్తులు కూడా అరుణాచలంపై తపోదీక్షలు ఆచరించి తమ ఆరాధ్యమూర్తిని దర్శించుకున్న ఉదంతాలున్నాయి. ప్రస్తుతం పర్వతంలా కనిపిస్తున్న అరుణాచలం రూపం పూర్వయుగాల్లో వేరు. కృత యుగంలో అరుణగిరి ఉజ్వల జ్యోతిల ప్రకాశించేదని, జీవరాశులు ఆ కాంతిని తట్టుకోలే ఆ కొండ క్రమేణా తన రూపాన్ని మార్చుకుందని స్కంద పురాణం వర్ణించింది. ఆ పరంపరలో త్రేతాయుగంలో స్వర్ణగిరిగా, ద్వాపరయుగంలో రాగి పర్వతాలు పూజలందుకుంటాయని మహర్షులు పేర్కొ న్నారు. కలియుగం నాటికి శిలారూపం దాల్చిందని, అంతర్గతంగా అగ్నిలింగంగా తన మహిమను ప్రదర్శించిందని తెలియజేశారు.



అరుణాచలం గుహల్లో సాధన చేసి ఎందరో సరస్వతీ కటాక్షం పొందారు. కావ్యకంఠ గణపతి ముని అక్కడి మామిడి గుహలో తపస్సు చేశారు. రమణుల ఆశీస్సులతో

# మహిళకే ఉద్యోగ స్థిరత్వం !



మహిళలు ఎక్కువ రోజులు కొలువుల్లో ఉండరనేది ఒక సాధారణ ఆలోచన. కానీ వాస్తవానికి దీనికి భిన్నంగా ఉందంటోంది ఓ తాజా అధ్యయనం. పురుషులతో పోల్చితే మహిళలు ఉద్యోగాల్లో నిలకడగా ఉంటున్నారట. ఫిన్టెక్ కంపెనీ 'శాలరీ సే'... తమ 47,800 మంది నమోదిత రికార్డులను పరిశీలిస్తోంది ఈ వివరాలను చెబుతుంది. దీని ప్రకారం మహిళలు సగటున ఉద్యోగంలో 10.6 నెలలు ఉంటే, పురుషులు ఉండేది 7.8 నెలలేనట. కొలువులో చేరిన మొదటి ఆరు నెలల్లోనే 44 శాతం మంది మగవాళ్ళు మానేస్తుండగా, ఆడవాళ్ల శాతం 36గా ఉంది. సంఘటిత రంగంలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో మాత్రం 7.6 శాతం మాత్రమే మహిళలు. స్త్రీలు విద్య (20.3 శాతం), ఐటీ (13.2) రంగాల్లో ఎక్కువగా పనిచేస్తుండగా, తయారీ (3.6), (3.2) రంగాల్లో నిర్మాణాలు తక్కువగా ఉన్నాయి. 3545 ఏళ్ల మధ్య వయసు వారిలో ఎక్కువగా ఆడవాళ్లే కొలువులు వీడుతున్నారు. ఇది 19.5 శాతం. అదే వయసు పురుషుల్లో ఇది 12.4 శాతం. మహిళలు ఎక్కువ కాలం పనిచేయరు. వాళ్లపైన పెట్టుబడి రిస్కుతో కూడుకున్నదనే భావన తప్పు. వారు కొనసాగాలనుకుంటున్నారు, అవకాశాలు లేవు అని ఈ అధ్యయనం చెబుతోంది.

# గార్లిక్ ఫ్రైస్



**కావలసిన పదార్థాలు:** ఆలుగడ్డలు: రెండు, వెల్లుల్లి రెబ్బలు: పది, మైదా: అర కప్పు, కార్న్ఫ్లోర్: రెండు టేబుల్ స్పూన్లు, రెడ్చిల్లీ ఫ్లేక్స్: ఒక టీస్పూన్, ఆరిగానో: ఒక టీస్పూన్, మిరియాల పొడి: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా, చీజ్ తురుము: ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా, వెన్న: టేబుల్ స్పూన్.

**తయారీ విధానం:** ఆలుగడ్డల తొక్కతీసి నిలువు ముక్కలుగా కోసి పది నిమిషాల పాటు నీళ్లలో నాన బెట్టాలి. మరుగుతున్న నీళ్లలో ఆ ముక్కలను రెండు నిమిషాలు ఉడికించి తీయాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్ఫ్లోర్, రెడ్చిల్లీ ఫ్లేక్స్, ఆరిగానో, మిరియాల పొడి, ఉప్పు వేసి తగినన్ని నీళ్లుపోసి పల్చగా కలపాలి. ఆలుగడ్డ ముక్కలను మైదా మిశ్రమంలో కలపాలి. స్టవ్మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోయాలి. బాగా వేడయ్యాక ఆలుగడ్డ ముక్కలను విడివిడిగా వేసి దోరగా వేయించాలి. పాన్లో వెన్న వేడిచేసి.. తురిమిన వెల్లుల్లి వేయాలి. బాగా వేగాక ఆలు ఫ్రైస్ వేసి కలిపి పైనుంచి చీజ్ తురుము, కొత్తిమీర తురుము చల్లి ఒక నిమిషం పాటు మూత పెట్టాలి. వేడివేడి గార్లిక్ ఫ్రైస్ టమాట సాస్తో బాగుంటాయి. ◘

# పచ్చడి జాడీ జాగ్రత్త



ఊరగాయలను నిల్వ ఉంచడానికి పింగాణీ, సెరామిక్ జాడీలను ఉపయోగించడం గురించి తెలుస్తుంది. ఇది తరతరాలుగా వస్తున్న ఓ ఆరోగ్యకరమైన సంప్రదాయం. అయితే, ఇటీవలి కాలంలో వీటికి బదులు, లభ్యత కారణంగా ప్లాస్టిక్ డబ్బాల వాడకం పెరిగింది. అయితే, పచ్చడి రుచి, నాణ్యత చెడిపోకుండా ఉండాలంటే మాత్రం జాడీలే శ్రేష్ఠం. వీటిల్లో పచ్చడి ఊరడం వల్ల సహజమైన రుచి, వాసన పెరుగుతాయి. బయటి వేడిని లోపలికి త్వరగా రానివ్వవు. దీనితో పచ్చడి త్వరగా పాడవదు. పైగా ప్లాస్టిక్, పాత్రల్లాగా ఇవి పచ్చడిలోని ఉప్పు, పులుపు రసాయనిక చర్యలు చేపట్టవు. దీనితో హానికర రసాయనాలేవీ ఒంట్లోకి వెళ్లే ప్రమాదం లేదు. అయితే, వీటిని శుభ్రం చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే పచ్చడి బూజు పట్టే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కొత్త జాడీని కొన్నప్పుడు లేదా పాత పచ్చడి తీసిన తర్వాత, గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి శుభ్రం చేయాలి. కడిగిన తర్వాత జాడీలో ఏమాత్రం తేమ ఉండకూడదు. కనీసం 12 రోజులు ఎండలో బాగా ఎండబెట్టాలి. లేదంటే తేమకి పచ్చడి పాడవుతుంది. లోపల తుడవడానికి శుభ్రమైన, పొడి కాటన్. ◘

# తెర

## కమర్షియల్ హాంగులతో



రఫ్ నోట్ ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక ద్విభాషా చిత్రం గాడ్స్ అండ్ సోల్జర్స్. ప్రముఖ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ట్రైజర్ వీడియోను సంచలన దర్శకుడు హరీష్ శంకర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. మాస్ అంశాలతో పాటు భావోద్వేగాలు, భారీ యాక్షన్ సీక్వెన్స్లతో కూడిన ఈ ట్రైజర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతూ సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ.. తమ చిత్ర ట్రైజర్ను విడుదల చేసి ప్రోత్సహించిన హరీష్ శంకర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాస్తవిక కథాంశానికి కమర్షియల్ హంగులను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాలో నటీనటులు సరికొత్త అవతారాల్లో కనిపిస్తారని, ముఖ్యంగా ఆరి అరుజునన్ తొలిసారిగా పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో మెప్పించనున్నారని తెలిపారు. యువ హీరో రాజ్ తరుణ్ ఈ చిత్రంతో తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుండటం విశేషం. నటుడు భరత్ ఒక కీలకమైన ఎమోషనల్ పాత్రలో నటించగా.. అమూ అభిరామి, కిశోర్ ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే స్వతంత్ర సంగీత కళాకారుడు వేధన్ ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించడమే కాకుండా, తన ప్రత్యేక గాత్రంతో సినిమాకు అదనపు ఆకర్షణగా నిలవనున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైన ఈ చిత్రం, త్వరలోనే తమిళ, తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.

## క్రైమ్ థ్రిల్లర్ సెట్లోకి 'చింతామణి



శ్రీరామ్, మహిమా గుప్త హీరో హీరోయిన్లుగా మిత్రా మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న నూతన చిత్రం చింతామణి సొంతకథ. ప్రేమ్ రాజ్ దర్శకత్వంలో బి.రాజీవ్ కుమార్, రాకేష్ కర్రె, డా. ఎన్ వీ రావు, శ్రీనివాస్ పసుపులేటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్లోని రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ డా. అద్దంకి దయాకర్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇవ్వగా, జీహెచ్ఎంసీ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ వందనకుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. సోషల్ యాక్టివిస్ట్ డా. శ్రీనివాస్ తొలి షాట్కు దర్శకత్వం వహించారు. నటుడు కాశీ విశ్వనాథ్, రచయిత నివాస్ కలిసి దర్శకుడికి స్క్రిప్ట్ను అందజేశారు. కమర్షియల్ క్రైమ్ థ్రిల్లర్గా..దర్శకుడు ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ.. ఇది నా నాలుగో చిత్రం. గతంలో సందేశాత్మక చిత్రాలు తీసిన నేను, ఈసారి కమర్షియల్ పంథాలో ఒక ఉత్కంఠభరితమైన క్రైమ్ థ్రిల్లర్ కథను సిద్ధం చేశాను. అని తెలిపారు. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ, ఈ కథలో ఉన్న వైవిధ్యం తనకు బాగా నచ్చిందని, ప్రతి సినిమాను మొదటి సినిమాగా భావించి కష్టపడతానని చెప్పారు. హీరోయిన్ మహిమా గుప్తకు తెలుగులో ఇది తొలి చిత్రం కావడం విశేషం. నిర్మాతల్లో ఒకరైన రాకేష్ కర్రె మాట్లాడుతూ.. సినిమా టైటిల్ చింతామణి సొంతకథ క్లుప్తంగా చెప్పాలంటే... ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్ ఎంత విజయవంతమైందో, మా సినిమా కూడా అదే స్థాయిలో విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అని ధీమా వ్యక్తం చేశారు. మరో నిర్మాత డా. ఎన్ వీ రావు మాట్లాడుతూ, సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చే ఉద్దేశంతోనే తమ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. ఈ చిత్రానికి ప్రముఖ సాహితీవేత్తలు సుద్దాల అశోక్ తేజ, చంద్రబోస్తో కలిసి పాటలు రాసే అవకాశం రావడం పట్ల లిరిసిస్ట్ మిట్టపల్లి సురేందర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగబాల సురేష్ కుమార్, నాని తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

# స్వర మాధుర్యం ఆశా ప్రయాణం


నిశ్శబ్దమైన భారత కోకిల

తెలుగులోనూ చెరగని ముద్ర










**భా**రతీయ సంగీత లోకంలో ఒక ధ్రువతార నేలకొరిగింది. తన గాత్రంతో కొన్ని దశాబ్దాల పాటు కోట్లాది మందిని ఉర్రూతలూగించిన లెజెండరీ సింగర్ ఆశా భోంస్లే (92) ఆదివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె, ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఆమె మరణించినట్లు వైద్యులు వెల్లడించారు.

ఒక చిన్న గ్రామంలో మొదలైన ప్రయాణం.. గిన్నిస్ బుక్ రికార్డుల శిఖరాగ్రం వరకు చేరిన వైనం అది. కేవలం పదేళ్ల ప్రాయంలో, చేతిలో సంగీతం తప్ప మరే మీ లేని స్థితిలో మైక్రోఫోన్ పట్టిన ఆ చిన్నారి, ఆరు దశాబ్దాల పాటు భారతీయ సినీ సంగీత సామ్రాజ్యాన్ని ఏలుతుందని అప్పుడు ఎవరూ ఊహించి ఉండరు.

**సవాళ్లను అధిగమించి..**

సంగీత ప్రపంచంలో లెజెండ్ అనిపించుకోవడం అంత సులభంగా జరగలేదు. తన సోదరి లతా మంగేష్కర్ వంటి దిగ్గజం నీడలో ఉంటూనే, తనకంటూ ఒక ప్రత్యే కమైన గుర్తింపును సంపాదించు కోవడానికి ఆమె ఎంతో శ్రమిం చారు. లత శాస్త్రీయతకు మారు పేరుగా నిలిస్తే, ఆశా వైవిధ్యానికి చిరునామాగా మారారు. గజల్స్ నుంచి హుషారైన క్లబ్ సాంగ్స్ వరకు, శాస్త్రీయ రాగాల నుంచి పా ప్ సంగీతం వరకు ఆమె పాడని పాట లేదు, పలకని భావం లేదు.

**తెలుగు గుండెల్లో మోనగీతం**

తెలుగులో ఆమె పాడింది కేవలం ఎనిమిది పాటలే కావచ్చు, కానీ ఆ ప్రతి పాట ఒక ఆణిముత్యం.'ఇది మోన గీతం.. ఇది నీ నిరీక్షణ.. అని ఆమె పాడుతుంటే, తెలు గు శ్రోతలు ఆ గాత్రంలోని ఆర్ద్రతకు ముగ్ధులయ్యారు. ఇళయరాజా స్వరకల్పనలో 'అశ్వమేథం సినిమాలో ఆమె పాడిన పాటలు ఇప్పటికీ కుర్రకారును అలరిస్తూనే ఉన్నాయి. ఇక 'చందమామ సినిమాలో ఆమె పాడిన చివ రి తెలుగు పాట 'నాలో ఊహలక్ను, ఒక అందమైన వీడ్కోలు గీతం లా మన జ్ఞాపకాల్లో నిలిచిపోయింది.

**రికార్డుల రారాణి**

ఒక మనిషి తన జీవితకాలంలో ఎన్ని పాటలు పాడగలరు? వందలా? వేలా? ఆశా భోంస్లే ఏకంగా 12 వేలకు పైగా పాటలతో చరిత్ర సృష్టించారు. 20కి పైగా భాషల్లో ఆమె స్వరం వినిపించింది. పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే వంటి ఎన్నో అత్యున్నత పురస్కారాలు ఆమెను వరించాయి.

**ముగిసిన సుమధుర శకం**


వయసు 90 దాటినా, ఆమె గొంతులో ఆ ఉత్సాహం, ఆ నవ్వు ఎప్పుడూ తగ్గలేదు. ఇన్ఫెక్షన్తో పోరాడుతూ ఆమె కన్ను మూశారన్న వార్త విన్నప్పుడు సంగీత ప్రపంచం ఒక్కసారిగా మూగబోయింది. ఆమె భౌతికంగా మన మధ్య లేకపోవచ్చు, కానీ ఆమె విడిచి వెళ్లిన వేలాది పాటలు, ఆ మధుర స్మృతులు గాలిలో తరంగాలుగా ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. సంగీతం ఉన్నంత వరకు, పాట పల్లవి అందుకున్న ప్రతిసారీ ఆశా భోంస్లే అనే పేరు



వినిపిస్తూనే ఉంటుంది.

**దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతి**

ఆమె మృతి పట్ల దేశవ్యాప్తంగా సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఇళయరాజా, రెహమాన్, కీరవాణి వంటి సంగీత దిగ్గజాలతో ఆమె చేసిన ప్రయోగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. ఒక అద్భుతమైన సంగీత శకం ముగిసిందంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.




## ఈసారి భయపెట్టడమే లక్ష్యం



టాలీవుడ్ సీనియర్ స్టార్ ప్రొడ్యూసర్, దర్శకుడు ఎం.ఎస్. రాజు తన రూటు మార్చారు. శత్రువు, ఒక్కడు, వర్షం, నువ్వొస్తానంటే నేనొద్దంటానా వంటి క్లాసిక్ బ్లాక్ బస్టర్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. గతంలో డర్టీ హరి వంటి బోల్డ్ చిత్రంతో అందరినీ ఆశ్చర్యపరిచిన రాజు, ఇప్పుడు మొదటిసారిగా హారర్ థ్రిల్లర్ జోనర్లోకి అడుగుపెడుతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్మెంట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఈ వీడియోలో ఇద్దరు వ్యక్తులు ఎం.ఎస్. రాజు ఆఫీస్లోకి దొంగతనానికి వెళ్లి, అక్కడ ఆయన పాత సినిమాల పోస్టర్లు చూసి ఎమోషనల్ అవ్వడం కనిపిస్తుంది. మిమ్మల్ని ఫీల్ అయ్యేలా చేసిన వ్యక్తి.. ఇప్పుడు భయపెట్టబోతున్నాడు.. అనే క్యాప్షన్ సినిమాపై భారీ అంచనాలను పెంచుతోంది. గతంలో ప్రేమకథలకు, ఎమోషన్లకు పెద్దపీట వేసిన ఆయన, ఇప్పుడు హారర్ జోనర్లో తన మార్కును ఎలా చూపిస్తారో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను, నటీనటుల సమాచారాన్ని ఏప్రిల్ 15, 2026న అధికారికంగా వెల్లడించనున్నారు. టాలీవుడ్లో హారర్ చిత్రాల శైలిని మార్చే విధంగా ఈ మూవీ ఉండబోతోందని సినీ వర్గాల సమాచారం.

## మరియమ్మ మనసు గెలిచిన మహారాజా



మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం ఇరుముడి చిత్రంతో బిజీగా ఉన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్లో భారీ క్రేజ్ నెలకొంది. అందుకు ప్రధాన కారణం ఈ చిత్రం తండ్రీకూతుళ్ల సెంటిమెంట్తో సాగే ఎమోషనల్ యాక్షన్ డ్రామా కావడమే. అయితే, తాజాగా ఈ ప్రాజెక్టులోకి సీనియర్ నటి శోభన ఎంట్రీ ఇచ్చారనే వార్త సినిమా స్థాయిని ఒక్కసారిగా పెంచేసింది. కల్కి 2898 ఎడిలో మరియమ్మగా పవర్ఫుల్ పర్ఫార్మెన్స్ ఇచ్చిన శోభన, చాలా కాలం తర్వాత నేరుగా ఒక తెలుగు సినిమాలో కీలక పాత్ర చేసేందుకు ఒప్పుకున్నారు. ఈ సినిమాలో రవితేజ, శోభన పాత్రల మధ్య వచ్చే సన్నివేశాలు అత్యంత ఎమోషనల్గా ఉండటమే కాకుండా, కథను మలుపు తిప్పే విధంగా ఉంటాయని సమాచారం. బేబీ నక్షత్ర పోషిస్తున్న కూతురి పాత్రకు, శోభన పాత్రకు మధ్య కూడా మంచి బాండింగ్ ఉంటుందని తెలుస్తోంది. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్గా నటిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ తన మ్యూజిక్తో ప్రాణం పోస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శివ నిర్వాణ తన మార్క్ ఎమోషన్స్తో రవితేజను ఒక కొత్త కోణంలో చూపించబోతున్నారు.

# 61 యేళ్ల తర్వాత సింగిల్స్ మెడల్

## ఆయుష్ జైత్రయాత్రకు ఫైనల్లో బ్రేక్ * రజతంతో సరిపెట్టిన భారత్ యువ సంచలనం




**నింగ్‌బో(చైనా):** భారత యువ సంచలన షట్లర్ ఆయుష్ షెట్టి ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజతంతో సరిపెట్టాడు. ఫైనల్ వరకు హేమాహేమీలను ఓడించిన ఈ కర్ణాటక షట్లర్... తుది మెట్టుపై మాత్రం బోల్తా పడ్డాడు.ప్రపంచ నెంబర్ టూ షియుకి(చైనా) చేతిలో వరుస సెట్లలో 8-21, 10-21 తేడాతో వరుస గేమ్‌ల్లో ఆయుష్ పరాజయం పొందాడు. 1965 తర్వాత ఈ టోర్నీలో మరో భారత్ షట్లర్ రజతం సాధించడం ఇదే మొదటిసారి.1965లో దినేష్ ఖన్నా ఫైనల్ చేరి సింగిల్స్ టైటిల్ నెగ్గాడు.

కశ్యప్, లక్ష్యసేన్ వంటి భారత స్టార్ ఆటగాళ్లు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించినా ఆయుష్ షెట్టి భారత్ టైటిల్ ఆశలను ఫైనల్ వరకు మోసుకొచ్చాడు. ఫైనల్ చేరే క్రమంలో ప్రపంచ నెంబర్ వన్ షట్లర్ కున్లావత్ వితిద్సన్(ఇండోనేషియా), ప్రపంచ నెంబర్4 జోనాటన్ క్రిస్టీ,ప్రపంచ నెంబర్7 లీ షీ ఫెంగ్‌లను ఓడించాడు.దీంతో ఆయుష్‌షెట్టిపై ఒక్కసారిగా అంచనాలు పెరిగాయి. అయితే ఫైనల్లో మాత్రం చైనా షట్లర్ షియుకి ధాటికి నిలవలేక పోయాడు. 42 నిమిషాల పాటు జరిగిన ఫైనల్లో తొలి గేమ్‌ను ఎలాంటి ప్రతిఘటన ఇవ్వకుండానే ఆయుష్ కోల్పోయాడు. రెండో గేమ్‌లోనూ చైనా షట్లర్ పదునైన స్మాష్‌లు, తెలివైన ప్లేసింగ్, సర్వీస్‌లతో ఆయుష్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఏ స్థాయిలోనూ ఆయుష్‌ను కోలుకోనివ్వకుండా షియుకి గేమ్‌ను ముగించి స్వర్ణం అందుకున్నాడు.ఈ ఏడాది ఆరంభంలో మలేషియా సూపర్ 1000లో, గత సీజన్‌లో ఇండోనేషియా మాస్టర్స్‌లో షియుకి చేతిలో పరాజయం పొందిన ఆయుష్‌కు ఇది మూడో ఓటమి. 1965లో దినేష్ తర్వాత పురుషుల సింగిల్స్ ఫైనల్‌కు చేరిన రెండవ భారత ఆటగాడిగా నిలిచిన ఆయుష్... 61 ఏళ్ల స్వర్ణ నిరీక్షణకు తెరదించలేకపోయాడు.

మంగళూరుకు చెందిన ఈ 20 ఏళ్ల ఆయుష్ షెట్టి... 2023 ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ సింగిల్స్‌లో కాంస్యం గెలుపొందాడు. ప్రస్తుతం ప్రపంచ 25వ ర్యాంకులో ఉన్న ఆయుష్.. గత ఏడాది యుఎస్ ఓపెన్ సూపర్300 పురుషుల సింగిల్స్ విజేతగా, 2023లో ఒడిషా మాస్టర్స్ సూపర్100 లో రన్నరప్‌గా నిలిచాడు. అలాగే 202 బహ్రెయిన్ ఇంటర్నేషనల్‌లో, 2024 డచ్ ఓపెన్‌లో ఫైనల్‌చేరినా రన్నరప్‌తో సరిపెట్టాడు.

# గుజరాత్ టైటాన్స్ హ్యాట్రిక్ విన్



**లక్నో:** మొదటి రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలతో ఐపీఎల్ 2026 సీజన్‌ను మొదలు పెట్టిన గుజరాత్ టైటాన్స్...గెలుపు ట్రాక్‌లో పడింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను దాని సొంతగడ్డపై ఏడు వికెట్ల తేడాతో ఓడించి హాట్రిక్ విజయాన్ని అందుకుంది. లక్నో ఉంచిన 165రన్స్ లక్ష్యాన్ని మరో 8 బంతులుండగానే మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది.

సాయి సుదర్శన్(15)తో కలిసి గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్‌ను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ధాటిగా ఆరంభించాడు. తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. ఈ దశలో దిగ్వేష్ రాఠీ.. సుదర్శన్‌ను అవుట్‌చేశాడు. జాస్ బట్లర్‌తో గిల్‌తో జతకలిశాడు. ఇద్దరూ బౌండరీలతో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా శుభ్‌మన్ గిల్(40 బంతుల్లో 56).. ఓ సిక్స్, అయిదు బౌండరీలతో వరుసగా రెండో అర్ధసెంచరీ కంప్లీట్ చేశాడు. మరోవైపు జాస్ బట్లర్ కూడా ఫోర్లతో వేగంగా పరుగులు సాధించాడు. ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కు 84 రన్స్ జోడించి గెలుపుకు బాటలు వేశారు.

జోరు మీదున్న గిల్‌ను ప్రిన్స్ యాదవ్.. కీపర్ క్యాచ్‌తో బోల్తా కొట్టించగా, జాస్ బట్లర్(37 బంతుల్లో 60)ను షమీ అవుట్ చేశాడు. ఆరు పరుగుల తేడాతో రెండు కీలక వికెట్లు కోల్పోయి గుజరాత్ టైటాన్స్ కష్టాల్లో పడ్డట్టు కనిపించింది. అయితే లక్నో బౌలర్లకు అవకాశం ఇవ్వకుండా వాషింగ్టన్ సుందర్(13 బంతుల్లో 21), రాహుల్ తెవాటియా(10) మిగతా పనిని పూర్తిచేసి గుజరాత్ టైటాన్స్‌కు విజయాన్ని అందించారు.

అంతకుముందు సొంత మైదానంలో దుమ్మురేపాలనుకున్న లక్నో సూపర్ జెయింట్స్ అనూహ్యంగా తడబడింది. గుజరాత్ టైటాన్స్ పేసర్ ప్రసిద్ కృష్ణ(4/28) నిప్పులు చెరిగే బంతులతో లక్నోను కట్టడి చేశాడు. మార్క్రమ్(30) వికెట్‌తో మొదలుపెట్టి... ఆయుష్ బదోని(9), నికోలస్ పూరన్(19), ముకుల్ చౌదరీ(18) వికెట్లను ప్రసిద్ధ్ కృష్ణ తన ఖాతాలో వేసుకున్నాడు. మరో ఎండ్‌లో అశోక్ శర్మ రెండు వికెట్లు.. రబడ, సిరాజ్ చెరో వికెట్ తీయడంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 164 పరుగుల స్వల్ప స్కోరుకే పరిమితమైంది. మర్క్రమ్(30) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



# బోల్ట్‌ను అధిగమించిన గౌట్






**సిడ్నీ:** రేసింగ్ ట్రాక్ మీదికి మరో చిరుత దూసుకువచ్చింది. మెరుపువీరుడు ఉసేన్ బోల్ట్‌నే అధిగమించాడు. తాజాగా 200 మీటర్ల స్ప్రింట్ ఈవెంట్‌లో బోల్ట్ నెలకొల్పిన రికార్డును ఆస్ట్రేలియాకు చెందిన 18 ఏళ్ల కుర్రాడు గౌట్ బద్దలుకొట్టాడు. సిడ్నీలో జరిగిన ఆస్ట్రేలియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 200 మీటర్ల ఫైనల్ రేసులో గౌట్ 19.67 సెకన్లలో గమ్యాన్ని చేరి సరికొత్త సృష్టించాడు. ఉసేన్ బోల్ట్ 19.93 సెకన్లను టైమింగ్‌ను బ్రేక్ చేశాడు. గతంలో గౌట్ ఇదే 200 మీటర్ల రేసును 20.02 సెకన్లలో పూర్తి చేశాడు. తాజాగా తన రికార్డును మరింత సవరించడమే గాకుండా ఏకంగా బోల్ట్ రికార్డుకు ఎసరు పెట్టి నయా చిరుతగా ఆవిర్భవించాడు.

గౌట్ తల్లిదండ్రులు దక్షి ణ సుడాన్ నుంచి ఆస్ట్రేలియాకు వలస వచ్చారు. క్వీన్స్‌లాండ్‌లోని ఇప్స్‌విచ్ గ్రామర్ స్కూల్‌లో చదువుకున్న గౌట్ చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్‌పై ఇష్టం పెంచుకు న్నాడు.అండర్16 విభాగంలో 100, 200 మీట ర్లలో పలు రికార్డులు నెలకొల్పాడు. 15 ఏళ్ల వయసులో గౌట్.. అండర్18 విభాగంలో 200 మీటర్ల రేసును 20.87 సెకన్లలో పూర్తి చేసి దేశ వాళీలో రికార్డు నెలకొల్పాడు. అంతర్జాతీయ అథ్లెటిక్స్ టోర్నీల్లోనూ సత్త చాటిన గౌట్ ఓషి నియా అండర్ 18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ లో 200 మీటర్లు, 4400 మీటర్ల రిలేలో స్వర్ణ

| ఐపీఎల్‌లో నేటి మ్యాచ్ | |
|---|---|
| సన్‌రైజర్స్ హైదరాబాద్ V/S రాజస్థాన్ రాయల్స్ | రాత్రి 7.30 గం.లకు |

## ఉప్పల్‌లో నేడు మ్యాచ్

**హైదరాబాద్:** ఉప్పల్ స్టేడియం వేదికగా నేడు రాయస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. రెండు జట్లలోనూ హిట్టర్లు ఉండడంతో ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారే అవకాశం ఉంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ,యశస్వీ జైస్వాల్ స్టార్ అట్రాక్షన్‌గా ఉన్నారు. అందరూ బ్యాట్ ఝుళిపిస్తుండడంతో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఆసక్తిగా మారింది. రాజస్థాన్ రాయల్స్ వరుస విజయాలతో జోరు మీదుంది. అదే జోరు కొనసాగిస్తూ హైదరాబాద్‌ను దాని సొంతగడ్డపై ఓడించడంపై ఫోకస్ పెట్టింది. రాయల్స్ బ్యాటింగ్,బౌలింగ్‌లో పటిష్టంగా ఉంది. ముఖ్యంగా దేశవాళీ ప్లేయర్లు టాప్ ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు పంజాబ్ కింగ్స్‌పై 200 ప్లస్ రన్స్ చేసినా గెలవలేకపోయిన సన్ రైజర్స్...సొంతగడ్డపై రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. ఉప్పల్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో విఫలమైన సన్ రైజర్స్ పరాజయం పొందింది. ఈసారి బ్యాటింగ్‌పై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. అభిషేక్ శర్మ ఫామ్‌లోకి రావడం అనుకూలించే అంశం.

### 48 యేళ్ల మారథాన్ జాతీయ రికార్డుకు బ్రేక్

# సుదీర్ఘ పరుగుల వీరుడు సావన్

**రోటర్‌డామ్:** హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన మారథాన్ రన్నర్ సావన్ బర్వాల్ కొత్త రికార్డు నెలకొల్పాడు. 48ఏళ్లగా కొనసాగుతున్న జాతీయ మారథాన్ రికార్డును బ్రేక్ చేసి తన పేర లిఖించాడు. రోటర్‌డామ్‌లో జరిగిన ఎన్ఎన్ మారథాన్‌లో... సావన్ బర్వాల్ 2 గంటల 11 నిమిషాల 58 సెకన్ల టైమింగ్‌తో 20వ స్థానంలో నిలిచాడు. తద్వారా 1978 నుండి శివనాథ్ సింగ్ పేరు మీద ఉన్న 2 గంటల 12 నిమిషాల పాత జాతీయ రికార్డును చెరిపేశాడు.ఈ పోటీలో పాల్గొన్న మరో భారతీయ క్రీడాకారుడు గోపీ తోనకల్...42.195 కిలోమీటర్ల దూరాన్ని 2గంటల 13నిమిషాల 16 సెకన్ల సమయంలో పూర్తి చేసి 23వ స్థానంలో నిలిచాడు.

రోటర్‌డామ్ ఈవెంట్‌లో పాల్గొనడం సావన్ బర్వాల్‌కు ఇదే మొదటిసారి. జనవరిలో అమెరికాలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొన్న తర్వాత సావన్ బర్వాల్‌కు ఈ సీజన్‌లో ఇది రెండో మారథాన్.

హిమాచల్ ప్రదేశ్‌లోని కొండలతో కూడిన ఓ కుగ్రామానికి చెందిన 28 ఏళ్ల బర్వాల్....పలు హాఫ్ మారథాన్‌లు, 5వేల మీటర్లు, 10వేల మీటర్ల రేసులలో పరుగెత్తాడు. బర్వాల్ పలు మెడల్స్ గెలుపొందాడు. 2024లో ఢిల్లీ హాఫ్ మారథాన్‌లో స్వర్ణం నెగ్గాడు. బర్వాల్ 2019లో భారత సైన్యంలో చేరాడు. చిన్నప్పటి నుండి కొండల్లో పరుగులు పెట్టిన తనకు ఇదే కలిసి వచ్చిందని, అంతర్జాతీయ మారథాన్‌లో పతకం సాధిస్తానన్న ధీమాను బర్వాల్ వ్యక్తంచేశాడు.




# కోహ్లీ రికార్డు

**ముంబై:**ఐపీఎల్-2026లో విరాట్ కోహ్లి సూపర్ ఫామ్‌ను కొనసాగుతోంది. వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు. ఫిల్ సాల్ట్‌తో కలిసి ముంబై బౌలర్లపై బౌండరీలతో విరుచుకుపడ్డాడు.38 బంతులు ఎదుర్కొన్న కోహ్లీ.. 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 50 రన్స్ చేశాడు. తొలుత దూకుడుగా ఆడిన కోహ్లి, మిడిల్ ఇన్నింగ్స్‌లో కాస్త నెమ్మదించాడు. ఫిల్ సాల్ట్‌తో కలిసి తొలి వికెట్ ఏకంగా 124 పరుగుల భాగ స్వామ్యాన్ని నమోదు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో కింగ్ కోహ్లి పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.

ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌పై 1000 పరుగులు పూర్తి చేసిన మొట్టమొదటి బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. కోహ్లి ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సీఎస్‌కేపై 1000 కంటే ఎక్కువ పరుగులు సాధించాడు. మొత్తంగా అయిదు జట్లపై వెయ్యి పరుగులు చేసిన ఒకే ఒక్కడు కూడా. అదేవిధంగా టీ20ల్లో అత్యధిక సెంచరీ (100+) భాగస్వామ్యాలు నెలకొల్పిన ఆటగాడిగానూ విరాట్ కోహ్లీ వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో ఆయన యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్(29), పాకిస్తాన్ క్రికెటర్ బాబర్ ఆజం (28)లను కోహ్లీ అధిగమించాడు. ఐపీఎల్ ప్రారంభం నుంచి ఆర్సీబీకి ఆడుతున్నాడు.




# టాప్ 8 కంపెనీల్లో 4.13 లక్షల కోట్లు పెరిగిన మార్కెట్ క్యాప్

**ముంబయి, ఏప్రిల్ 12:** ఈక్విటీ మార్కెట్లలోని టాప్ పదవి కంపెనీల్లో ఎనిమిది కంపెనీల మార్కెట్ విలువలు రూ.4.13,003.23 కోట్లు పెరిగాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐబ్యాంకులు ఎక్కువ లాభాలు పొందాయి. టాప్ పది సంస్థల్లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్,ఎల్అండ్‌టి, హిందూస్థాన్ యూనిలీవర్‌లు లాభాల్లో నడిస్తే రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ సంస్థలు మార్కెట్ విలువల్లో పుంజుకోలేకపోయాయి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రూ.91,282.67 కోట్లు పెరిగి రూ.12,47,478.57 కోట్లకు పెరిగింది. ఐసిఐసిఐబ్యాంకు ఎంక్యాప్ రూ.76,036.36కోట్లు పెరిగి 9,46,741.85 కోట్లకు చేరితే బజాజ్ ఫైనాన్స్ రూ.60,980.35 కోట్లు పెరిగి రూ.5,75,206.47 కోట్లకు చేరింది. మార్కెట్ విలువల్లో ఎల్అండ్‌టి కూడా రూ.47,624.97 కోట్లుపెరిగి రూ.5,44,736.59 కోట్లకు చేరితే భారతి ఎయిర్‌టెల్ రూ.45,873.43 కోట్లుపెరిగి రూ.10,66,293.69 కోట్లకు చేరింది. ఎస్‌బిఐ ఎంక్యాప్ కూడా రూ.43,614.67 కోట్లుపెరిగి రూ.9,84,629.98 కోట్లకు చేరితే టిసిఎస్ రూ.26,303.49 కోట్లుపెరిగి రూ.913,331.92 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

ఇక హిందూస్థాన్ యూనిలీవర్ రూ.21,287.29 కోట్లుపెరిగి రూ.5,06,477.89 కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ ఎంక్యాప్ మాత్రం రూ. 3285.03కోట్లు క్షీణించి రూ.5,24,124.40 కోట్లకు చేరితే రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువలు రూ.947.28కోట్లు తగ్గి రూ.18,27,086.79 కోట్లకు చేరింది.

మార్కెట్ విలువలు క్షీణించినా రిలయన్స్ ఇప్పటికీ టాప్‌లోనే కొనసాగింది. ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి, భారతి ఎయిర్‌టెల్; ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్అండ్‌టి, ఇన్ఫోసిస్, హిందూస్తాన్ యూనిలీవర్‌కు చేరుతుంది.

# కార్పొరేట్ ఫలితాలపై పశ్చిమాసియా పరిణామాలే కీలకం

**ముంబై, ఏప్రిల్ 12 :** వరుసగా ఆరు వారాల పతనానంతరం బలమైన రికవరీ నమోదు చేసిన భారతీయ స్టాక్ మార్కెట్, కొత్త వారంలో జాగ్రత్తలతో కూడిన ఆశావాద దృక్పథంలోకి ప్రవేశిస్తోంది. భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు తగ్గే అవకాశాలు మరియు దేశీయ స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటంతో పెట్టుబడిదారుల నమ్మకం పెరిగింది. ప్రపంచ సంకేతాలు, కార్పొరేట్ ఫలితాలు, కరెన్సీ మార్పులు రాబోయే రోజుల్లో మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశం ఉంది. గత వారం భారతీయ ఈక్విటీ సూచీలు బలంగా పుంజుకున్నాయి. బెంచ్‌మార్క్ సూచీలు దాదాపు 6 శాతం పెరిగి వారాంతానికి సమీప గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. నిఫ్టీ 24,050.60 వద్ద స్థిరపడగా, సెన్సెక్స్ 77,550.25 వద్ద ముగిసింది. ప్రపంచ పరిణామాలు అనుకూలంగా ఉండటం మరియు దేశీయ ఆర్థిక స్థితి బలంగా ఉండటం పెట్టుబడిదారులను ఉత్సాహపరిచింది. నిఫ్టీ సాంకేతిక దృశ్యంపై నిపుణులు మాట్లాడుతూ, 24,000 స్థాయికి దిగువన స్పష్టమైన బ్రేక్ వస్తే, ఇటీవలి పెరుగుదల ధోరణి తిరోగమించి మళ్లీ "సెల్ అండ్ ఐజ్ మార్కెట్ ధోరణికి మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.



ఈ వారం ముఖ్యమైన అంశం ఏప్రిల్ 14న మార్కెట్ సెలవు ఉండటంతో వారపు ఎక్స్‌పైరీని ముందుగానే ఏప్రిల్ 13, సోమవారానికి మార్చడమని ఒక విశ్లేషకుడు తెలిపారు. తదుపరి వారంలో ప్రపంచ భౌగోళికరాజకీయ పరిణామాలు ప్రధానంగా గమనించాల్సి న అంశంగా ఉంటాయి. అమెరికా మరియు ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గే అవకాశాలపై వచ్చిన నివేదికలు మొదట మార్కెట్‌ను ఉత్సాహపరిచినా, చర్చలు స్పష్టమైన ఒప్పందానికి దారితీయకపోవడంతో అనిశ్చితి కొనసాగుతోంది.ఇక మార్చి 31తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన క్యూ4 ఫలితాలు కూడా కీలక పాత్ర పోషించనున్నాయి. 50కు పైగా కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి. క్రూడ్ ఆయిల్ ధరలు కూడా మార్కెట్ భావజాలాన్ని ప్రభావితం చేయనున్నాయి. తాత్కాలిక కాల్పుల విరమణ అవకాశాలు మరియు సరఫరా మెరుగుదలపై అంచనాల నేపథ్యంలో ఆయిల్ ఫ్యూచర్స్ 2022 తర్వాత అత్యధిక వారపు పతనాన్ని నమోదు చేశాయి.ప్రపంచ మార్కెట్ల సంకేతాలు అనుకూలంగా కొనసాగుతూ, దేశీయ ఆర్థిక పరిస్థితులు బలంగా ఉంటే మార్కెట్ ఎగువ ధోరణిని కొనసాగించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా. భౌగోళికరాజకీయ ప్రమాదాలు ఇంకా కొనసాగుతుండటంతో పెట్టుబడి దారులు జాగ్రత్తగా వ్యవహరించే అవకాశముంది.

### భారత్‌లోని గృహాల వద్ద బంగారం విలువలు

# ఐదు లక్షల కోట్ల డాలర్లు



**ముంబయి, ఏప్రిల్ 12:** దేశంలో బంగారం,వెండిధరలు ఒడిదుడుకులకు గురవుతున్నా అసోచామ్ నివేదిక వెల్లడించిన డేటాను చూస్తే భారతీయ ఆర్థిక వ్యవస్థలో గృహాల వద్ద ఉన్న బంగారం యొక్క అపారమైన శక్తిని, దాని ప్రాముఖ్యతను వివరిస్తున్నాయి. భారతీయ కుటుంబాల వద్ద ఉన్న సుమారు ఐదులక్షలకోట్ల డాలర్ల విలువైన బంగారం, ప్రపంచంలోని మొదటి పది కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న మొత్తం నిల్వల కంటే ఎక్కువగా ఉండటం విశేషం.బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లో నమోదైన అన్ని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ కంటే కూడా ఈ బంగారు నిల్వల విలువ అధికంగా ఉండటం గమనార్హం. ఇది మన దేశంలోని ప్రైవేట్ సంపద యొక్క పటిష్టతను చాటిచెబుతోంది. ఇంకా చెప్పాలంటే ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల జిడిపిని కూడా అధిగమించింది. ఇది దేశంలోని అపారమైన ప్రైవేట్ సంపదను ప్రతిబింబిస్తుంది. ప్రపంచ ఆర్థిక ముఖచిత్రంతో పోల్చినప్పుడు, అమెరికా, చైనా వంటి అగ్రరాజ్యాల వార్షిక జీడీపీ మినహా, మిగిలిన అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల కంటే భారతీయ గృహాల వద్ద ఉన్న బంగారం విలువ ఎక్కువగా ఉంది. ఈ అపారమైన సంపదలో మెజారిటీ భాగం ఆభరణాలు, బిస్కెట్ల రూపంలో ఇళ్లలోనే నిశ్చలంగా ఉండిపోవడంతో, దేశ ఆర్థిక వృద్ధికి అది ప్రత్యక్షంగా తోడ్పడలేకపోతోంది.

ఈ బంగారం ఒక "స్తబ్ద ఆస్తి"గా మిగిలిపోయింది. ఉత్పాదక రంగాల వైపు మళ్ళించడం ద్వారా దేశ ముఖచిత్రాన్ని మార్చవచ్చని నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ ఏడాది బంగారం, వెండి పెరుగుదలపై సంచలన నివేదిక.. ఏకంగా ఆ స్థాయి వరకు వెళుతుందంటున్న నిపుణులు గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్, బంగారు రుణాలు, ఇతర డిజిటల్ లేదా పొదుపు ఉత్పత్తుల ద్వారా ఈ నిశ్చల సంపదను అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడం అత్యవసరం. ఇలా చేయడం వల్ల తయారీ రంగం, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ రంగాలకు అవసరమైన భారీ పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయి. ప్రతి ఏటా దేశీయంగా ఉన్న బంగారంలో కేవలం 2శాతం మాత్రమే ఆర్థిక వ్యవస్థలోకి మళ్ళించగలిగితే, 2047 నాటికి సుమారు 40 శాతం బంగారం వ్యవస్థీకృతమై దేశ వృద్ధిలో భాగస్వామ్యం అవుతుంది. ఈ ప్రక్రియ ద్వారా ఆర్థిక వ్యవస్థకు అదనంగా 7.5 ట్రిలియన్ డాలర్ల మేర లబ్ధి చేకూరుతుంది.




# ఎస్‌బిఐ ఫండ్స్ నుంచి కొత్తగా రెండు ఆఫర్లు

**ముంబయి, ఏప్రిల్ 12:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెల కోట్లాది రూపాయలు మ్యూచువల్ ఫండ్స్‌లోకి వచ్చాయి. గత మార్చి నెలలోనే రూ.40 వేల కోట్లకు పైగా కొత్తగా ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చాయి. ఈ వారం మొత్తం 4 కొత్త ఫండ్స్ లాంచ్ అవుతున్నాయి. అందులో రెండు లాంగ్‌షార్ట్ ఫండ్స్ ఉన్నాయి. వీటి సబ్‌స్క్రిప్షన్ ఈనెల 15వ తేదీ నుంచే మొదలవుతోంది. ఫోర్ట్ ఫోలియోల ఖాళీలను పూరించడంతో పాటు దీర్ఘకాలంలో మంచి లాభాలను అందించేలా కొత్త ఫండ్స్‌ను ఫండ్ హౌస్‌లు లాంచ్ చేస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు కొత్త ఫండ్స్ ఉన్నాయి. ఎస్‌బీఐ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 36 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్ లాంచ్ అవుతోంది. ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 15వ తేదీన మొదలై 20వతేదీ వరకు అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.5వేలుగా నిర్ణయించారు.

ఇక రెండో స్కీమ్ ఎస్‌బీఐ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 912 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 15వ తేదీ నుంచి 20వ తేదీవరకూ కొనసాగనుంది.కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించారు. ఆ తర్వాత రూ.5 వేల చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు లాంగ్‌షార్ట్ ఫండ్స్ లాంచ్ అవుతున్నాయి. ఇందులో డబ్ల్యూఎస్ఐఎఫ్ ఈక్విటీ ఎక్స్ టాప్ 100 లాంగ్ షార్ట్ ఫండ్ ఏప్రిల్ 15వ తేదీన లాంచ్ అయి ఏప్రిల్ 29వ తేదీ వరకు ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.10 లక్షలుగా ఉంది. ఇక రెండోదీ డబ్ల్యూఎస్ఐఎఫ్ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 15న మొదలై 29 వరకు కొనసాగనుంది.

# మ్యూచువల్‌ఫండ్స్ వైపు జెన్‌జీ ఫోకస్

**ముంబయి, ఏప్రిల్ 12:** స్టాక్ మార్కెట్లకు ప్రత్యామ్నాయంగా జెన్‌జీ ఎక్కువగా మ్యూచువల్ ఫండ్స్‌వైపు వెళుతున్నారు. కాంపౌండింగ్ కారణంగా లాంగ్ రన్‌లో సంపద విపరీతంగా పెరుగుతుందని చెబుతుంటారు. ఇక స్టాక్ మార్కెట్లలో ఐపీఓలు ఉన్నట్లే మ్యూచువల్ ఫండ్లలో న్యూ ఫండ్ ఆఫర్ ఉంటుంది. ఐపీఓ అంటే ఏదైనా కంపెనీ తొలిసారిగా షేర్ల విక్రయం ద్వారా నిధుల్ని సమీకరించడం. ఎన్ఎఫ్ఓలకు ముందుగా నిర్దిష్ట సమయం సబ్‌స్క్రిప్షన్ పీరియడ్ ఉంటుంది. అప్పుడు కాస్త తక్కువ ధరకే మ్యూచువల్ ఫండ్ యూనిట్లు వస్తాయి. తర్వాత మళ్లీ కొన్ని రోజులకు రెగ్యులర్‌గా క్రయవిక్రయాలకు అందుబాటులోకి తీసుకొస్తాయి. ఇపుడు మరో రెండు కొత్త ఎన్ఎఫ్‌లు వచ్చాయి. ఒకటి యాక్సిస్ మ్యూచువల్ ఫండ్. ఇది యాక్సిస్ నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ ఫండ్‌ను లాంఛ్ చేసింది. ఇది ఒక ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. నిఫ్టీ ఇండియా డిఫెన్స్ టీఆర్ఐలోని కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. దాదాపు 95 నుంచి 100 శాతం వరకు ఈ కేటగిరీ కంపెనీ స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెడుతుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ చివరి తేదీ ఈనెల 24 గా ఉంది. మొదటిసారి పెట్టుబడులు పెట్టే వారు సిప్ లేదా లంప్ సమ్ ఏదైనా కనీసం రూ. 100 నుంచి ప్రారంభించొచ్చు. గరిష్ఠ పరిమితి లేదు. ఫండ్ మేనేజర్‌గా నందిక్ మల్లిక్, రోహిత్ గౌతమ్ వ్యవహరిస్తున్నారు. కోటక్ మ్యూచువల్ ఫండ్ కాస్త సరికొత్తగా కోటక్ మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్‌ను తీసుకొచ్చింది. ఇక్కడ ఈక్విటీ, డెట్, కమొడిటీల్లో అన్నింట్లో ఒకేసారి పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ ఎన్ఎఫ్ఓలో పెట్టుబడి పెట్టేందుకు ఈనెల 22 వరకు అవకాశం ఉంది. ఇది ఫండ్ ఆఫ్ ఫండ్స్ రకానికి చెందినది. ఇది ఇతర మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. కనీస పెట్టుబడి ఇక్కడ రూ. 1000 గా ఉంది. మార్కెట్ పరిస్థితుల్ని బట్టి ఫండ్ మేనేజర్లు ఈ ఫండ్‌లో ఎంత డబ్బు పెట్టాలో నిర్ణయిస్తారు.

# విస్తరణ బాటలో 'బజార్‌నౌ'




**బెంగళూరు, ఏప్రిల్ 12:** భారతదేశంలో క్విక్ కామర్స్ రంగం మెరుపువేగంతో దూసుకుపోతోంది. ఈ పోటీలో ఇప్పుడు కొత్తగా బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న బజార్‌నౌ అనే స్టార్టప్ హాట్ టాపిక్‌గా మారింది.ఈస్టార్టప్ సుమారు దాదాపు రూ. 82 కోట్లు నిధులను సేకరించడానికి చర్చలు జరుపుతోంది. దిగ్గజ ఇన్వెస్టర్ల మద్దతు ఈ ఫండింగ్ రౌండ్‌లో ప్రముఖ కేపిటల్ సంస్థలు ఆంట్లర్, వైట్‌బోర్డ్ క్యాపిటల్ వంటి సంస్థలు కూడా ఈ పెట్టుబడులలో భాగస్వామ్యం పంచుకోనున్నాయి. క్విక్ కామర్స్ రంగంలో నమ్మశక్యం కాని వృద్ధి ఉండటంతో, ఇన్వెస్టర్లు ఇలాంటి కొత్త స్టార్టప్‌లపై గట్టి నమ్మకం ఉంచుతున్నారు. స్టార్టప్ హబ్ అయిన బెంగళూరు నుంచి వస్తున్న ఇలాంటి వినూత్న ఆలోచనలకు పెట్టుబడిదారులు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. జెప్టో మాజీ ఉద్యోగుల సరికొత్త ప్రయాణం బజార్‌నౌ స్టార్టప్‌ను జనవరి 2026లో ప్రియాన్షు జైన్, అర్జున్ హారీష్ , తరిత్మే మండల్ అనే ముగ్గురు యువకులు ప్రారంభించారు.గతంలో జెపో వంటి పెద్ద కంపెనీలలో కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉన్నవారు. క్విక్ కామర్స్ రంగంలోని లోతుపాతులు తెలిసిన వారు కావడంతో, చాలా తక్కువ సమయంలోనే వీరు ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించగలిగారు. సేకరిస్తున్న నిధులతో తమ డార్క్ స్టోర్ నెట్‌వర్క్‌ను 18కి పెంచాలని బజార్‌నౌ లక్ష్యంగా పెట్టుకుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.